# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జనవరి
2024

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి: 17** **సంచిక: 1**

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**


**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| విష్ణు ప్రియం– తిరుప్పావై | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| వ్రతములు ముక్తికి సోపానములు | 18 |
| గణుతికెక్కలేరు గర్వమున్న | 22 |
| ప్రహ్లాదుడు శ్రీనృసింహస్వామిని స్తుతించుట | 24 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 26 |
| మకర సంక్రాంతి | 31 |
| మీ ప్రశ్న–మా సమాధానం | 33 |
| ముకుందమాల | 36 |
| రామాయణ రత్నాకరం | 40 |
| వాడపల్లి వెంకన్న – కోర్కెలు తీర్చేవాడన్న | 45 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 47 |
| తిరుమల సర్వస్వం | 51 |
| ప్రత్యక్షదైవం శ్రీ సూర్యనారాయణుడు | 55 |
| అమ్మ కథలు- సుదర్శనుడు | 58 |
| సావిత్రీ గౌరీదేవి వ్రతం | 60 |
| ధనుర్విద్యా ప్రవీణుడు,వీరుడు అర్జునుడు | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# కాలమే భగవంతుడు

శ్రీవేంకటేశం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాల వలన మనమందరం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నూతన సంవత్సరంలో జీవించగలమని ఆశిస్తున్నాను.

శ్రీవేంకటేశం మాసపత్రిక కూడా ఈ పేరుతో ప్రచురించుటను నేటితో 16 సంవత్సరములు పూర్తి చేసుకుని 17వ సంవత్సరములోనికి అడుగిడింది. ఈ పత్రిక 2007లో నమో వేంకటేశాయ పేరుతో ప్రారంభమై జనవరి 2008 నుండి శ్రీవేంకటేశంగా పేరు మార్చుకుని మీ ముందుకు వచ్చింది.

కాలం స్వయంగా భగవంతుడే. ఈ కాలము మారుతూ ఉంటుంది. ప్రపంచంలోని ప్రతి జీవి, చెట్టు, పుట్ట, గుట్ట లాంటి ప్రతి వస్తువు ఈ కాల ప్రభావానికి లోనుకాక తప్పదు. ఈ కాలము పుట్టుకా, అంతమూ ఎవరికీ తెలియదు. ఈ చక్రంలో మనం కూడా కాలంతో పాటు పరిభ్రమించాల్సిందే. దీన్ని బాగా అర్థం చేసుకుంటే ఒక విషయం స్పష్టమవుతుంది. ఈనాటి మన వయస్సు తిరిగి రాదు. మన జీవితం ఈనాటితో ఒక సంవత్సరం తగ్గిందని గుర్తుంచుకోవాలి. ఈ జీవితంలో మనం సాధించాల్సిన పనులకు కాలము తగ్గిందని గుర్తుంచుకోవాలి. మనము ఈ భూమి మీద జీవించే కాలము ఒక సంవత్సరం నేటితో తగ్గిందన్నమాట. ఒకరకంగా ఈ నూతన సంవత్సరం మనల్ని హెచ్చరిస్తుంది. నాయనా నీ కాలము తగ్గుతోంది జాగ్రత్త అంటూ హెచ్చరిస్తుంది. దీనిని మనం తగిన విధంగా స్వీకరించి, దానికి అనుగుణంగా ప్రవర్తించవలసి ఉంటుంది. ప్రతి వ్యక్తి కొంతకాలం కోసమే ఈ భూమి మీదికి వస్తాడు. కాబట్టి ప్రతి నూతన సంవత్సరం నాడు మనము నూతన సంవత్సరం లోనికి ప్రవేశించామన్న ఆనందంతో పాటు మన ఆయుస్సు ఒక సంవత్సరం తగ్గిందని, ఈ భూమిమీద ఇంక కొద్దిరోజులే జీవిస్తామని, ఈ కొద్దిరోజులలో పూర్వపు పరీక్షిత్తు మహారాజు సాధన చేసినట్లు మనము చేయుట ఉత్తమము. కేవలం 7 రోజులే తన జీవితము ఉన్నదని తెలిసిన వెంటనే ఆ మహారాజు ఒక్క క్షణము కూడా వ్యర్థము చేయక ఋషిపుంగవులను ఆశ్రయించి భాగవతాన్ని విని సద్గతిని పొందాడు. మనము కూడా నేటినుండి లౌకికమైన, అక్కరకు రాని విషయాల పట్ల ఆసక్తి తగ్గించి, భగవంతుని విషయాలను తెలుసుకొనుచు, భగవత్ భక్తుల సాన్నిహిత్యము కోరుట ఉత్తమము. ప్రతి వ్యక్తికి మరణం తథ్యం. మనం సంపాదించిన ఏ వస్తువూ మన వెంట రాదు. మన బంధు మిత్రులు కూడా వెంట రారు. అలాంటప్పుడు జీవించుటకు ఇబ్బంది లేనట్లు సౌకర్యాలు ఉంటే సరిపోతుంది. మిగిలిన కాలము భగవంతునిపై ధ్యాస నిలిపి ఆయన ధ్యానములో గడిపేవారు ధన్యులు. మనిషి భగవంతుని కొరకు ప్రయత్నిస్తే భగవంతుడు తప్పక ఆదుకోగలడు. మనం పొందిన ఈ మానవ జన్మ ఎంతో ఉత్కృష్టమైనది. ఈ మానవజన్మను ఉపయోగించుకుని భగవంతుని దృష్టిలో మంచివారనిపించుకోవటం ఎంతో అవసరం. అప్పడే ఈ జన్మము పొందిన ఫలము రాగలదు. సద్గ్రంథ పఠనము, సదా శ్రీవేంకటేశ్వరుని స్మరణ, లోకహితమైన కార్యాల యందు మాత్రమే మనస్సును పెట్టువారు తప్పక మంచి ఫలితాలను పొందగలరు. భగవంతుని త్రికరణశుద్ధితో నమ్మిన ఏ వ్యక్తీ చెడిపోలేదు. కాబట్టి ఈ నూతన సంవత్సరంలో ప్రతి వ్యక్తీ ఉన్నంతలో తృప్తి చెందుచు, అత్యాశను వదిలి శ్రీవేంకటేశ్వరుని స్మరిస్తూ, ఆయన లీలలను చదువుతూ జీవించువారు జీవితమును ధన్యము చేసుకోగలరు. భగవంతుడు భక్తప్రియుడు. మనము ఆయనను చేరుటకే మనకు ఈ మానవ జన్మను ప్రసాదించారు. కాబట్టి దీనిని సద్వినియోగము చేసుకొనుట మన చేతిలోనే ఉంది.


నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।।

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో॥ భృంగావళీచ మకరంద రసాను విద్ధ
ఝుంకార గీత నినదైః సహ సేవనాయ ।
నిర్యాత్యుపాంత సరసీ కమలోదరేభ్యః
శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – వేంకటేశా! ఆలయ సమీపములో నున్న సరస్సుల నుండి తామరపూలలోని మకరందమును త్రాగుటచే కల్గిన ఆనందముతో తుమ్మెదలు ఝుంకారము చేయుచు నిన్ను సేవింపవలెనని పూలనుండి వరుసలుగా బయటకు వచ్చుచున్నవి. స్వామీ నీకు సుప్రభాతమగు గాక!

శ్లో॥ యోషాగణేన వరదధ్ని విమథ్యమానే
ఘోషాలయేషు దధిమంథన తీవ్రఘోషాః
రోషాత్ కలిం విదధతే కకుభశ్చ కుంభాః
శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్

తాత్పర్యం – గొల్లపల్లెలోని గోపికలు తమ ఇండ్లలో పెరుగును చిలుకునపుడు పుట్టిన పెద్ద ధ్వనులు దిక్కులంతటా వ్యాపించినవి. ఆ ప్రతిధ్వనులు పెరుగుకుండలు, దిక్కులు ఒకదానితో ఒకటి కోపముతో మాట్లాడుట (తగవు) చేయుచున్నట్లు తోచుచున్నది. ఓ వేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

– డా॥ కె.వి. రాఘవాచార్యులు


## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") ఉచితం

# ముక్తిమార్గము





ఎవ్వరెవ్వరివాఁడో – యీ జీవుడు – చూడ
నెవ్వరికి నేమౌనో – యీ జీవుఁడు? ||పల్లవి||

1. ఎందరికిఁ గొడుకుగాఁ – డీ జీవుడు – వెనక
కెందరికిఁ దోఁబుట్టఁ – డీజీవుడు?
ఎందరిని భ్రమయించఁ – డీజీవుఁడు – దుఃఖ
మెందరికిఁ గావింపఁ – డీజీవుడు? ||ఎవ్వ||

2. ఎక్కడెక్కడఁ దిరుగ – డీజీవుఁడు – వెనక
కెక్కడో తనజన్మ – మీజీవుఁడు?
ఎక్కడి చుట్టము తనకు – నీజీవుఁడు ఎప్ప
డెక్కడికి నేగునో – యీ జీవుఁడు? ||ఎవ్వ||

3. ఎన్నఁడును జేటులే – నీజీవుఁడు – వెనక
కెన్ని తనువులు మోవఁ – డీజీవుడు?
ఎన్నఁగల తిరువేంక – టేశు మాయలఁ దగిలి
యెన్ని పదవులఁ బొందఁ – డీజీవుఁడు? ||ఎవ్వ||



భావము : ఈ జీవుడు ఎన్నో జన్మములలో ఎందరికో జన్మించుచున్నాడు. జనన మరణాత్మకమైన సంసార చక్రములో పరిభ్రమించుచున్నాడు. ఇట్టి జీవుడు ఏయే జన్మలలో ఎవ్వరెవ్వరికి ఏయే వావివరుసలలో సంబంధపడి యున్నాడో నిర్ణయించుటకెవరి తరము? విచారించగా జీవులలో ఒకరితో నొకరి కెట్టి సంబంధమును లేదు.

ఈ జీవుడెన్నో జన్మములలో ఎందరికో కొడుకై జన్మించినాడు. పూర్వము తానెందరికో తోబుట్టువుగా బుట్టినాడు. ఎందరినో ఎన్నో విధముల పుత్ర మిత్ర కళత్రాది సంబంధములతో భ్రమింపచేసినాడు. ఎందరినో ఎన్నో రీతుల దుఃఖముల పాలు చేసినాడు.

ఈ జీవుడు తిరుగని చోటే లేదు. ముందటి జన్మలలో ఎన్నోచోట్ల పలు రూపులతో జన్మించి తిరిగి యున్నాడు. తానున్న జన్మములో ఇతడెక్కడ పుట్టనున్నాడో? ఈ జన్మములో మాత్రము తనకీ జీవుడేవిధముగా అనుగు చుట్టము కాగలడు? ఇతడెప్పుడెక్కడికి పోవునో తెలియదుగదా!

ఇన్ని జన్మలు దాల్చుచున్నను, ఇన్నిసార్లు మరణించుచున్నను నిజముగా ఈ జీవునకు మాత్రము ఎట్టి చేటును లేదు. పూర్వమితడెన్నో తనువులు దాల్చినాడు. తాను దాల్చిన శరీరములే చేటొందుచున్నవి గాని సనాతనుడైన జీవాత్మునకేమాత్రము చేటు లేదు. శ్రీవేంకటేశ్వరుని మహా మాయా ప్రభావమునకు లోబడి ఈ జీవుడెన్నో పదవులు పొందుచున్నాడు.

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# “విష్ణుప్రియం - తిరుప్పావై”

: చింతలపాటి శివశంకర శాస్త్రి

“మృగశిర” నక్షత్రముతో కూడిన పూర్ణిమ గల మాసమును మార్గశిర మాసమంటారు. ఈ మాసం విష్ణువుకు ప్రీతికరం. ‘మార్గ’మనగా దారి. ‘శిర’మనగా తల. మానవ శరీరమునకు శిరము ఏవిధంగా దిశానిర్దేశం చేయునో, అదేవిధంగా ఈ మాసం ఆధ్యాత్మికత వైపు దారి చూపుతుంది. భగవదారాధనకు విశేషమైన కాలం. సౌరమానం ప్రకారం ధనుర్మాసమని అంటారు. ధనుః+మాసం = ధనుర్మాసం. ‘ధను’ అనగా దేనికొరకు ప్రవేశించెదమో అని అర్థము. ఆధ్యాత్మికత కొరకు, భక్తి ప్రపత్తుల కొరకు ఈ మాసం లోనికి ప్రవేశించెదము కావున ఇది ధనుర్మాసమయింది. ధనుర్మాసంలో నారాయణుని ఆరాధన విశేష ఫలాన్నిస్తుంది.

“మాసానాం మార్గశీర్షోహం... ఋతూనాం కుసుమాకరః” అన్నారు గీతాచార్యులు. మార్గశిరమాసం సాక్షాత్తు తన స్వరూపమని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఈ మాసమునకు మార్గ, సహో, అగ్రహో మణిక అనే పేర్లు కలవు. కైవల్య కారకమైన ఈ మాసం రమణీయం, మహనీయం, కమనీయం మరియు జగద్రక్షాకరం.

ధనుర్మాసంలో మధుసూదనుడు, వాసుదేవుడు అనే పేర్లతో పూజిస్తారు. ఈ మాసంలో దేవతలను విశేషంగా పూజించాలని, ఆలయాలను సందర్శించాలని పండితులు చెబుతారు. దేశవ్యాప్తంగా అన్ని వైష్ణవాలయాల్లోను ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ధనుర్మాసం నెల రోజుల పాటు సుప్రభాత సేవను నిలిపివేసి తిరుప్పావైను పఠిస్తారు. గోదాదేవి స్వామికి సమర్పించిన పాశురాలు అష్టాక్షరీ మంత్ర స్వరూపాలే. వేదోపనిషత్తుల సారమే. నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో స్వామిని ఆరాధిస్తే, పాశురములను ఆలపిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని లోకోక్తి.

“తిరుప్పావై” – “తిరు” అంటే శ్రీ అని, “పావై” అంటే గీతాలు లేదా వ్రతం అని అర్థం. తిరుప్పావైలో ఉన్న పాశురాలు ఛందోబద్ధంగా ఉన్న గీతాలు. మహాభక్తురాలు గోదాదేవిగా జన్మించిన ఆండాళ్ భగవంతుడినే భర్తగా భావించి, ఎంతో భక్తి పారవశ్యంతో పరమాత్మని స్తుతించిన పాశురాల సమాహారం.

తిరుప్పావై వ్రతాన్ని నియమ నిష్ఠలతో, విధి విధానాలతో ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ధనుర్మాసం తొలిరోజున ఈ వ్రతాన్ని ఆరంభించి, భోగి రోజున ఆండాళ్ శ్రీరంగనాథుల కళ్యాణం (గోదా కళ్యాణం) తో పరిసమాప్తి చేస్తారు. గోదాదేవి ఆలపించిన తిరుప్పావై లోని ముప్పది పాశురాల్లో అడుగడుగునా భక్తి పారవశ్యం గోచరిస్తుంది. వైదిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాంఘిక జీవన ప్రతీకలెన్నో ఇందులో పొందుపరచబడ్డాయి. కన్యలు తమకు మంచి భర్త దొరకాలని భగవంతుని ప్రార్థిస్తూ పాడే పాటలివి. పరమాత్ముడొక్కడే పురుషుడు. తక్కిన వారంతా స్త్రీలే. అందరూ ఆ పరమాత్ముని చేరవలసిన వారే. కనుక భక్తి సంప్రదాయంలో పావై పాటలకున్న ప్రాముఖ్యం గొప్పది. కన్యల మనోభావాలు, వారి భక్తి మార్గపు తీరు మొదలైనవన్నీ ఇందులో హృదయంగమంగా వర్ణించబడి ఉన్నాయి.

తిరుప్పావై లోని పాశురాలను ఆరు విభాగాలుగా చెపుతారు. మొదటి అయిదు పాశురాలలో ప్రాతిపదిక, జీవన్ముక్తికి కావలసిన హంగులను, మార్గాలను గురించిన ప్రశంస ఉంటుంది. పరమాత్మ తీరును, ఆతని చెంతకు చేరగోరినవారు పాటించవలసిన పద్ధతులు ఇందులో పొందుపర్చింది. జీవాత్మ పరమాత్మలో చేరడమే ఈ భక్తిమార్గం యొక్క లక్ష్యం. గమ్యం. తరువాతి పాశురాలలో పల్లెపట్టు అందాలను, అక్కడి పడుచులు ఉదయాన చేసే పనులను అందంగా వర్ణించారు. పెరుగు చిలికి వెన్న తీయడం, పాడిపశువులు మేతకు వెళ్ళడం మొదలైన అంశాలు కళ్ళకు కట్టినట్లు పాడుతూ, కన్యలు తోటివారిని లేపుతారు. తరువాతి పాశురాలలో ఉదయకాలపు వర్ణన అందంగా ఉంటుంది. పూలు వికసిస్తున్న తీరు, నక్షత్రాలు కనుమరుగయ్యే పద్ధతి, పక్షుల కిలకిలారావాలు, కోడి కూతలు, కోయిల పాటలను వర్ణించే ఈ గీతాలు అసలైన జానపద వాతావరణాన్ని మన ముందుంచుతాయి. చిక్కనయిన కవితకు ఉదాహరణగా చెప్పుకోవడానికి తిరుప్పావైకి మించింది లేదు. మొత్తం పాశురాలు ఒక నోముకు సంబంధించినవి మాత్రమేనని స్థూలంగా అనిపించే వీలుంది కాని, కవితలుగా అవి అనితరసాధ్యమైనవి. తత్వవిచారణ చేయగలిగేవారికి సముద్రమంత అర్థం కనబడుతుంది. చలిలో స్నానం, పాశురాల గానం, వ్యాఖ్యానం, ముద్గాన్నమనే పొంగల్ ప్రసాదం – అన్నీ కలిసి భక్తుల మనసులను పరమాత్ముని వైపు మరల్చుతాయి. సంక్రాంతి పండుగకు ముందు ముప్పయి రోజులు అనగా డిసెంబరులో (మార్గశిర మాసంలో) మొదలువుతుంది ధనుర్మాసం లేదా ‘‘మార్గళి’’. దక్షిణ భారత దేశంలో ఈ కాలం భక్తిభరితమైన కాలం. భక్తికి ఆలంబనగా నడిచే సంగీత, నృత్య, సాహిత్య సమ్మేళనాలకు అనువైన చక్కని కాలం. ఇందులో బయటకు కనిపించే అర్థం ఒకటయితే, పరమార్థం మాత్రం భగవన్నామ స్మరణమే ప్రధానంగా గోచరిస్తుంది.

పూర్వకాలంలో తమిళనాడు లోని విల్లిపుత్తూరు ప్రాంతాన్ని రాణి మల్లి పాలించింది. ఆమెకు విల్లి, కందన్ అని ఇద్దరు కుమారులు. వీరు విలువిద్యలో ఆరితేరినవారు. ఇద్దరూ ఒకనాడు వేటకోసం అడవికి వెళ్ళి జంతువులను వేటాడుచూ, వాటిని తరుముకుంటూ చెరోదారి వెళ్ళారు. ఆ సమయంలో కందన్ పై పులి దాడి చేయగా అతడు మరణించాడు. జంతువులను వేటాడుచూ చాలా దూరం వెళ్ళిన విల్లి అలసిపోయి ఒకచోట నిద్రపోయాడు. ఆ నిద్రలో భగవానుడు కనిపించి ఆ అరణ్య ప్రదేశంలో ఒక కొత్త ఊరును కట్టించమని ఆదేశించాడు. భగవంతుని ఆదేశంపై విల్లి ఒక కొత్త ఊరును కట్టించాడు. విల్లి కట్టించిన ఊరు కనుక ఆ ఊరికి విల్లిపుత్తూరు అనే పేరు స్థిరపడింది. భక్తి సామ్రాజ్యానికి, సంప్రదాయానికి ప్రధానమైనది విల్లిపుత్తూరు.

విల్లిపుత్తూరును ఆవాసంగా చేసుకొని అనంత శక్తిస్వరూపుడైన రంగనాథస్వామి కొలువైనాడు. ఆ ఆలయ అర్చకుడు విష్ణుచిత్తుడు విష్ణుభక్తులలో అగ్రగణ్యుడు. ఆతని మనస్సు విష్ణు పాదాలయందు, మాటలు విష్ణుగుణ సంకీర్తనమందు, చేతులు విష్ణు పూజామందిరము శుభ్రపరచుట యందు, చెవులు హరికథలు వినుటయందు, చూపులు గోవిందుని






రూపం చూడటమందు, తల కేశవునకు నమస్కారాలు చేయుట యందు, నాలుకు శ్రీనాథుని వర్ణించుట యందు, ఆతని ఆసక్తులు పుణ్య విషయాల యందు నిమగ్నమై ఉండేవి.

విష్ణుచిత్తుని దంపతులకు చాలాకాలం వరకు సంతానం కలగకపోవడంతో వారు పూజలు వ్రతాలు చేశారు. ఒకనాడు విష్ణుచిత్తుడు తులసి మొక్కలకు, ఇతర మొక్కలకు పాదులను ఏర్పాటు చేయడానికి మట్టిని తవ్వుతుండగా జనకునికి నాగేటి చాలులో దొరికిన సీతలాగా, విష్ణుచిత్తునికి గోదా తులసివనంలో లభించింది. తమకు భగవత్ ప్రసాదంగా లభించిన ఆ చిన్ని శిశువుకు ‘‘కోదై’’ అని నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచారు. కాలక్రమేణా కోదై – గోదాగా, గోదాదేవిగా పిలువబడింది. ‘‘గా దదా తీతి గోదా’’ అనగా చక్కని వాక్కులను ఇచ్చునది అని అర్థము. ‘‘జన్మ కర్మచమే దివ్యం’’ అని

శ్రీకృష్ణుడనినట్లు గోదాదేవి జన్మ, కర్మ, జ్ఞానము, భక్తి, ప్రపత్తి అన్నీ దివ్యమూ, భవ్యమైనవే.



విష్ణుచిత్తుడు గోదాకు అర్చామూర్తి వైశిష్ట్యాన్ని తీర్థ ప్రసాదాలతో రంగరించి పోశాడు. దానితో గోదాదేవి చిన్నతనం నుంచి భక్తి, జ్ఞాన, వైరాగ్యాది సుగుణాలను అలవరచుకొని, తండ్రి కొరకు ఇంటికి వచ్చిపోయే వారి ద్వారా హరికథలను వింటూ, రంగని గుణగణాలను విని రంగనిపై ఇష్టం కలిగింది. ఆ ఇష్టం ప్రీతిగా, ఆ ప్రీతి ప్రేమగా దినదినాభివృద్ధి చెంది ప్రవర్ధమానమైంది. ఆమెకు యుక్తవయస్సు వచ్చేసరికి శ్రీకృష్ణునే పెండ్లి చేసుకోవాలనే కోరిక బలపడింది. భగవంతునికై తండ్రితో పాటు పూలమాలలు తయారు చేసి, ముందుగా తాను ధరించి బాగున్నాయని అనిపిస్తే అప్పుడు భగవంతునికి అర్పించేది. అందువల్ల ఆమెకు ''శూడి కొడుత్త నాచ్చియార్'' అనే పేరు కలిగింది. కట్టిన పూమాలను ముందుగా తాను ధరించి, ఆ మాలను స్వామికి అర్పించిందని అర్థము. అందుకే ఆమెను ''ఆముక్తమాల్యద'' అని అంటారు.

ఒకనాడు యథావిధిగా తన కుమార్తె ఇచ్చిన మాలలను తీసుకొని వెళ్ళి దేవునికి సమర్పించబోగా దండలో తలవెండ్రుక కనిపించింది. విష్ణుచిత్తుడు ఆశ్చర్యపోయి తన కుమార్తెను అడుగగా ముందుగా మాలలను ధరించి బాగుంటేనే భగవంతునికి ఇచ్చుచున్నానని పలికింది. అందుకు తండ్రి మందలించగా భగవంతునికి సమర్పించే మాలలు సహజ సుందరంగా, అందరి మనసులు దోచేలా ఉండాలనే తలంపుతో ముందు తాను ధరించి, ఇచ్చుచున్నానని పలికింది. ఆనాటిరాత్రి మధుసూదనుడు విష్ణుచిత్తునికి కలలో కనిపించి, ఆమె ధరించి ఇచ్చిన మాలలే తనకిష్టమని చెప్పాడు. ఆనాటి నుండి అందరూ ఆమెను ''ఆముక్త మాల్యద''గా పిలిచేవారు. చిన్నతనము నుండి ఆనోటా, ఈనోటా వాసుదేవుని గాథలు విని, గుణగణములు విని యుండుట చేత రంగనాథునే తన భర్తగా ఊహించుకొనెడిది. రోజులు గడిచేకొద్దీ ఆ భావన ఆమె మనసులో దృఢంగా స్థిరపడి, రంగనాథుని పతిగా కోరి ధనుర్మాసం నెలరోజులు మార్గళి వ్రతాన్ని ఆచరించి రోజూ ఒక పాశురం చొప్పున నెలరోజులు 30 పాశురాలతో మహావిష్ణువుని కీర్తించింది. స్తుతించింది. సేవించింది.

గోపికలు ఆచరించిన కాత్యాయనీ వ్రతమనే ధనుర్మాస వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించింది. స్వామి నివేదించిన నైవేద్యాన్ని ప్రసాదంగా స్వీకరిస్తూ, ఒంటిపూట మాత్రమే ఆహారం తీసుకుంటూ, కటిక నేలమీదే నిద్రించేది. ఈవిధంగా కఠిన నియమాలతో ఆచరించగా ఆమె భక్తికి, అపారమైన ఆమె ప్రేమకు స్వామివారు ప్రసన్నులై ఆమెను పరిణయమాడారు. ఆమె తండ్రి గోదాదేవిని తీసుకొనివెళ్ళి రంగనాథస్వామితో వివాహం జరిపించాడు. వివాహం జరిగిన వెంటనే గోదాదేవి రంగనాథునిలో ఐక్యమయింది.

''వఙ్గ కడల్ కడైన్ద మాధవనై కేశవనై'' అనే పాశురం 30వ పాశురం. ఫలశ్రుతి. దీనితో తిరుప్పావై వ్రతం ముగుస్తుంది. గోదాదేవి ఆచరించి చూపిన ఈ స్నాన వ్రతం వలన మనలో శారీరక మానసిక క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఒక లక్ష్యమంటూ ఏర్పరచుకున్నాక దానిని సాధించేవరకు విశ్రమించకూడదనే పట్టుదల, కృషి, దీక్ష ఏర్పడుతుంది. గోదాదేవి భక్తి తత్పరతలను ఆలంబనగా చేసుకొని ఆనాటి నుండి నేటివరకు ప్రతి ఒక్కరు వేడుకగా ఉత్సవాలను జరిపిస్తూ తరిస్తున్నారు.

ధనుర్మాసం నెలరోజులు దేవాలయాలలో స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తారు. మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తరువాతి పదిహేను రోజులు దధ్యోదనాన్ని నివేదన చేస్తారు. ధనుర్మాస వ్రతం చేసినవారికి ఇహపర సౌఖ్యం కలుగుతుందని పురాణ వచనం. ఈ మాసంలో తులసిపూజ చాలా ప్రశస్తమైనది. గోవునకు శాస్త్రోక్తంగా పూజచేసి గౌరవించిన అనంతఫలం కలుగుతుంది. గోవుకు ప్రదక్షిణ చేసిన భూలోక ప్రదక్షిణ చేసిన ఫలితం దక్కుతుంది.

గోదాదేవి మార్గళి వ్రతం, పాశురాలు మధుర భక్తికి తార్కాణాలు. ఒక్కొక్క పాశురం పరతత్త్వానికి ప్రతీక. హృదయమే కేంద్రంగా చేసుకొని వ్రతం చేసిన ఆండాళ్‌ను ఆధ్యాత్మిక యోగినిగా శ్రీకృష్ణ దేవరాయలు ''ఆముక్త మాల్యద''లో వర్ణించాడు. తిరుప్పావైను రచించిన ఆండాళ్ పన్నెండుగురు ఆళ్వార్లలోని ఒకే ఒక స్త్రీ – ప్రేమోన్మాద ఫలితమైన మధురభక్తికి తిరుప్పావై మార్గదర్శకం చేస్తుంది. ద్రవిడ భాషలో ఈ గీతాలను ''దైవీ వాక్కులు'' అని అంటారు.

ధనుర్మాసంలో తిరుమల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవను సహితం రద్దు చేసి, ఆండాళ్ రచించిన తిరుప్పావై పాశురాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పఠిస్తారు. పాశురాలలో ''కడారై వెల్లుమ్ శీర్ గోవిందా'' అన్న పాశురంలో ''గోవింద'' నామాన్ని ప్రయోగించి స్వామిని కీర్తించారు. ''తిరుప్పావై''ను అనుసరించేవారు, ఆచరించేవారు ఆ గోదా రంగనాయకుల పరిపూర్ణమైన కటాక్షాన్ని పొందుతారు. కావున మనమూ త్రికరణశుద్ధిగా ఆచరించి తరిద్దాము. ఈ జగత్తంతా ఏ శక్తి (భూదేవి) చేత రక్షించబడుతుందో ఆ శక్తి (జగన్మాత)ని అర్చించి సన్మంగళాలను పొందుదాము.

**"సర్వ మంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధకే**
**శరణ్యే త్రయంబికే దేవి నారాయణి నమోస్తుతే"**




# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ.. నా దశ

**10వ భాగము**

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**



దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 10 వ భాగపు లీలల ప్రచురణ (అక్టోబర్ 2003 నుండి ఫిబ్రవరి 2004).

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు అక్టోబర్ 2003 నుండి నాకు తెలియకుండానే నా మార్గాన్ని మార్చాడు. రానున్న రోజులలో నేను ఏవిధంగ జీవించాలో సూచించుటకు కొన్ని హితబోధలు, జ్ఞాన బోధలు చేసాడు. నాకు ఇంతవరకు గురువు లేడు. శ్రీవేంకటేశ్వరుణ్ణే గురువుగా, స్వామిగా, దైవముగా నమ్మాను. ఇప్పుడు ఒక గురువు తన శిష్యునికి ఏవిధంగా జ్ఞాన బోధ చేస్తాడో, ఆ విధంగా జ్ఞాన బోధ చేశాడు. అందులో మొదటి జ్ఞాన బోధ: "భవిష్యత్ ఎలాగుండునో నీకు తెలియదు, నీవు ప్రతిక్షణము నన్నే స్మరింపుము, నీకు శుభం కలుగుతుంది" ఈమాట సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడే బోధించాడు. స్వామివారి శిక్షణ మానసికంగ ఉంటుంది, వారు ఏమి చెప్పదలచుకున్నా, ఆ స్థితిని ప్రత్యేకంగా అనుభవించేటట్లు చేస్తూ హితబోధ చేస్తాడు. ఇప్పుడు కూడా నా జీవితములో ఎప్పుడూ ఊహించని ఒక భయంకర సంఘటనను సృష్టించి ఆ వాతావరణంలో ఈ జ్ఞాన బోధ చేశాడు. ఎప్పుడూ మరువలేని విధంగా, నా మనస్సులో శాశ్వతంగా ముద్రించుకుపోయే విధంగా బోధించాడు.

## సదా స్వామివారిని స్మరిస్తూ జీవించమని చెప్పుట

భగవంతుని లీల క్షణక్షణము మారుతుంది. ఒక క్షణంలో మనం సురక్షితంగ ఉండవచ్చు, మరుక్షణంలో మనకు తెలియకుండానే పెద్ద ఆపద సంభవించవచ్చు. ఆ ఆపద మన మంచికై కావచ్చు, కాని ఆ క్షణంలో భయభ్రాంతులకు గురవుతాము. బహుశా భయములో ఆ దేవుణ్ణి సదా స్మరించుట కొరకే ఆ ఆపద కలిగించునేమో. ఏ క్షణం ఏవిధంగా ఉండునో మనకు తెలియదు, కావున మన మొత్తం భారమును ఆయనపై వదిలి కేవలము ఆయనను స్మరిస్తూ జీవించవలెననే సందేశమును ఈ

లీల ద్వారా తెలియచేశాడు.

24-10-2003 కల : అది ఒక పెద్ద వెడల్పైన నీటితో నిండిన సరస్సు. కనుచూపు మేర ఆ సరస్సు యొక్క అంచు కనబడలేదు. ఆ సరస్సు దట్టమైన ఎత్తైన చెట్లతో పచ్చని తీగలు కలిగిన చెట్లతో నిండి ఉంది. అలాంటి సరస్సుపై నేను ఒక హెలికాప్టరు లాంటి దానిలో ప్రయాణిస్తున్నాను. అది నీటికి కేవలము ఐదు అడుగుల ఎత్తులో మాత్రమే పోతుంది. అది ఏమాత్రం క్రిందికి గాని, ప్రక్కకు గాని పోయినట్లైతే ఆ చెట్లలో చిక్కుకుని భస్మమైపోవుట ఖాయం. ఈ హెలికాప్టర్ అత్యంత వేగంగా చెట్లను తప్పించుకోవడానికి మలుపులు తిరుగుచూ పోతుంది. ఇది పోవు మార్గంలో మాత్రమే చెట్లు లేవు. మిగిలిన ఉపరితలమంతా పెద్ద పెద్ద చెట్లతో నిండియున్నది. ఒక రకంగా 'అనకొండ' లాంటి ఇంగ్లీషు సినిమాలో మాదిరి నీరు ప్రవహించు చిన్నమార్గం తప్ప మిగిలిన ప్రాంతమంతా చెట్లతో నిండి ఉంది. ఈ మార్గం పైనుండి ఈ హెలికాప్టర్ ప్రయాణిస్తుంది. పరిస్థితి భయానకంగా ఉంది. ఆ సరస్సు పైనుండి ఎక్కడ చూచినా ఒడ్డు కనబడ లేదు. ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి. ఆ హెలికాప్టర్ చాల స్పీడుగా పోతోంది. నీటిని తాకే విధంగా పోతోంది. ఒకసారి కుడివైపుకు, మరోసారి ఎడమవైపుకు, ఒక్కొక్కసారి చక్కగా పోతోంది. ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో చెప్పలేని పరిస్థితి. ఆ హెలికాప్టర్‌లో నేనొక్కడినే ఉన్నాను. ఒక అదృశ్య శక్తి ఆ హెలికాప్టర్ ను నడుపుతోంది. ముందు ఒకింత భయపడ్డాను. వెంటనే కలలో ఆ స్వామిని మనసారా ధ్యానించాను. భయము తగ్గింది. ఈ హెలికాప్టర్ అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఏక్షణంలో ఏమి జరుగునో తెలియదు. అసలు మరుక్షణం బ్రతికి ఉండగలనా అనే విషయం కూడ తెలియదు. కాబట్టి స్వామి స్మరణలో ఎలాంటి అవరోధము కలిగించక సదా శ్రీవేంకటేశ్వరుని మహామంత్రమును ధ్యానిస్తున్నాను. చాల కాలము గడిచింది, ఒడ్డు రాలేదు, హెలికాప్టర్ పోతూ ఉంది. నేను స్వామివారిని స్మరిస్తూ ఉన్నాను. కొంత సమయము తరువాత ఇది అంతా శ్రీవేంకటేశ్వరుని మాయ అని అనుకున్నాను. మరియు ప్రతిక్షణం భయపడుచూ ఉండడము కంటే ఆ శ్రీవేంకటేశ్వరుని పైన పూర్తి విశ్వాసమును పెట్టి, శరణు జొచ్చి స్మరిస్తూ, ధ్యానించుకుంటూ ఉండడమే ఏకైక మార్గం అని, దీనిని మించిన మార్గం మరోటి లేదని కలలోనే భావించాను. ప్రతిక్షణం స్వామివారిని స్మరించుకుంటూ ఆ హెలికాప్టరులో చాలాసేపు ప్రయాణించాను. చివరికి సురక్షితంగా బయటపడ్డాను. "నీవు భయపడ్డావా?" అని ఆ అదృశ్యశక్తి అడిగింది. అందుకు జవాబుగా నేనెందుకు భయపడుతాను "నాకు మహామంత్రం వచ్చు" అని జవాబిచ్చాను. కల చెదిరింది.

"జీవితంలో ఏక్షణం ఏవిధంగా ఉండునో నీకు తెలియదు, నాకు తెలుసు, నీవు కష్టాలను లెక్కచేయక సదా నన్ను స్మరిస్తూ జీవించు నీకు శుభం కలుగుతుంది" అనే హృదయాంతర భావం వెనువెంటనే నా హృదయంలో ఏర్పడ్డది. అంటే మనకు వచ్చే ప్రతి కష్టాన్ని ఆయనకు వదిలి సదా శ్రీవేంకటేశ్వరుని స్మరిస్తూ జీవించమని ఆజ్ఞాపించాడు. ఇది ఈ లీల సారాంశం.

తెల్లవారి ఈ కల గురించి నేను ఇంతవరకే అర్థం చేసుకున్నాను. కాని తరువాత రోజులలో దీని నిజమైన అర్థమును ఈవిధంగా విశ్లేషించుకున్నాను. పైన చెప్పినట్లు ప్రతి క్షణం స్వామివారిని స్మరించాలి. అది కూడా శ్రీవేంకటేశ్వరుణ్ణే స్మరించాలి తప్ప అన్య రూపముల యందు మనస్సు పెట్టరాదు. ఈ సృష్టిలో ప్రతి దేవీ దేవతా రూపాలు శ్రీమన్నారాయణునివే. ఆయనే గత యుగాలలో నారసింహునిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా అవతరించి ప్రస్తుతము ఈ కలియుగంలో తిరుమల కొండపైన శ్రీవేంకటేశ్వరునిగా అవతరించాడు. ఆయనను మాత్రమే స్మరించుమన్నట్లు ఈ లీల ద్వారా ఆదేశమును పొందాను. ఇతర దేవీ దేవతలను, గత అవతారాలను కేవలం స్వామివారి గొప్పతనాన్ని, ఆయన వైభవాన్ని గుర్తించుటకు మాత్రమే ఉపయోగించాలి తప్ప స్మరణ మాత్రం శ్రీవేంకటేశ్వరుణ్ణే చేయాలని స్వామి ఆజ్ఞగా భావించుకున్నాను. భక్తుడు ఏ విధంగా, ఏ రూపంతో స్మరిస్తే భగవంతుడు ఆ రూపంలోనే అనుగ్రహిస్తాడు కాబట్టి, హరినామ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుడే మూలదైవం కాబట్టి ఇదే భావన సరైందనే భావన ఏర్పడింది.

మరో అద్భుతమైన జ్ఞాన బోధ చేశాడు. ఈ కలలో స్వామివారి కృపను పొందుటకు ప్రతిసారి ఆలయమునకు పోవలసిన అవసరము లేదని, మనమున్న స్థలములోనే స్మరిస్తూ ఉంటే సరిపోతుందని సూచించాడు.

సం॥ 2002 నుండి 2010 వరకు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసు వి.ఎస్.టి రోడ్డు విద్యానగర్ (నాగమయ్య కుంట) హైదరాబాద్‌లో సెల్లారులో ఉండేది. 2007 మరియు 2009 లో మూసీనది పొంగుట వలన రెండుసార్లు మా ఆఫీసు నీటిలో మునిగిపోయింది. ఫలితంగా స్వామివారి అనుభూతులు వ్రాసిన మొదటి రెండు పుస్తకములు నానిపోయాయి, చాల అనుభూతులు చదవడం కష్టంగా మారిపోయింది. ఈ అనుభూతి కూడా చదవడం కష్టంగా ఉన్న కారణంగా అర్థం చేసుకున్నంత వరకు ఈ లీలలో దీని భావమును వివరిస్తున్నాను.

## స్వామివారి కృపను పొందుటకు ఆలయం అవసరం లేదు

25-10-2003 కల : నేను నా భార్య సురేఖతో కలిసి ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయంలోనికి స్వామివారి దర్శనార్థం వెళ్ళాము. అది తిరుమల ఆలయం కాకపోయినప్పటికీ నేను తిరుమల శ్రీవారిని దర్శించుటకే వెళ్ళుచున్నాననే భావం, నా మనస్సులో బలంగా ఉంది. దేవస్థానమువారు మాకు ప్రత్యేక దర్శన అవకాశమును కల్పించారు. మరియు ఆ సమయాన ఇతర భక్తులను నిలిపివేశారు. తిరుమల శ్రీవారు ఎప్పుడు కనిపిస్తారా అని ఎదురుచూస్తున్నాను. కాని అక్కడ శ్రీవారు లేరు. ఒక ఏడడుగుల పొడవు 2'-6" వెడల్పు, 3'-0" ఎత్తు ఉన్న ఒక అరుగు ఒక ప్రక్కన ఉన్నది. దాని పైన నేనున్నాను.


ఆ అరుగుకు కొద్ది దూరములో ఎదురుగ ఈ అరుగును చూస్తూ మా సురేఖ నిలబడ్డది. ఆ అరుగుకు శ్రీవేంకటేశ్వరుడు చిన్నగా అంటే 2'–6" ఎత్తుతో వెలసి ఉన్నాడు. ఆయనను మా సురేఖ చూస్తున్నది. నాకు మాత్రం కనబడుటలేదు. నేను ఆ అరుగుపై పడుకొని క్రిందికి తలపెట్టి చూస్తున్నాను. స్వామివారు కొంచెం కనబడ్డారు. ఆభరణాలను అలంకరణను పూజారి తీసివేసాడు. నా మనస్సులో స్వామివారు 6 అడుగుల ఎత్తు ఉండాలి లేరే అని అనుకుంటున్నాను. ఇంతలో ఈ అరుగుకు ఎదురుగా ఒక అత్యంత నల్లని గుండులాంటి రాయి "బలిపీఠం" లాగా కనబడ్డది. (ఇక్కడ కొంత చెదిరిపోయింది) దీనికి వేరే ప్రక్క 6 అడుగుల శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడనే భావన కలిగింది. ఇంతలో నా మనస్సులో స్వామిని పొందటానికి విగ్రహము అవసరము లేదు. గుడికి వెళ్ళడము అవసరము లేదు. భక్తితో స్మరిస్తూ ఉంటే వారి కటాక్షమును పొందగలము అనే బలమైన భావాలు నా హృదయాంతరంగం నుండి వెలువడ్డాయి. ఇది కల.

ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు రెండు హితోపదేశాలు చేశాడు. నీకు ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ వెరవక సదా స్వామివారిని స్మరించమన్నారు. మరోసారి నీవు ఇంట్లోనే ఉంటూ, స్వామిని స్మరిస్తూ ఆయన కృపను పొందవచ్చని చెప్పాడు.

శ్రీవేంకటేశ్వరుని ప్రథమ 7 కోట్ల జప సమర్పణ తరువాత స్వామి సేవకై ఎక్కువ పని లేకపోయింది. 2వ జప సమర్పణ వరకు వేచి ఉండాలి. ఇప్పుడు మేము 'నమో వేంకటేశాయ' రథమును తయారుచేయాల్సి ఉన్నప్పటికి, దానిని మొదలు పెట్టనందున విరామం దొరికింది. ఈ విరామ సమయము నాకు రుచించలేదు. ఎప్పటికీ నిరంతరంగా స్వామివారి సేవాభాగ్యం దొరికితే బాగుండుననిపించింది. వెంటనే స్వామివారిని ప్రార్థించాను. మరింత సేవాభాగ్యాన్ని ప్రసాదించుమని దీనాతిదీనంగా ప్రతిరోజూ వేడుకున్నాను. నేను మీ సేవలో తృప్తి చెందలేదని, తృప్తి కలిగే వరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. విరామ సమయాలు వద్దు ప్రభూ! నేను తట్టుకోలేనంటూ వేడుకున్నాను. ఫలితంగా శ్రీవేంకటేశ్వరుడు నన్ను మరో మెట్టు పైకి ఎక్కించుటకు సిద్ధంగా ఉన్నాడు. స్వామివారు ప్రసాదించిన 'సేవ' అనే వృక్షానికి మరో శాఖ పుట్టుకొస్తుంది.

## శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం

దాదాపు తేది 26–10–2003 ప్రాంతమున, సుభాషిణి అనే ఒక భక్తురాలు మా ఆఫీసుకు ఫోన్ చేసి మాట్లాడింది. శ్రీవేంకటేశ్వరుని పైన ఒక మాసపత్రికను ప్రారంభించుదామని, తాను కొన్ని పైసలను



పెట్టుకోగలనని చెప్పింది. నాతో కలిసి ఈ పత్రికను స్థాపించాలని ఉన్నదని అన్నది. ఈ విషయం విన్నంతనే 'నమో వేంకటేశాయ' అను పత్రికను పెట్టినచో బాగుండునని యాదృచ్ఛికంగా, నా ప్రమేయం లేకుండానే నా నోటి నుండి పలికాను. ఇది కేవలం స్వామివారి సేవ గురించి మాత్రమే ఉండాలన్నాను. ఇది స్వామివారి మహిమలను తెలిపే విధంగ ఉండాలని మరియు, దీనిని ఏలాంటి ధనాపేక్షతో చేయరాదని అన్నాను.

తేది 30-10-2003 నాడు ఉదయం శ్రీమతి సుభాషిణి మా ఆఫీసుకు నేరుగా వచ్చింది. ఆమెతో ముఖాముఖీ చర్చ జరిగింది. ఈ పత్రిక ప్రారంభించాలని తనకు అమితమైన కోరిక ఉన్నదన్నది. తన బంధువర్గము వారు ఈ రంగములో ఉన్నందున ఇబ్బంది ఉండదన్నది. ఈ పత్రికకు నాతో సమానంగా డబ్బులు పెట్టగలనన్నది. నన్ను ఆమెతో కలువమన్నది. ఇద్దరము కలిసి ఈ పత్రికను ప్రారంభించుదామన్నది. ఇంతే కాకుండా ఈ పత్రికలో 5-6 భాగాలను పెట్టాలని, స్వామి చరిత్ర, పూజా విధానము, ఏ కష్టానికి ఏవిధంగా సేవించాలి? స్వామివారి వివిధ ప్రాంతాలలో వెలసిన గుడుల చరిత్ర, భక్తుల అనుభవాలు ఇలా ఒక్కొక్క భాగంలో ఒక్కొక్కటి పెట్టాలన్నది. మరియు ముఖచిత్రము అద్భుతంగా ఉండాలనుచూ, మొదటి కవరు పేజీపై శేషతల్పముపై నారాయణుడు ఉన్న విధంగా ఉండాలని అన్నది. అప్పుడు నేను "మనము శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవిస్తున్నాము, పత్రిక పేరు 'నమో వేంకటేశాయ' కావున శ్రీవేంకటేశ్వరుణ్ణి నమస్కారములతో సేవిస్తున్న చేతులను చూపుచు స్వామివారిని చూపాలని, ఇది నా అభిప్రాయమని అన్నాను." మరియు ఇప్పుడు మేము 'నమో వేంకటేశాయ' అను దివ్యరథమును తయారు చేస్తున్నాము కాబట్టి ఒక సంవత్సరం తరువాత చూద్దామనే విధంగా చెప్పాను. ఇంతటితో సంభాషణ ముగిసింది. ఆమె వెళ్ళిపోయింది. ఈ రాత్రి స్వామివారు ఒక అద్భుతమైన లీల చూపెట్టారు. అది ఈవిధంగా ఉంది.

31-10-2003 కల : ఈ కలలో నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించుటకు మంచి పట్టువస్త్రాలు (పంచె, లాల్చీ) ధరించి ఒక గుడికి వెళ్ళుచున్నాను. ఆ గుడి ఒక పెద్ద కొండపైన ఉంది. ఆ కొండ ఒకే రాయితో ఏటవాలుగ నిర్మితమై ఉంది. ఆ కొండ శిఖరాగ్రాన ఈ గుడి నిర్మితమై విద్యుత్ లైట్లతో ధగధగ వెలుగొందుచున్నది. కొండ ప్రారంభం నుండి గుడి వరకు అర కిలోమీటరు కంటే ఎక్కువ దూరమే ఉంటుంది. నేను ఈ గుడిలోని శ్రీవారిని దర్శించుకొను నిమిత్తము ఆ కొండను ఎక్కుచున్నాను. ఆ గుడి, ఈ కొండమొత్తం కూడ టి.టి.డి వారిదని, నేను తిరుమల శ్రీవారిని దర్శించుటకు పైకి వెళ్ళుచున్నాననే భావన నా మనస్సులో ఉంది. ఇంతలో దారిలో నా కుడి ప్రక్క 6 అడుగుల ఎత్తుతో శ్రీలక్ష్మీనారాయణుడు శేషతల్పముపై కూర్చున్నవిధంగా కనబడ్డాడు. అది ఎప్పటిదో కట్టెతో చేసిన విగ్రహములాగా ఉంది. దానికి పసుపుపచ్చ, ఎరుపు మొదలైన రంగులతో పెయింటింగు వేసినట్లు ఉంది. ఈ విగ్రహము చాల పాతది, రంగులు అక్కడక్కడ పోవుచున్నవి. శ్రీమన్నారాయణుని చేతిలో శంఖు చక్రములు ఉన్నవి. ఆయన తొడపై లక్ష్మీ అమ్మవారు కూర్చొని ఉన్నారు. వారు 3-4 వరుసలు చుట్టుకొని ఉన్న పాముపై కూర్చున్నారు. వారి తలపై శేషుడు పడగ విప్పి ఉన్నాడు. దీనిని నా కనులార చూచాను. ఇది నేను వెళ్ళేదారి ప్రక్కన ఉంది. దీనిని చూచిన వెంటనే నిన్న 'నమో వేంకటేశాయ' పత్రిక కవరుపైజీపై శేషతల్పముపై కూర్చున్న శ్రీలక్ష్మీనారాయణుడు ఉండవలెనని శ్రీమతి సుభాషిణిగారు సూచించిన విషయం కలలోనే గుర్తుకొచ్చింది. తరువాత నేను పైకి నడిచి వెళ్ళుచున్నాను. అది పండువెన్నెల ఆహ్లాదకరమైన వాతావరణము, కావున నేను ఈ వాతావరణాన్ని అనుభవిస్తూ మెల్లమెల్లగ పైకి నడుస్తున్నాను. అందరు భక్తులు పంచెలు ధరించి స్వామివారి దర్శన నిమిత్తము పోవుచున్నారు. నా వెనుక ఒక అబ్బాయి దాదాపు 23 సంవత్సరాల వయస్సు, నల్లని శరీరము ఆరడుగుల ఎత్తు కలిగి పంచెతో ఉత్తరీయముతో జంధ్యంతో చాల స్పీడుగా కేవలం గుడినే చూస్తూ వస్తున్నాడు. ఆ నల్లనివాడు పరిసరాలను పట్టించుకోకుండా కేవలం ఆ పైనున్న భగవంతునిపై మాత్రమే పూర్తి ధ్యాస పెట్టి శరీరాన్ని, పరిసరాలను మరచాడు. ఎప్పుడు ఆ గుడిని చేరుతాను, ఎప్పుడు ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించుకుంటాననే లక్ష్యం మాత్రమే ఆయనలో కనబడ్డది. అందుకు ఆయన నడక వేగంగా, పాదాలను పూర్తిగా నేలకు ఆనించకుండా, కేవలం మునికాళ్ళపై అంటే కాలి వేళ్ళపైననే నడుస్తున్నాడు. ఈ వ్యక్తి నాకు ప్రత్యేకంగా కనబడ్డాడు. నా సంపూర్ణ దృష్టి ఈయనపై కేంద్రీకరించి చూస్తున్నాను. ఇతర భక్తులు స్వామి దర్శనార్థమై వెళ్ళుచున్నప్పటికీ వారెవ్వరూ నాకు కనబడలేదు. ఊహ మాత్రమే! కాని నేను మరియు ఈ నల్లనివాడు మాత్రము శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థము కొండ ఎక్కుచున్నట్లు స్పష్టంగా కనబడ్డది. ఇంతలో ఒక్కసారి ఆకాశము మెరిసినట్లు కాంతి వచ్చింది. అప్పుడు నా ముందు ఆ కొండపై ఒక లేయరుగ ఉన్న బండ అయిపోయింది. అక్కడ ఒకేసారి లోతు వచ్చి దాదాపు 10 అడుగుల లోతు నుండి మళ్ళీ ఈ బండ మొదలైంది. లేదా ఒడ్డెరవాడు రాయి కొట్టుట వలన పెద్ద గుంత ఏర్పడినట్లు ఉంది. నేను ఈ కాంతిలో ఆ గొయ్యిని చూచి భయముచే అక్కడనే ఆగిపోయాను. ముందుకు వెళ్ళలేదు. కాని నా వెనుక వస్తున్న ఆ నల్లని కుర్రాడు మాత్రము దాన్ని లెక్కచేయకుండ కేవలం స్వామినే చూస్తూ ముందుకెళ్ళాడు. ఆ గుంతలో పడిపోయాడు. కాని ఏమి కానట్లు మళ్ళీ లేచి అదే స్పీడుతో స్వామివారిని చూస్తూ ముందుకు పోయాడు.

ఈ నల్లనివాడు కేవలం శ్రీవేంకటేశ్వరుణ్ణి చేరడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాడు. దారిలో ఎదురుగా ఎలాంటి పరిస్థితులకూ బెదరక స్వామి యందే దృష్టి నిలిపి ముందుకు సాగిపోతున్నాడు. ఇతనిని ఆదర్శంగా తీసుకొమ్మనే ఒక హృదయాంతర భావం నాకు కలలోనే ఏర్పడింది. ఆ దారిని తిరుమల తిరుపతి దేవస్థానము వారు కాపలా కాస్తున్నారు. వీరు టి.టి.డి సెక్యురిటీవారు ధరించే స్కైబ్లూ షర్ట్స్, తెల్లని పంచెలు ధరించి ఉన్నారు. ఒక పెద్ద నల్లని నీటి పైపుతో ఆ దారినంతా కడుగుతున్నారు. ఆ నీటి స్ప్రే పొగలాగా కనబడ్డది. నేను ఆ

ప్రక్కన ఉన్న సెక్యూరిటీతో "ఏమండీ ఇంతమంది భక్తులు వచ్చేదారిన ఈ గొయ్యి ఉన్నది. ఇది అపాయము కదా, భక్తులు చూడక ఇందులో పడిపోతారు, మీరు అక్కడ సెక్యురిటిగా ఉండాలని'' అన్నాను. ఇంతలో ఒకరు వచ్చి అక్కడ నిలబడి భక్తులను ప్రక్కనుండి వెళ్ళండి అని చెప్పుచూ, మేము ఇక్కడ ఉన్నాము, ఇప్పుడే ఒక పని మీద ప్రక్కకు పోయామని అన్నాడు. పిదప నేను కొండపైకి పోవుచున్నాను. కల చెదిరింది. ఇది నాకు పత్రిక నిమిత్తమై వచ్చిన మొదటి కల.

తెల్లవారి దీనిని విశ్లేషించుకున్నాను. నన్ను శ్రీవేంకటేశ్వరుడు 'నమో వెంకటేశాయ' పత్రికను ప్రారంభించమన్నాడని, ముందు వెనుక చూడకుండా, దేవునిపైన భారము వేసి ముందుకు సాగిపొమ్మని చెప్పాడని భావించాను. ఒకవేళ క్రింద పడిపోయినప్పటికీ, దెబ్బలు తాకినప్పటికీ వాటిని లెక్కచేయక కేవలం స్వామి యందే దృష్టి నిలిపి ఈ సేవను చేసినట్లైతే, నేను శ్రీవేంకటేశ్వరుని వద్దకు చేరగలననే విషయమును సూచించాడని భావించాను. అంటే శ్రీవారిని పొందవచ్చునని సూచించాడు.

కాని అప్పుడు మేము 'నమో వేంకటేశాయ' రథం తయారీలో నిమగ్నమై ఉన్నాము కాబట్టి దీనిపై దృష్టి పెట్టలేదు. తరువాత చూద్దాం అనే విధంగ వదిలేశాము.

## స్వామి కంటే ఆస్తికే విలువ ఇస్తున్నావని చెప్పట

ఆస్తి గొడవలు : ఆ సమయములో మా దృష్టి మొత్తం మియాపూర్‌లో ఉన్న మా ఆస్తిని రక్షించుకొనుటలోనే ఉన్నది. ఆస్తిపై వ్యామోహం ఎన్నోరెట్లు పెరిగింది. ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకునే స్థితిలో లేము. ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తున్నాము, రక్షించమని వేడుకుంటున్నాము. తేది 08-11-2003 నాడు కొంతమంది వ్యక్తులు నా స్థలములోనికి వచ్చారు. వారికి ముందే ఈ స్థలములో ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయినవని చెప్పుచు కబ్జా చేయ ప్రయత్నించారు. భూమి దగ్గరికి వెళ్ళాము, పోట్లాడాము వారిని రాకుండా చేసినప్పటికీ దీనితో చాల బాధపడ్డాను. ఇది నాకున్న ఒకే ఒక ఆస్తి ఏమౌతుందో అని భయపడ్డాను. విచారంగా ఉంది. ఈరోజు పూర్తిగా దీనావస్థలో గడిచింది. అదే చింతలో పడుకున్నాను. ఒక మంచి కల కన్నాను. ఈ కలలో నా అంతరంగాన్ని స్వామివారు చూపెట్టారు. కాని ఆస్తి వ్యామోహములో ఉండి దీని సరైన భావాన్ని గ్రహించలేక పోయాము.

08-11-2003 కల : నేను మరియు నా భార్య సురేఖ కలిసి శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం తిరుమల వెళ్ళాం. అప్పుడు కొండపైన స్వామివారి బ్రహ్మోత్సవము లాంటి ప్రత్యేక ఉత్సవములు జరుగుచున్నవి. వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. అందరూ స్వామివారికై వేచి చూస్తున్నారు. మేము మాత్రం ఆకలిగా ఉందని ఒక హోటల్‌లోనికి వెళ్ళి పూరీ తింటున్నాము, భక్తుల హడావిడి మేళ తాళాల చప్పుడు విని స్వామి వచ్చారని భావించి బయటకు వచ్చాము. అప్పటికే దేవస్థానమువారు బాజా భజంత్రీలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొని వెళ్ళారు. రెండు వైపులా పెద్ద పెద్ద కట్టెలను భుజాలపై పెట్టుకొని ఆ కట్టెలపై బల్లలాంటి దానిపై స్వామివారు ఉన్నారు. స్వామివారిని తాళ్ళతో వెనుకనుండి కదలకుండా కట్టారు. నేను హోటల్ నుండి బయటకు రాగానే వారు వెళ్ళిపోయారు. మేము స్వామి ముఖమును చూడలేదు. కాని వెనుక వైపు చూచాము. పూజారులు పూజలు చేసుకుంటు, వేద పఠనం చేయుచు వెళ్ళారు. ఇక్కడ స్వామివారు సాలిడ్‌గ కాకుండా 6 అడుగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లాంటి అట్టతో చేసిన ఎంబోజింగ్ లాగా ఉన్నారు. ముందు ప్రక్క మాత్రమే స్వామి రూపం కనబడ్డది వెనుక ప్రక్క డొప్ప పోయినట్లు ఉన్నది. ముందు ప్రక్క రంగులు వేసి అలంకరించారు, వెనక ప్రక్క కేవలం ఒక అట్టలాగ ఉన్నది. ఇది పడకుండా తాళ్ళతో కట్టారు. ఈ ఊరేగింపును జనాలు చూస్తున్నారు. నేను నా భార్య మాత్రం వెనుక నుండి చూచాము. ముందు స్వామివారి ముఖమును చూచే అదృష్టము కలగలేదు. కల చెదిరింది.

ఈ కలలో మా మానసిక స్థితిని స్పష్టంగా తెలియచేశాడు. మేము స్వామివారి కంటే భోజనానికే ఎక్కువ విలువ ఇచ్చాము. స్వామివారి కృపావిశేషం చేత తిరుమలకు తీసుకుపోబడ్డాము, బంధించి ఉన్న స్వామివారిని వెనుక నుండి దర్శించాము. దీనర్థం మేము స్వామివారు ఆశించిన స్థాయికంటే చాల చిన్న స్థాయిలో ఉన్నాము. స్వామి కంటే ఆస్తికే ఎక్కువ విలువనిచ్చే స్థితిలో ఉన్నామని అర్థం. మా ప్రవర్తనచే స్వామివారు బాధపడ్డారని అర్థం.

## కొండలను లోయలుగ, లోయలను కొండలుగ చేయుట

సం॥2000 నుండి ఎన్నో స్వామివారి లీలలను చూస్తున్నాము. ఈ లీలలు ఒక వరుస క్రమములో ప్రసాదించుట వలన ఏదో తెలియంది సాధించుటకు ప్రసాదించుచున్నారని గ్రహించాము. స్వామివారు ప్రసాదించు ప్రతి లీల ప్రభావము ఒక వారం పది రోజులే గుర్తుండేది. ఆ తరువాత మరిచేవాడిని, మళ్ళీ ఒక క్రొత్త లీల కావాలని దీనంగా ప్రార్థించేవాడిని. స్వామివారు ఒక విషయం కేవలం ఒక్కసారి మాత్రమే చెప్పేవారు. దానిని గుర్తుపెట్టుకొని వ్యవహరించుట నా కర్తవ్యంగా సూచించేవారు. కాని నేను మాత్రం వీటిని పట్టించుకోలేదు. మొదట్లో స్వామివారి చాలా లీలల అర్థమును సహితము గ్రహించలేకపోయాను. స్వామి లీలలను చూడాలనే నా కోరికను తీర్చుటకు మాత్రమే వీటిని ప్రసాదించాడని భావించేవాడిని. అలాంటి ఒక అద్భుతమైన లీల ఇప్పుడు జరిగింది. అప్పుడు దీనిని అర్థం చేసుకోలేదు పైగా దీనిని నా అనుభూతులను వ్రాసే పుస్తకములో కూడ వ్రాయలేదు. నా దైనందిన పుస్తకములో వ్రాసుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

స్వామివారు ఈ లీలలో ఒక చక్కని జ్ఞానబోధ చేసారు. మన స్థితిగతులను క్షణంలో మార్పు చేయునని సూచించాడు. క్షణంలో కొండలను లోయలుగా, లోయలను కొండలుగా చేయునని సూచించాడు.

లీల : నేను హిమాలయ పర్వతప్రాంతము లాంటి ప్రదేశములో లేక నేపాల్ లాంటి ప్రదేశములో ఉన్నాను. చక్కని వాతావరణముతో ఆ ప్రదేశం అత్యంత ఆహ్లాదకరంగా ఉంది. ఒకప్రక్క పెద్దపెద్ద కొండలు, మరోప్రక్క అత్యంత లోతైన లోయలు కనబడ్డవి. ఈ కొండలు లోయలు ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయి. అది పండు వెన్నెల రాత్రి, ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతి ఆనందాన్ని అనుభవిస్తూ నిలుచున్నాను. ఇంతలో గడగడమని ఒక పెద్ద శబ్దం వినబడింది. నేను ఆ శబ్దం వచ్చిన దిశలో చూచాను. ఒక అద్భుతమైన, ఆశ్చర్యకరమైన దృశ్యమును చూచాను. నా దృష్టి ఆ అద్భుతాన్ని అలాగే చూస్తూ నిలబడ్డది. అసలు ఏమి జరుగుచున్నదో నమ్మలేదు. అసలు జరిగింది, అక్కడున్న కొండలు గడగడమని శబ్దం చేసుకుంటూ లోయలుగా మారిపోతున్నాయి. మరోప్రక్క అక్కడున్న లోయలు గడగడమని శబ్దం చేసుకుంటూ, పెరుగుతూ పెరుగుతూ కొండలుగా మారిపోవుటను చూచాను. ఈవిధంగా క్షణంలో కొండలు లోయలుగా, లోయలు కొండలుగా మారిపోవుటను చూచాను. ఇంతే కల.

అత్యంత స్పష్టంగా కలను చూపెట్టాడు. ఒకరకంగా ధనవంతులని బీదవారిగా, బీదవారిని ధనవంతులుగా క్షణంలో మార్చగలనని సూచించాడు. అంటే రాబోవు కాలములో నీ ఆర్థిక పరిస్థితి దిగజారిపోవునని అది శ్రీవేంకటేశ్వరుని కృపతోనే జరుగునని సూచనప్రాయంగా తెలిపాడు.


23-11-2003 భూ సమస్య : నన్ను భయపెడుచున్న మధ్యవర్తి మోసం చేయుటలో నేర్పరితనం కలవాడు. మా ప్రక్క భూమివారిపై కోర్టు స్టే తెచ్చాడు. వారి భూమిని కబ్జా చేస్తున్నాడు. ఈ మధ్యవర్తి తప్పక నాపైకి కూడా వచ్చునని తలచాను. భయపడ్డాను, శ్రీవేంకటేశ్వరుని నానా విధాలుగా ప్రార్థించాను. నాలుగు గోడల మధ్యన ఉన్న ఒక పామును కొట్టుచున్నప్పుడు అది ఏవిధంగా వేగంగా పరుగెడుచూ, తప్పించుకొనుటకు ఏదో ఒక రంధ్రం గురించి వెతుకునో, నేను ఆ విధంగా స్వామివారిని ప్రార్థించాను. ఏ కోణంలో ప్రార్థిస్తే స్వామివారు కరుణిస్తారనే దృష్టితో ప్రార్థించాను. చివరికి చక్కని ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ప్రకారం నా ల్యాండ్ భూమి పేపర్సును స్వామిచెంత పెట్టాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! వీటిని కాపాడండి, సమస్య తీరిన తరువాత నాకు ఇవ్వమన్నాను. దొంగల భయము ఉన్నప్పుడు మన వస్తువులను లాకర్లలో పెట్టినట్లు, నా భూమిని స్వామివద్ద పెట్టాను. రక్షించమన్నాను. దీనితో మనశ్శాంతి లభించింది.

రథం : ఒక ప్రక్క భూ సమస్యను ఎదుర్కొంటున్నాను. మరో ప్రక్క 'నమో వేంకటేశాయ' రథమును అత్యంత సుందరంగా నిర్మించాలనే ఆలోచనతో ఉన్నాను. తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము మోడల్‌ను నిర్మించాలి. దీనికి క్రింది భాగములో "కృతేతు నారసింహోభూత్, త్రేతాయాం రఘునందనః, ద్వాపరే వాసుదేవశ్చ, కలౌ వేంకటనాయకః" అనే శ్లోకానికి తగినట్లు, స్వామివారి ఆయా యుగాలలోని రూపాలను, ఈ రథం క్రింది భాగములో ఏర్పాటు చేయాలని భావించాము. దానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాను. రథాన్ని ముందు ఇనుప రాడ్స్ తో వెల్డింగ్ చేయాలి, ఆ తరువాత టేకు చెక్క బిగించుకుంటూ మహామంత్ర స్థూపపు ఆకారానికి తీసుకురావాలి. ఆ తరువాత దీనికి బ్రాస్ తొడుగులను ఫిక్స్ చేయాలి అని నిర్ణయించాము. ఎంతోమందిని విచారించి ఈ నిర్ణయానికి వచ్చాను. అత్యంత సుందరంగా, 25 సంవత్సరాల వరకూ చెక్కుచెదరకుండా ఉండే విధంగా ధృడంగా చేయాలనుకున్నాను. అయితే ఈ రథంలో నాలుగు ప్రక్కలలో నాలుగు శ్రీవారి మూర్తులను అమర్చవలసి ఉంటుంది. వీటికి కళ్ళు తెరచి ఉండాలా లేక మూసి ఉండాలా? అనే అనుమానం కలిగింది. విషయం గురించి తెలుసుకొనుటకు తేది 19-12-2003 నాడు ఎక్స్ ఈవో కీ.శే. పి.వి.ఆర్.కె ప్రసాద్ గారిని కలిశాను. నా గురించి, నా సమస్యల గురించి స్వామి ప్రసాదించు అనుభూతుల గురించి చెప్పాను. మరియు స్వామివారి విగ్రహములు ఏవిధంగా పెట్టాలని అడిగాను. నా అనుభూతుల కాపీలను కొన్నింటిని వారికిచ్చాను. వారు తిరుపతిలోని ఉత్సవ విగ్రహముల మాదిరిగా చేయమన్నారు. ఇక నా సమస్యల గురించి ఇలా చెప్పారు. స్వామివారు నాకు తోడుగ ఉన్నారని భావించినట్లైతే, ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టక స్వామి సేవ చేయమన్నారు.

## నాలుగు ధృవమూర్తులను దర్శించుట

పటిష్ఠంగా అత్యంత సుందరంగా 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయాలనే నా సంకల్పానికి బహుశా శ్రీవేంకటేశ్వరుడు ఆనందపడ్డాడు. నా వెతుకులాటకు చక్కని జవాబు ఇచ్చునట్లు ఒక అద్భుతమైన లీలను చూపాడు. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం లాంటిది. జీవితాన్ని ధన్యం చేసేది. ఇంతవరకూ ఏ భక్తుడూ ఇలాంటి అనుభూతిని చూచి ఉండడు. ఈ లీలకు ప్రతిగా నా మరో జన్మను కేటాయించగల స్థాయి కలిగింది. స్వామివారి అభిషేక రూపమంటే నాకెంతో ఇష్టం. స్వామివారిని గులాబీలతో అర్చించుట మరెంతో ఇష్టం. ఈ లీలలో అభిషేక రూపములో స్వామివారు ఒకేసారి నాలుగు రూపములుగా కనబడి నా పూజను స్వీకరించారు. నన్ను మహదానంద భరితుణ్ణి చేశారు. ఒక రకంగా 'నమో వేంకటేశాయ' రథం ఈవిధంగా ఉండాలని సూచించారు. ఈ రథం ప్రతి భక్తుని వద్దకు వెళ్ళినప్పుడు వారు ఆచరించవలసిన విధానాన్ని కూడ సూచించాడు.

21-12-2003 కల : ఈనాటి కలలో నేను, కుటుంబంతో కలిసి తమిళనాడు వైపు ఉన్న ఒక శ్రీవేంకటేశ్వర ఆలయమునకు వెళ్ళాము. ఆలయంలో నాలుగు రాతిస్తంభాలతో ఉన్న ఒక మంటపాన్ని చూచాను. ఆ మంటపములో నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో లింగమునకు స్వామి (శివుడు) నాలుగు ప్రక్కల ఏవిధంగ ఉంటాడో, ఆ మండపములో ప్రతి ప్రక్క నా స్వామి అర్చామూర్తిగ నిలుచుని ఉన్నాడు. ఆయన అచ్చంగా తిరుమల కొండపై శ్రీవారిని అభిషేకిస్తున్న సమయంలో అడ్డ పంచెతో ఉన్నవిధంగా ఉన్నాడు. ఆరడుగుల




ఎత్తు, అత్యంత నల్లగా, మరియు చాల నున్నగా ఉన్నాడు. కొండపైన మూల విరాట్టుకు ఈయనకు తేడా లేదు. ఆయన అభయహస్తమును, కటి హస్తమును చాల దగ్గరగా చూచాను. ముఖమును, శంఖు చక్రములను, సంపూర్ణ శరీరమును అత్యంత దగ్గరగా స్పష్టంగా చూచాను. ఈయన దృఢకాయుడు మరియు అత్యంత నల్లగా ఉన్నాడు. తెల్లని అడ్డుపంచె కట్టుకున్నాడు. నవ్వుముఖంతో ఆకర్షిస్తున్నాడు. ఈ నాలుగు రూపాలు ఒకేరకంగా ఉన్నవి. తరువాత కుడి ప్రక్కనున్న ఒక స్వామి పాదాలకు పూజ చేశాను. నా ప్రక్కనే అత్యంత విరబూసిన గులాబీల బుట్ట ఒకటుంది. చూచుటకు ఇవి దేవతా పుష్పములుగా ఉన్నాయి. అందులో నుండి తీసిన గులాబీలను స్వామి పాదాలపై నా రెండు చేతులతో సమర్పిస్తూ పూజించాను. నేను కేవలం ఆయన పాదాలకే పూజ చేసాను. మ్రొక్కాను. మనస్సులో నాలుగు ప్రక్కల నాలుగు స్వామివారలు ఉన్నారని భావన ఉంది. కాని నేను ఒక స్వామివారికి పూజ చేసాను. చివరికి నా తల ఆయన పాదములపై పెట్టాను. తనివితీర ప్రార్థించాను, ఇలా స్వామివారిని అత్యంత తృప్తిగా పూజించిన తరువాత బయటికి వచ్చాను. ఇక్కడ మరో చిత్రం జరిగింది. సీను మారిపోయింది నేను బయటకు వచ్చింది తిరుమలలోని స్వామివారి ఆనంద నిలయం నుండి, వెండి వాకిలి వరకు బయటకు రాగానే ఒక భక్తుడు పూజ దుస్తులతో ధ్వజస్తంభం చుట్టు ప్రదక్షిణలు చేయుటను చూచాను. తరువాత తృప్తి చెందక మళ్ళీ స్వామివారిని చూడాలనే కోరికతో మళ్ళీ లోనికి వెళ్ళాను. అక్కడి టి.టి.డి వారు ఎప్పటికీ మీరే వెళ్ళితే ఎట్లా అన్నారు. అప్పుడు కొంచెం ఆగాను. ఈ తప్పుకు శిక్ష అనుభవిస్తాను అని అనుకుంటూ, తిరిగి లోనికి వెళ్ళి స్వామి వారిని మళ్ళీ దర్శించుకున్నాను. ఆ రూపము సాక్షాత్ తిరుమలలోని మూల విరాట్టుదే! కల చెదిరింది.

ఈసారి స్వామివారిని తృప్తిగా చాలసేపు చూచాను. ఆయన పవిత్ర పాదాలకు పూజ చేసాను. నా తల ఆనించి నమస్కరించాను. ఇక నాకు కనబడిన నాలుగు స్తంభాలతో ఉన్న మండపము తిరుపతిలో అలిపిరి వద్దనున్న శ్రీవారి పాదాల మండపము.

(మేము ప్రతి సం॥ 7 కోట్ల జపమును, ప్రతి గోకులాష్టమి కంటే ఒక రోజు ముందు ఈ పాదాల మండపముపై పెట్టి పూజిస్తాము. అప్పుడు సాక్షాత్ తిరుమల శ్రీవారు ఇదే రూపంగా వచ్చి మా పూజను స్వీకరిస్తున్నారు. ఈ రూపమును ప్రతిసారీ నేను దర్శిస్తున్నాను.)

ఈ విధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా 'నమో వేంకటేశాయ' రథంలో నాలుగు ప్రక్కల, నాలుగు మూర్తులుగా విరాజమానుడై ఉండునని తెలిపారు. మరియు ప్రతి భక్తుని ఇంటికి వెళ్ళదునని సూచించాడు. భక్తులు ఆయన పాదాలను పూజించి, ఆ పాదాలపై వారి తలపెట్టి ప్రార్థించే భాగ్యమును ఆ ఇంటి యజమానులకు లేదా రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికీ ప్రసాదించారు. మరియు స్వామివారి అత్యంత సుందరమైన మూర్తులను నాలుగు ప్రక్కలా పెట్టాలని దిశానిర్దేశం చేసారు. ఇది నమో వేంకటేశాయ రథానికై స్వామివారు చూపిన మొదటి మరియు ముఖ్యమైన లీల.

మాస పత్రిక : ఈ నమో వేంకటేశాయ మాస పత్రిక ఎలా ప్రారంభించాలో తెలియక పోయినా, స్వామివారు దారి చూపుతారని భావించాను. మరియు శ్రీమతి సుభాషిణి గారు కూడా తోడు ఉన్నారనే ధైర్యంతో ఢిల్లీలోని ఆర్.ఎన్.ఐ వారికి టైటిల్ కోసం 22-01-2004 నాడు అప్లై చేశాను. ఇందులో నా మొదటి ఆప్షన్ 'నమో వేంకటేశాయ', రెండవది 'శ్రీవేంకటేశం' మూడవది 'శ్రీశ్రీనివాసం'. నాలుగవది 'వేంకటేశం!'. ఎందుకో కాని 'శ్రీవేంకటేశం' అనే పేరును వ్రాయునప్పుడు నా శరీరం పులకరించింది. తెలియని ఆనంద భావాలను పొందాను. తేది 27-04-2004 నాడు నాకు 'నమో వేంకటేశాయ' అనే టైటిల్ మంజూరు అయినట్లు ఢిల్లీ ఆర్.ఎన్.ఐ నుండి ఉత్తరమొచ్చింది. ఈ విషయం శ్రీమతి సుభాషిణి గారికి చెప్పాను. కాని ఆమె ఇప్పుడు ఏ సహాయమూ చేయలేనని, నేను ఈ పత్రికను ప్రారంభించాలనే ఉద్దేశ్యముతో ఆ రోజు తాను వచ్చానని చెప్పింది. అంటే పూర్తిగా జారుకుంది.

నేను కూడా ఈ పత్రిక నావల్ల కాదని, విషయజ్ఞానం లేదని, తెలుగు సరిగా రాదని ఊరుకున్నాను. అప్పటినుండి ఒకరకంగా మరచిపోయాము.

## సురేఖను నాగుపాము రూపంలో అనుగ్రహించుట

నా భార్య సురేఖకు ఎప్పటికీ కలలో మరియు ఊహలో ఒక నాగుపాము పడగ కనబడుచుండేది. దీనిని చూచి ఆమె

భయపడుచుండేది. ముందునుండి ఆమెకు పామంటే భయము. అందునా ఎప్పటికీ ఊహలో కలలో ఇదే కనబడుట వలన భయపడుచుండేది. భయపడవద్దని ఎంత చెప్పినా వినేది కాదు. మేము నేపాల్‌లో శ్రీపశుపతినాథ్‌ను దర్శించినప్పటి నుండి ఆమె కలలో మరియు మనస్సులో మామూలు పడగకు బదులుగ ఒక పాము రుంగ చుట్టుకుని దానిపైన పడగ ఎత్తి ఉండుటను చూస్తున్నది.

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించిన తరువాత రకరకాల స్వామివారి భక్తులతో పరిచయాలు ఏర్పడ్డవి. కొన్ని రోజుల క్రితం శ్రీమాన్ ఉపేందర్ రావు అనే వ్యక్తితో పరిచయమేర్పడ్డది. ఈయన ఒంటిమీదకి స్వామివారు పూనకము లాగ వచ్చేవారు, అప్పుడు ఈయన మన గురించి మంచి చెడులు భవిష్యవాణి చెప్పేవారు. మా ఆహ్వానం ప్రకారం తేది 23-01-2004 నాడు మా ఆఫీసుకు వచ్చాడు. మా సురేఖను చూచాడు. ఆ విధంగా పాము, లేదా పడగ కలలో కనబడ్డప్పుడు భయపడకూడదని అది సాక్షాత్ ఆదిశేషుడని చెప్పాడు. మరియు నీవు పామును చూచి భయపడకూడదని చెప్పుటకోసమే నీ దగ్గరికి ప్రత్యేకంగా వచ్చానని చెప్పాడు. ఇలా ఇంక ఇతర విషయాలు చెప్పుతున్నప్పుడు మా సురేఖ ఆయన తలకు ఒక ప్రక్క స్వామివారి ముత్యాలతో అలంకరించిన శంఖును చూచిందట. దీనికి పరవశురాలైన సురేఖ కళ్ళవెంబడి ఆనంద బాష్పాలు రాల్చింది. ఆమె ఒక ప్రత్యేక లోకంలో విహరించింది. ఈ శంఖు అక్కడే ఉన్న నాకు గాని, మరో ఇద్దరికి గాని కనబడలేదు. ఆమె ఒక్క దానికే కనబడింది. చివరికి ఆరోజు నుండి ఆమె కలలో పామును చూచి భయపడలేదు. ఈ రాత్రి స్వామివారు ఆమెకు ఒక లీలను ప్రసాదించారు.

24-01-2004 : ఈ రాత్రి సురేఖకు ఒక కల వచ్చింది. ఆమె ఒక నాగుపామును దర్శించింది. ఆ పాము రెండు మూడు చుట్టలు చుట్టుకొని, పడగ పైకి ఎత్తి ఉన్నట్లు కనబడింది. కాని చిత్రమేమిటంటే ఆ పాముకు పడగ లేదట, ఆ స్థానములో శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడట. అంటే పడగ తప్ప మిగతాదంతా పాము పడగ మాత్రము శ్రీవేంకటేశ్వరుడు. చుట్టుకొని ఉన్న పాము పైన పడగ ప్రదేశములో శ్రీవేంకటేశ్వరుడు నిలబడి ఉండుటను చూచింది. దీనిని చూచి ఆమె ఏమాత్రము భయపడలేదు. తెల్లవారి ఎంతో సంతోషంతో నాకు ఈ విషయం చెప్పింది. నేను కూడా




స్వామివారు నాకే కాకుండ నా భార్యను కూడ అనుగ్రహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపాను.

## నమో వేంకటేశాయ రథము తయారీ ప్రారంభము

తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపచే, ప్రేరణచే తేది 28-01-2004 నాడు 'నమో వేంకటేశాయ' రథము తయారు చేయుటను ప్రారంభించాము. ముందు 7' × 7' సైజుగల ఒక 'సి' ఛానల్‌ను తయారుచేసాము. ఆ తరువాత తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము యొక్క కొలతలకు అనుగుణంగా ఈ రథాన్ని తయారు చేయదలచాము. అత్యంత ఇష్టంతో, చిన్న తప్పు సహితం జరుగకుండా జాగ్రత్తపడ్డాము. ఇది చాలా పెద్ద పని. చాలా ఖర్చుతో కూడుకున్నది. ముందు స్కెలిటన్‌ను ఇనుముతో చేయాలి. తరువాత కట్టెతో రూపు తీసుకు రావాలి. ఆ తరువాత బ్రాస్ కవరింగు వేసి, ప్రతి ప్రక్క స్వామివారిని నిలపాలి. రథానికి మూడు ప్రక్కల క్రింది భాగంలో భగవంతుడు ఆయా యుగములలో ఉన్న రూపములను చూపెట్టాలి. అంటే నరసింహస్వామిని చూపుచు, ఇది సత్యయుగమని, శ్రీరాముణ్ణి చూపుచూ ఇది త్రేతాయుగమని, శ్రీకృష్ణుణ్ణి చూపుచూ ఇది ద్వాపరయుగమని, మరియు శ్రీవేంకటేశ్వరుణ్ణి చూపుచూ ఇది కలియుగమని చూపించాలనుకున్నాము. ఈ మొత్తమును ఒక లారీలో బిగించి, తిరుపతికి ఊరేగింపుగా భజనలతో తీసుకుపోవాలి. మార్గమధ్యంలో భక్తులచే స్వామివారి నామ జపమును వ్రాయిస్తూ ఈరథంలో వేయించుచూ తిరుపతికి తీసుకెళ్ళాలి అనే ఉద్దేశ్యముతో నిర్మిస్తున్నాము.

10-02-2004 కల : ఈనాటి కలలో నేను ఒక అత్యంత పెద్ద నాగుపామును తయారు చేస్తున్నట్లు కల కన్నాను. అత్యంత పెద్దపాము కాబట్టి ముక్కలు ముక్కలుగా తయారు చేసి అతికిస్తున్నట్లు కనబడ్డది. ఒకసారి పడగ, దాని క్రింది భాగము, నడుము ఇలా తయారుచేసి అతికిస్తూ అత్యంత పెద్దపామును తయారు చేస్తున్నట్లు కనబడ్డది. నేను దీనిని స్వామివారి ఆదిశేషునిగా భావించాను. చిత్రమేమిటంటే ఈ కల ఈరోజు నాకే కాకుండా నా భార్యకు కూడా ఇదే విధంగా కనబడ్డది. ఒకే కలను ఒకే విధంగా ఒకే రోజు ఇద్దరమూ కన్నాము.

## డొనేషన్స్ స్వీకరించమని సూచించుట

ఈ రథం చాలా ఖర్చుతో కూడుకున్నది కాబట్టి ఆసక్తి కలవారి నుండి కొంత ఆర్థిక సహాయాన్ని ఆశించాము. గత నాలుగు నెలల నుండి ప్రయత్నించినప్పటికీ చాలా తక్కువ సేకరించాము. ఇచ్చుటకు ఎవ్వరూ ఇష్టపడలేదు. నిజానికి మొత్తం డబ్బును నేనే భరించుటకు సిద్ధపడ్డాను. కాని స్వామివారి గురించి భిక్షమడుగుటలో ఎంతో ఆనందించేవాడిని, మరియు భక్తులను కూడ ఈ సేవలో భాగస్వాములు చేద్దామనే మరో ఆలోచనతో డొనేషన్స్ ను అడిగాను. మొత్తం 4 నెలల్లో అత్యంత అల్పంగా సేకరించగలిగాము. ఈ డొనేషన్స్ సేకరించుటకు

నా కారులో వెళ్ళేవాడిని. ఒక్కొక్కప్పుడు పెట్రోలు పైసలు కూడ వచ్చేవి కావు, పైగా నా సమయం వృధా అవుతుండేది. ప్రతిగా రథం తయారీ వద్ద ఎక్కువ సమయం ఉండేవాణ్ణి కాదు. చివరికి ఈ డొనేషన్లను పూర్తిగా ఆపివేశాను. మొత్తం నా సొంతంగానే తయారుచేయాలని నిర్ణయించుకున్నాను. నా సొంత డబ్బులతో చేయుట స్వామివారికి ఇష్టం అని భావించాను. ఇదే సమయములో మా ఆస్తి గొడవలను లేకుండా చేయమని, ప్రతిగా తన పుస్తెలతాడును సమర్పిస్తానని నా భార్య స్వామివారికి మ్రొక్కింది. ఈ విషయం తెలిసిన నేను "నీవు తిరుపతిలో స్వామి హుండిలో వేయటం కంటే మనము తయారు చేసే రథమునకు ఉపయోగిస్తే బాగుండు"నని అన్నాను. కొంత ఆర్థిక సహాయం లభించేదన్నాను. వెంటనే నేనెవ్వరిని ఇలా చెప్పుటకని అనుకొని ఆరోజు స్వామివారిని ప్రార్థించాను. "ప్రభూ! డొనేషన్స్ అడుగకూడదనే భావం ఏర్పడింది. కనీసం నా భార్య బంగారాన్నైనా వాడుకునే అవకాశం ఇవ్వమని" తేది 24-02-2004 రోజు వేడుకున్నాను. ఆజ్ఞ ఇవ్వమన్నాను. దానికి స్వామివారు ఒక లీల ద్వారా ఈ విధమైన సందేశమిచ్చారు.

25-02-2004 కల : ఈ కలలో నేను మా చిన్నగుండవెల్లి గ్రామములో మా పాత ఇంటిలో ఉన్నాను. సాయంత్రం బాగా వర్షం వచ్చి వెలిసింది. నేను మా తోటబావి వద్దకు పోవుటకు ఇంటినుండి బయలుదేరాను. దారి వెంబడి వరద ఛాయలు కనబడ్డవి. ప్రశాంతమైన వాతావరణము మనస్సుకు ఆహ్లాదాన్ని గొల్పుతోంది. కొంచెము చీకటిగా ఉంది. దారిలో నేనొక్కడినే ఊరు వీధినుండి నడుచుకుంటూ వెళ్ళుచున్నాను. గొల్లవారి వీధి వచ్చింది. అప్పుడు దారికి ఎడమ ప్రక్క ఒక గొల్ల పిల్లవాడు తన దగ్గరున్న అల్యూమినియం గిన్నెను పట్టుకొని కూర్చున్నాడు. తన గిన్నెను క్రింద పెట్టి దానమడుగుచు, మరో ప్రక్క ఆడుకుంటున్నాడు. తన వద్దనున్న రెండు నాణేములను పైకి ఎగిరేస్తూ, తిరిగి పట్టుకొనుచు ఆ దారిలో పోయేవారిని దానమడుగుచున్నాడు. ఆ దారిలో నేనొక్కడినే ఉన్నాను. వీడిని చూడగానే వీడికి డబ్బు అవసరములేదు సంతోషం కోసం అడుక్కుంటున్నాడని అనుకున్నాను. అయినప్పటికీ వాడితో "ఏమిరా ఎందుకు భిక్షమడుగుతున్నా"వన్నాను. అందుకు వాడు "ఊరికే ఆడుకొనుటకు" అని బదులిచ్చాడు. నిజంగా నేను అనుకుంటున్నట్లుగానే వాని జవాబు ఉంది. వాడు తృప్తి చెందుటకు, సంతోషించుటకు మాత్రమే అడుగుచున్నాడు తప్ప అవసరానికి కాదు అని గ్రహించాను. కల చెదిరింది.

దీనర్థం నిజానికి నా వద్ద డబ్బు ఉన్నప్పటికి నేను నా సంతోషం కోసం మాత్రమే డొనేషన్లను అడిగాను. కాని అవసరముండి కాదు. మరోప్రక్క అవసరమైతే డొనేషన్లను అడుక్కొమ్మన్నారు కాని నా భార్య బంగారాన్ని మాత్రం స్వామివారికి సమర్పించమన్నారని భావించాను. (ఈమె ముందే తిరుపతిలో సమర్పిస్తానని భావించింది కాబట్టి)

మొత్తంమీద తరువాత కాలంలో ఎవ్వరినీ డబ్బులు అడగలేదు. నా భార్య బంగారాన్ని స్వామివారికి సమర్పించ నిర్ణయించాము. మొత్తం రథమును నా సొంత డబ్బులతో తయారు చేయ నిర్ణయించాము.

ఒక విశ్లేషణ : (ఎ) స్వామివారు ఒక ప్రత్యేక పద్ధతిలో తన సేవా భాగ్యమును నాకు ప్రసాదిస్తున్నారు. నాకు ప్రసాదించిన ప్రతి దానినీ తిరిగి తన భక్తులకు చేరే విధంగ చేయుట నా ధర్మంగా దిశా నిర్దేశం చేశారు. ఈ లీలలో నేను తిరుమల శ్రీవారిని పొంది పూజించాను. ఆయన పాదాలను పూజించి వాటిపైన తలపెట్టి ప్రార్థించాను. ఈ భాగ్యాన్ని నమో వేంకటేశాయ రథం ద్వారా భక్తుల ఇంటికి స్వామివారిని తీసుకెళ్ళి, వారికి కూడా ఇలా స్వామివారి పాదాలపై తలపెట్టి పూజించు భాగ్యాన్ని కల్పించుట నా ధర్మంగా నిర్దేశించారు. (బి) పూర్వం జపం వ్రాయించుటలో కూడా ఈ విధంగానే జరిగింది. స్వామిని స్మరించుటలో ఆనందం పొందేవాడిని మరియు నా జటిలమైన సమస్యలు తీరాయి కాబట్టి ఈ భాగ్యాన్ని భక్తులందరూ అనుభవించాలని భావించి జపసమర్పణ కార్యక్రమమును ఎన్నుకున్నాను. (సి) 'నమో వేంకటేశాయ' మాస పత్రికను ప్రారంభించి అత్యంత సమర్థవంతంగా నడిపినచో స్వామివారిని పొందవచ్చని సూచించారు. ఈ సేవను నేను పొందుచు, పత్రిక చదివిన పాఠకులకు కలిగించుట నా ధర్మంగా సూచించారు. ఇలా స్వామివారు ప్రసాదించిన ప్రతి దానిని తిరిగి వారి భక్తులు అనుభవించునట్లు చేయుటకు నన్ను ప్రేరేపించారు.

నా దశ : సదా స్వామివారిని స్మరించుమని చెప్పారు, స్వామి కృపను ఇంట్లో ఉండే పొందవచ్చునన్నాడు. శ్రీవేంకటేశం మాస పత్రికను ప్రారంభించమన్నాడు, నా మానసికస్థితిని మార్చుకొమ్మన్నాడు. క్షణంలో లోయలను కొండలుగా మార్చుదునన్నారు, తిరుమల ధృవమూర్తులను దర్శించి పూజించాను. సురేఖను అనుగ్రహించారు. నమో వేంకటేశాయ రథం పనులు ప్రారంభించాము.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్. ఫోన్: 040-27175050
Visit: www.srivenkatesham.org

# వ్రతములు ముక్తికి సోపానములు

చిల్లర సీతారామారావు

**ప్రతి వ్యక్తి తెలిసో, తెలియకో పాపములను చేస్తాడు. ఆ పాపములను సమూలముగా నాశనము గావించి పుణ్యమును ప్రసాదించునవి వ్రతములు. వ్రతములను భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో ఆచరించినవారికి, వ్రతపుణ్యము మనసులోని మలినములను తొలగించి, మనోభీష్టాలను నెరవేరుస్తుందని శాస్త్రములు చెబుతున్నాయి.**

వృ అను ధాతువు నుండి వ్రతము అను శబ్దము ఏర్పడింది. వ్రతము అను శబ్దమునకు నిఘంటువు నోము, నియమము, ఉపవాసాది పుణ్యకర్మము అని పేర్కొంది. శాస్త్రోక్త నియమములను పాటించుట అని పురాణోక్తి. శాస్త్రోక్త నియమములను పాటించి వ్రతములాచరింటు వలన దుఃఖములు, విపత్తులు సమసిపోతాయి. సంపద, ఆయురారోగ్యములు ప్రాప్తిస్తాయి. వర్ణాశ్రమ ధర్మములను సక్రమముగా నిర్వర్తించువారు, నిర్మల మనస్కులు, నిర్లోభులు, సత్యవంతులు, నియమ నిష్ఠ కలిగినవారు, అహంకార రహితులు, పాపకృత్యములకు దూరముగా నుండువారు, వేదములను దూషించనివారు వ్రతములాచరించుటకు అర్హులు అని పురాణములు తెలియజేస్తున్నాయి. వ్రతములాచరించువారు శుచిగా ఉండాలి. నిరాడంబర వస్త్రములు ధరించాలి. పురుషులు సంప్రదాయ బద్ధమైన వస్త్రములను ధరించాలి. వ్రతమాచరించే రోజున శిరస్సునకు తైలము రాసుకోకూడదు. స్నానము చేయునప్పుడు సబ్బును వాడకూడదు. పరుషవాక్యములు, నిందాస్తుతులు పనికిరావు. కామము, క్రోధము, లోభము, మదము, మోహము, మాత్సర్యములను షడ్వర్గములను త్యజించాలి.

వ్రతనియమములలో ముఖ్యమైనది ఉపవాసము. ఉపవాసము ఉండటం వలన శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయి.

**శ్లో ॥ "వ్రతోపవాస నియమైః శరీరోత్తాప నైస్తథా**
**వర్గాః సర్వేఽపి ముచ్యతే పాతకేభ్యోన సంశయః"**

**(దేవల మహర్షి)**

వ్రతోపవాసము, నియమము, శరీరశుద్ధి మున్నగునవి పాటించి వ్రతములాచరించినచో సమస్త పాపముల నుండి విముక్తులు అవుతారని దేవల మహర్షి తెలియజేస్తున్నారు. క్షమ, దయ, దాన, శౌచ, ఇంద్రియ నిగ్రహము, దేవపూజ, అగ్నిహోత్రము, అస్తేయ వర్జనము, సంతోషము మున్నగువాటిని ఆచరణలో పెట్టినప్పుడే పుణ్యప్రాప్తి కలుగుతుందని భవిష్యత్ పురాణములోని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.



**శ్లో ॥ "క్షమాసత్యం దయాదానం శౌచ మింద్రియ నిగ్రహః**
**దేవపూజాగ్ని హవనం సన్తోషఽస్తేయ వర్జనమ్"**

వ్రతమునకు సంబంధించిన సమస్త వివరములు అనగా వ్రతము అంటే ఏమిటి, వ్రతమును ఎందుకు ఆచరించాలి, ఏ మాసమున ఏ వ్రతమును ఆచరించాలి, వ్రతమాచరించునప్పుడు పాటించవలసిన నియమములు ఏమిటి? వ్రత సమాప్తి అయిన తరువాత ఉద్యాపన ఎలా చేయాలి మున్నగు వివరములు పురాణములయందు వివరింపబడ్డాయి. 'దమము,

శమము' వ్రతాంతత భాగములు. దమము అనగా ఇంద్రియ సంయమనము. శమము అనగా మనో నిగ్రహము. వ్రతమును ఆచరించునప్పుడు శారీరక శ్రమను భరించవలసి వస్తుంది. కనుక వ్రతమును తపము అని పిలుస్తారు. ఇంద్రియములను నియంత్రించవలసి వస్తుంది కనుక నియమము అని పిలుస్తారు అని అగ్నిపురాణము పేర్కొనుచున్నది. శాస్త్రోక్తముగా చేయునది వ్రతము. ఈ వ్రతము మూడు రకములు అని అగ్ని, వరాహ పురాణములు తెలియజేస్తున్నాయి. మొదటిది మానసికము, రెండవది కాయికము, మూడవది వాచికము. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, సంయమము అనునవి మానసిక వ్రతములు. ఏకభుక్తము, నక్తవ్రతము, ఉపవాసము, అయాచితము అనునవి కాయిక వ్రతములు. వేదాధ్యయనము, హరినామ సంకీర్తనము, సత్యభాషణము అనునవి వాచిక వ్రతములు. వ్రతములను భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే దేవతలు ప్రసన్నులవుతారు. భోగ భాగ్యములను, మోక్షమును ప్రసాదిస్తారు. వ్రత ధర్మములను పాటిస్తూ ఏకాదశి వ్రతమును ఆచరించడం, భగవన్నామమును జపించడం, గంగ, యమున మున్నగు పుణ్య నదుల యందు స్నానం చేయడం, పురాణ గాథలను వినడం, నిరాడంబర జీవితమును గడపటం ఆత్మ కళ్యాణమునకు సోపాన మార్గములు అని జగద్గురువు ఆదిశంకరాచార్యుల వారు పేర్కొన్నారు.

భగవంతుని ప్రసన్నం చేసుకొని ఆయన అనుగ్రహం కొరకు చేయు సాధనములలో వ్రతములు ముఖ్యమైనవి.

**శ్లో ॥ వ్రతే నదీ క్షమాప్నోతి దీక్షయాఽఽప్నోతి దక్షిణామ్**
**దక్షిణా శ్రద్ధ మాప్నోతి శ్రద్ధయా సత్యమాప్యతే"**

వ్రతము వలన దీక్ష ప్రాప్తిస్తుంది. దీక్ష యనగా నియమమును పాటించుట యని అర్థము. దీక్షలోని రెండక్షరములకు ప్రత్యేకమైన అర్థములున్నాయి. దీ అను అక్షరమునకు దివ్యభావన యని, క్ష అను అక్షరమునకు పాప ప్రక్షాళన యని అర్థము. దీక్ష ద్వారా దాక్షిణ్యము ప్రాప్తిస్తుంది. దాక్షిణ్యము అనగా వ్రత నిర్వహణము నందు దక్షత, నైపుణ్యము. దాక్షిణ్యము ద్వారా శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ ద్వారా సత్యము ప్రాప్తిస్తుంది. సత్యమనగా దైవము యొక్క ప్రత్యక్ష రూపము. వ్రతములను మూడు విధాలుగా ఆచరిస్తారు. మొదటిది నిత్యవ్రతము, రెండవది నైమిత్తిక వ్రతము, మూడవది కామ్యక వ్రతము. భగవంతుని ప్రసన్నం చేసుకోవడానికి నిరంతరం భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తూ చేసే వ్రతము నిత్య వ్రతము. ఏకాదశివ్రతము, ప్రదోషవ్రతము, పూర్ణిమ వ్రతము మున్నగునవి నిత్యవ్రతము క్రిందికి వస్తాయి. ఏదైనా ఒక కారణమును పురస్కరించుకుని చేసే వ్రతమును నైమిత్తిక వ్రతము అని అంటారు. పాపక్షయ నిమిత్తము చేసే చాంద్రాయణ వ్రతము, ప్రజాపత్య వ్రతము మున్నగునవి నైమిత్తిక వ్రతము క్రిందికి వస్తాయి. మనోభీష్టాలు నెరవేర్చుకోవడానికి చేయు వ్రతమును కామ్యక వ్రతము అని అంటారు.

వ్రత రక్షకుడు అగ్నిదేవుడు. కనుక వ్రతమును ఆచరించుటకు ముందు అగ్నిదేవుడిని ప్రార్థించుకోవాలి.

**శ్లో ॥ "అగ్నే వ్రతపతే వ్రతంచ కరిష్యామి తచ్ఛకేయం**
**తన్మేరాధత్యామ్ ఇదమిహమమృతాత్సత్యము పైతి"**

వ్రతమును రక్షించు అగ్నిదేవా నేను వ్రతమును చేయుటకు సంకల్పించుకున్నాను. నాకు వ్రతమును నిర్విఘ్నముగా నెరవేర్చు శక్తిని ప్రసాదించుము. నేను అసత్య భాషణమును చేయను. నిజమునే పలుకుతాను. భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో వ్రతమొనరించు నాయందు ప్రసన్నుడవు కమ్ము. పుత్ర పౌత్రాదులతో సుఖముగా నుండునట్లు అనుగ్రహించుము.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, మౌనము, అపరిగ్రహము మున్నగు వాటిని శాస్త్రములు మహా వ్రతములుగా పేర్కొన్నాయి. అహింసా వ్రతము ద్వారా బుద్ధుడు, మౌనవ్రతము ద్వారా రమణ మహర్షి ప్రసిద్ధికెక్కారు. హరిశ్చంద్రుడు అష్టకష్టములనుభవించిననూ ఆడిన మాట తప్పలేదు. దీనిని సత్యవ్రతమని అంటారు. సత్యవ్రతాచరణము ద్వారా హరిశ్చంద్రుడు ప్రసిద్ధికెక్కాడు. బ్రహ్మచర్య వ్రతము నవలంబించి చరితార్థుడైనాడు భీష్ముడు. శంతన మహారాజు పుత్రుడు దేవవ్రతుడు. తండ్రి మనోభీష్టాన్ని నెరవేర్చడానికి తాను వివాహము చేసుకోనని భీషణ ప్రతిజ్ఞ చేసి అఖండ బ్రహ్మచర్య వ్రతమును బ్రతికినంతకాలం పాటించాడు. భీషణ ప్రతిజ్ఞ చేసినందువల్ల భీష్ముడైనాడు. దుంధుమారుడు, సగరుడు వ్రతములాచరించి వందమంది పుత్రులను పొందారు. దశరథుడు వ్రతము, యజ్ఞము ద్వారా శ్రీమహావిష్ణువును తనయుడిగా పొందాడు.

పురుషులు చేయు వ్రతములు, స్త్రీలు చేయు వ్రతములు, కుటుంబముతో కలిసి చేయు వ్రతములు అని వ్రతములను మూడు భాగాలుగా విభజించారు. పురుషులు చేయు వ్రతములలో ఏకాదశి వ్రతము ముఖ్యమైనది. రుక్మాంగదుడు, అంబరీషుడు మున్నగు చక్రవర్తులు ఏకాదశి వ్రతమును ఆచరించి భగవత్కృపకు పాత్రులైనారు. కుటుంబీకులందరూ కలిసి చేసే వ్రతములలో శ్రీరామనవమి, వినాయక చవితి, సత్యనారాయణ వ్రతము మున్నగునవి ముఖ్యమైనవి. శ్రీరామచంద్రుడిలా ఆదర్శ వ్యక్తిత్వమును పొందాలన్న ఆశతో శ్రీరామనవమి వ్రతమును, నిందల నుండి విముక్తిని పొందడానికి వినాయక వ్రతమును, కుటుంబమంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంపదలతో కళకళలాడుతూ ఉండాలని సత్యనారాయణ వ్రతమును చేస్తారు. స్త్రీలు తమ కుటుంబ సభ్యులు పసుపు కుంకుమలతో, సుఖ సౌఖ్యాలతో తులతూగుతూ ఆనందంగా ఉండాలని వ్రతములు చేస్తుంటారు. వరలక్ష్మీ వ్రతము, మంగళగౌరీ వ్రతములను ముఖ్యంగా చేస్తుంటారు స్త్రీలు.

**'అగ్నిసాక్షి సమర్యాదా భర్తాహి శరణం నార్యా'**

అను శ్రుతి ననుసరించి అగ్నిసాక్షిగా వివాహము చేసుకొనిన పురుషుడు స్త్రీకి సర్వస్వము అవుతాడు. భర్తయే రక్షకుడు. భర్త ఆయురారోగ్యములను కోరుకుంటూ సువాసినులు వ్రతమాచరిస్తారు. భర్తను యమధర్మరాజునుండి రక్షించుకున్న సావిత్రిని స్మరించుకుంటూ వటసావిత్రీ వ్రతమును చేస్తారు. కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో వర్థిల్లాలని వరలక్ష్మీవ్రతము ఆచరిస్తారు. కేదారేశ్వర వ్రతమును ఆచరించు మహిళలకు సమస్త సుఖాలు ప్రాప్తిస్తాయని, కన్యలు ఆయురారోగ్య ఐశ్వర్యములు, కీర్తిప్రతిష్ఠలు పొందుతారని గౌతమ మహర్షి ఉవాచ. శక్తి, సంపద, జ్ఞానము మహిమాన్వితమైనవి. శక్తికి ప్రతీక మహాకాళి, సంపదకు ప్రతీక మహాలక్ష్మి, జ్ఞానమునకు ప్రతీక సరస్వతి. ఈ ముగురమ్మలను స్మరించుకుంటూ నవరాత్రులందు వ్రతమాచరిస్తారు.

ధార్మికముగాను, ఆధ్యాత్మికంగాను వ్రతములకు అత్యంత మహత్తరమైన స్థానమున్నది. వ్రతములను ఎవరైననూ చేయవచ్చును. కాని భగవంతుడి మీద విశ్వాసము ఉండాలి. వ్రతాచరణము వలన శారీరక, మానసిక సంతులనము కలుగుతుంది. వ్రతము వలన సమస్తము సానుకూలమవుతాయి. కనుకనే 'వ్రతమ్ సర్వార్థక సాధనమ్' అన్నారు. ముక్తికి సోపానాలు అయిన వ్రతములను భక్తి శ్రద్ధలతో నియమ నిష్ఠలతో ఆచరించడం శుభప్రదము, పుణ్యప్రదము, లాభదాయకము. పుణ్యప్రదాతలగు వ్రతములను ఆచరించి, భగవంతుడి అనుగ్రహమునకు పాత్రులమవుదాము.

---

# ఎలా జీవించాలి ?

మనిషి ఎలా బతకాలో చెప్పింది వేదం. చక్కగా చూస్తూ, చక్కగా వింటూ, మంచిగా మాట్లాడుతూ ఎవరికీ అధీనుడు కాకుండా ఉంటే మనిషి నూరేళ్ళు బతుకుతాడని వేదం చెబుతోంది. ఎవరి ధనాన్నీ దొంగిలించకూడదు. అంటే ధనార్జన ధర్మంగా ఉండాలి. అంతేకాదు – ద్వేషం లేని ప్రేమైక సమాజం మంచిదని వేదం బోధించింది.

ఉపనిషత్తులో ఓ మాట ఉంది. నిత్యం ఏదో మంచి విషయాన్ని వింటూ ఉండాలి. చదువుతూ ఉండాలి. చదివిన దాన్ని మననం చేసుకుంటూ ఉండాలి. ఎన్ని కష్టాలొచ్చినా సత్యాన్ని వదులుకోకూడదు. నైతికంగా పతనం కాకూడదు. 'నేను, నాది' అన్న సంకుచిత భావనను వదిలిపెట్టాలి. చేసేవాడు, చేయించేవాడు ఆ భగవంతుడే అనుకుంటే – ఫలితాల మీద అపేక్ష ఉండదు.

'మా, మేము, నా' అనే స్వార్థానికి కౌరవులు జీవితంలో మొదటి స్థానం ఇచ్చారు. రెండో స్థానం ప్రపంచానికి, మూడో స్థానం భగవంతుడికిచ్చారు. ఫలితం అందరికీ తెలిసిందే.

పాండవులు తమ జీవితంలో మొదటి స్థానాన్ని భగవంతుడికి ఇచ్చారు. ద్వితీయ స్థానాన్ని నిస్వార్థ బుద్ధితో ప్రపంచానికిచ్చారు. తరువాత తమ గురించి ఆలోచించారు. అందుకే భారత యుద్ధంలో విజేతలయ్యారు. ఎవరైనా జీవితంలో ప్రథమస్థానం భగవంతుడికి ఇవ్వాలి. స్వార్థాన్ని మరచి పరోపకారానికి పాటుపడి త్యాగాలు చేయాలి. ఆ పైనే తమ గురించి ఆలోచించాలి. అప్పుడే జీవితం సంతోషభరితమవుతుంది.

ప్రతి మనిషీ ప్రపంచంలో ఒకడిగా తనదైన ముద్ర వేయాలి తప్ప మందలో ఒకరిగా కలిసిపోకూడదు. విలువలతో కూడిన జీవితం గడపడం, సక్రమమైన మార్గంలో ప్రయాణించడం వల్లే మనిషి లక్ష్యాలను చేరుకోగలుగుతాడు.

ఈ దేశంలో పుట్టిన సద్గురువులు ఎందరెందరో మానవసేవను మాధవసేవగా భావించారు. పరోపకారమే లక్ష్యంగా బతికారు. వినమ్రతతో దానధర్మాలు చేశారు. మనుషులు ఋషుల్లా మారారు. సంఘసేవకు నడుం బిగించారు. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ మహాత్ముడయ్యాడు.

''కాలడి'' నుండి హిమాచలం వరకు కాలినడకన వెళ్ళి నిష్ఠగా ధర్మాన్ని ప్రబోధించిన శంకాచార్యులు జగద్గురువయ్యారు. వారందరూ సంఘశ్రేయం కోసం తమ జీవితాలు ధారపోసి చిరస్మరణీయులయ్యారు. ఏ పనైనా కష్టపడితేనే పూర్తవుతుంది. కలలు కంటూ కూర్చుంటే అణువంతైనా ముందుకు సాగదు.


సింహం నోరు తెరుచుకుని ఉన్నంత మాత్రాన వన్యమృగం దాని నోటికి అందదు. అసలు మన ఆలోచనలను బట్టే ప్రపంచం ఉంటుంది. మన దృష్టి మంచిదైనపుడు లోకం మంచిగానే కనిపిస్తుంది. చెడుగా చూస్తే ప్రపంచం చెడ్డగానే కనిపిస్తుంది. ఇతరులకు మేలు చేయకపోయినా కీడు తలపెట్టకుండా ఉండటం మంచిది.

ప్రియంగా మాట్లాడితే శత్రువులైనా క్రమంగా మిత్రులవుతారు. సమాజ శ్రేయానికి ప్రతి మనిషి కృషి చేయాలి. నైతిక విలువలు పాటించి న్యాయమార్గంలో నడవాలి. ప్రేమను, జ్ఞానసంపదను అందరికీ పంచాలి. అప్పుడు మనిషి మనీషి అవుతాడు. అతడిలో భగవంతుడు కొలువై ఉంటాడు. అటువంటి ధన్యజీవులే ధరిత్రిని సంతోష ధామంగా, పుణ్యమూర్తులు నడయాడే ఆనంద నందనంగా తీర్చి దిద్దడంలో కీలక భూమిక పోషించగలుగుతారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి: 93482 12354

# గణుతికెక్కలేరు గర్వమున్న

– కూర్మాచలం శంకరస్వామి

**"మనిషికుండరాదు మదిలోన గర్వము**
**గణుతికెక్కలేరు గర్వమున్న**
**పనికిరావు యేవి పరమాత్మ దయ ముందు**
**శంకరునిది పలుకు శంక వలదు"**

పరమాత్ముని దయ ముందు అందరూ పరమాణువులే. పసికూనలే. మర్త్యలోకము అనగా భూలోకము. భూలోకంలో జన్మించిన ప్రతి ప్రాణీ నశ్వరమే. ఇక్కడ పుట్టిన ప్రతి మనిషికి మరణం తప్పదు. జీవితం బుద్బుదప్రాయమైనది. ఆస్తి అశాశ్వతం. యౌవనం ఝరీ వేగతుల్యం అని బోధిస్తుంది పరవస్తు చిన్నయసూరి నీతిచంద్రిక. అనగా నీటి బుడగ జీవితమని, నీటిపొంగు యవ్వనమని, ఎంత సంపాదించినా అది అశాశ్వతమని ఈ మాటలలోని పరమార్థం. అయినా మనిషి నేనే గొప్పవాడినని, నేనే ఇదంతా సాధించానని, నా రెక్కల కష్టంతోనే సంపాదించానని, "డబ్బుకు లోకం దాసోహం", "ధన మూల మిదం జగత్" అనే సూత్రాలను వల్లెవేస్తూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు తప్ప వీటికి మూలమైన భగవంతుణ్ణి ధ్యానించడం లేదు.

కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సరాలనే అరిషడ్వర్గాలనే అంతరంగ శత్రువుల మాయలో చిక్కి కన్నుమిన్ను కానకుండా ''దశకం ధర్మ లక్షణాలు'' అనే పది రకాల మానవ లక్షణాలను మరచి అన్నింటా గర్వాన్ని ప్రదర్శించి మానవులు తమ ధర్మాలకు భిన్నంగా ప్రవర్తిస్తూ పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోలేకపోతున్నారు. ''తమకు ఆపదలు కల్గిన దైవం దూరుదుర్'' అని మహాభారతం, అరణ్యపర్వంలో ఎఱ్ఱాప్రెగడ చెప్పినట్లు ఆపద మొక్కులు మొక్కడమే తప్ప అంతర్యామి తత్త్వాన్ని తెలుసుకోలేకపోతున్నారు.

గర్వంతో విర్రవీగి, ఆ భగవంతుణ్ణే నిందించి ఎంతోమంది రాక్షసులు కాలగర్భంలో కలిసిపోయిన ఉదంతాలు ఎన్నో మన పురాణ, ఇతిహాసాలలో ఉన్నాయి. ఘోర తపస్సులు చేసి శివుడి చేతనో, బ్రహ్మ చేతనో వరాలు పొంది, అట్టి వరాల గర్వంతో సకల లోకాల్లో అల్లకల్లోలం సృష్టించిన రాక్షసులను విశ్వరూపుడైన ఆ శ్రీమన్నారాయణుడు ధర్మ పరిరక్షణార్థం అవతారాలు ధరించి వారి గర్వభంగం చేసిన ఉదంతాలు కోకొల్లలు. ''ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే'' అని స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లు, ఎక్కడ అధర్మం పెరిగిపోయి ధర్మం నశిస్తుందో, మానవులు రాక్షసులుగా మారి గర్వంతో విర్రవీగిపోతూ లోకాలను ఛిన్నాభిన్నం చేస్తున్న సమయంలో భగవంతుడు అవతరించి అధర్మాన్ని అంతం చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు ఇద్దరూ రాక్షసులే. మహాబలవంతులే. వారు శివుని కొరకు భయంకర తపస్సు చేసి అనేక శక్తులను పొందిన బలగర్వంతో హిరణ్యాక్షుడు భూమండలాన్ని సముద్రంలో దాచిపెట్టి నా అంతటి గొప్పవాడు లేడని విర్రవీగి పోతుండగా శ్రీహరి వరాహావతారమెత్తి హిరణ్యాక్షుణ్ణి సంహరిస్తాడు. దానితో అతని సోదరుడైన హిరణ్యకశిపుడు ఆ శ్రీహరిపై ద్వేషంతో శివుని గురించి తపస్సు చేసి మానవులతో గాని, దేవతలతో గాని, జంతువులతో గాని, అస్త్రంతో గాని, శస్త్రంతో గాని, ఇంట గాని, బయట గాని చావు రాకూడదని వరాలను పొంది కన్నూ మిన్నూ కానకుండా నేనే గొప్పవాడినని, బలవంతుడినని, భగవంతుడినని స్వయంగా ప్రకటించుకుని, అటు దేవతలను, సాధు సజ్జనులను, ఋషులను, కిన్నెర కింపురుషులను, నాగనభశ్చరాలను హింసలకు గురి చేశాడు. శ్రీహరి అంశతో జన్మించిన అతని కుమారుడు ప్రహ్లాదుడు ఎన్ని ధర్మ సూక్ష్మాలు వివరించినా గర్వ మదాంధుడైన హిరణ్యకశిపుడు వినలేదు. పైగా రాక్షసకులంలో చెడబుట్టావని నిందిస్తూ ప్రహ్లాదుణ్ణి అనేక విధాలుగా చంపడానికి ప్రయత్నించగా, పరమ దయాళువైన శ్రీహరి నారసింహ అవతారమెత్తి హిరణ్యకశిపుని



వధించి అతని గర్వాన్ని అణచివేశాడు.

దశ లక్ష కోటి కరినాథులకు అధిపతిని నేనేనని విర్రవీగిన గజరాజు బలగర్వంతో తన భార్యలైన ఆడ ఏనుగులతో కలిసి వనంలో విచ్చలవిడిగా సంచరిస్తూ దప్పిక వేసి నీటి మడుగులోని నీటిని సేవించి ఆ మడుగును నేధ్వంసం చేయగా కోపంతో ఒక మొసలి (మకరరాజు) గజరాజును చంపడానికి ప్రయత్నించాడు. ఎన్నో వత్సరాలు మకరితో పోరు సల్పాడు, చివరకు ''లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ! ప్రాణముల్ దస్సె ! రావే ఈశ్వరా ! కావవే వరదా సంరక్షించు భద్రాత్మకా'' అని మొర పెట్టుకోగానే వైకుంఠపురంలో ఆ మూల సౌధంబుతో, మందార వనాంతర సీమలో లక్ష్మీసమేతుడైన శ్రీమహావిష్ణువు పరుగు పరుగున వచ్చి మొసలి బారినుండి గజేంద్రుణ్ణి రక్షించాడు.

ఒకసారి రామాయణాన్ని పరిశీలిస్తే బలగర్వముతో వాలి తన తమ్ముడైన సుగ్రీవుణ్ణి రాజ్య బహిష్కరణ చేసి అతని భార్యయైన తారను చేపట్టగా రాముడు అతణ్ణి సంహరించాడు. అలాగే రావణాసురుడు లంకాధిపతి శివుడు ప్రసాదించిన



అనేక వరాల గర్వముతో ముల్లోకాలను జయించి నేనే రావణ బ్రహ్మనని విర్రవీగిపోతూ దేవతలను, ఋషులను, గ్రహాలను తన ఆధీనంలో ఉంచుకొని అందరినీ హింసించడమే కాకుండా పరస్త్రీ వ్యామోహంలో పడి సాధ్వీమణి, సౌశీల్యవతియైన సీతమ్మను అపహరించి అశోకవనంలో బంధించగా అవతారమూర్తియైన శ్రీరాముని చేతిలో అంతమయ్యాడు.

అంతేకాకుండా మహాభారతంలో తన పక్షం వారైన పాండవులకు కూడా ఎప్పుడెప్పుడూ అహంకార పూరితంగా గర్వాన్ని ప్రదర్శించినా వారి గర్వభంగం చేస్తూ వారిని సక్రమ మార్గంలో నడిపించాడు శ్రీకృష్ణ పరమాత్మ. ముఖ్యంగా నేనే సర్వశ్రేష్ఠ గదాధారినని భీముడు, నేనే సర్వశ్రేష్ఠ ధనుర్ధారినని అర్జునుడు గర్వంతో విర్రవీగిపోతున్నప్పుడు, శ్రీరామచంద్రమూర్తి




పరమ భక్తుడైన హనుమంతుని చేత వారి గర్వాన్ని అణచివేసి కురుక్షేత్ర యుద్ధంలో వారికి విజయప్రాప్తి కలిగించాడు శ్రీకృష్ణ పరమాత్మ.

పైన పేర్కొనబడిన ఉదంతాలను బట్టి దేవతలు, రాక్షసులు, తపస్సంపన్నులు, గంధర్వులు, యక్ష, కిన్నెర, నాగ నభశ్చరములు ఎవరైనా తమ తమ ధర్మాలకు విరుద్ధంగా గర్వంతో బలప్రదర్శన చేస్తే వారి చరిత్ర కాలగర్భంలో కలిసిపోతుందని అవగతమవుతుంది. కాబట్టి మానవులు ఎల్లప్పుడూ గర్వాన్ని ప్రదర్శించకుండా అంతా ఆ భగవంతునిపై భారం వేస్తూ సంసార సాగరాన్ని దాటినప్పుడే ఈ జన్మకు సార్థక్యం చేకూరుతుంది.

**సార్థకంబు కలుగు సాటి జనులకు సేవ**
**మానవత్వమున్న మాన్యుడౌను**
**బలము గర్వమునకు బలిగాకు నరుడా**
**శంకరునిది పలుకు శంక వలదు.**
**అల్పమైన యట్టి అవని మానవజన్మ**
**మట్టిలోన కలిసి మాయమౌను**
**మాయ జన్మ కొరకు మదన పడగనేల**
**శంకరునిది పలుకు శంక వలదు.**

# ప్రహ్లాదుడు శ్రీనృసింహస్వామిని స్తుతించుట

**– విద్వాన్ వల్లూరి చిన్నయ్య**



**శ్రీమదాంధ్ర మహాభాగవతం – సప్తమస్కంధం**

వేద వేదాంతాల సారాంశాన్ని, వేదమయుడగు పరబ్రహ్మమూర్తి లీలా విశేషాలను, సర్వకర్మల ఫలితాలను కంజాక్షుడగు పరమేశ్వరునకు సమర్పిస్తే కలిగే సత్ఫలితాలను శాశ్వతానందంతో తరించడానికి తగిన తరణోపాయాన్ని తెలియజేసేది శ్రీమదాంధ్ర మహాభాగవతం. ఆ పవిత్ర గ్రంథంలో ప్రహ్లాదుడు శ్రీనృసింహావతారుణ్ణి స్తుతించే విధానాన్ని ఆ గ్రంథం ఆధారంగా వ్రాయబడిందీ వ్యాసం.

శ్రీహరి నృసింహస్వామి అవతారంతో స్తంభం నుండి ఉద్భవించి హిరణ్యకశిపుణ్ణి సంహరించిన అనంతరం, ఆ పరమాత్ముని ఉగ్రరూపాన్ని శాంతింప చేయడానికి అనేకులు అనేక విధాలుగా యత్నించారు. ఫలితం దక్కలేదు. చివరకు లక్ష్మీదేవి కూడా ప్రయత్నించి శాంతింపజేయలేకపోయింది. ఆ తరుణంలో నారదమహర్షి సూచన మేరకు ప్రహ్లాదుడు భక్తి ప్రపత్తులతో సాష్టాంగ దండప్రణామాలాచరించాడు. దేవదేవుడగు నారసింహమూర్తి మెల్ల మెల్లగా శాంతించాడు. ప్రహ్లాదుని ఆహ్లాదానికి మేర లేదు. భక్తి పారవశ్యంతో ఆ స్వామినిలా కీర్తించాడు.

**మ || అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్య, చి**
**త్తములన్ నిన్ను బహు ప్రకారముల నిత్యంబున్ విచారించి, పా**
**రము ముట్టన్ నుతిసేయ నోపరట నే రక్షస్తనూజుండ, గ**
**ర్వ మదోద్రిక్తుడ బాలుడన్ జడమతిన్ వర్ణింప శక్తుండనే?**

పై పద్యము ఆంధ్ర మహాభాగవతం సప్తమ స్కంధం లోని 349 వది.

దేవాదిదేవా! దీనబాంధవా! పురాణపురుషా! శ్రీనృసింహావతారా! తమను అనునిత్యమూ దేవతలు సిద్ధులూ మునిశ్రేష్ఠులు బ్రహ్మాదులు కమనీయమైన కాంక్షతో అనేక విధములుగా ఆరాధిస్తారు. తమ లీలలు ఘనతరంగా గానం చేస్తారు. కానీ సంపూర్ణంగా తెలుసుకొని అమోఘంగా అభివర్ణన చేయలేరు. అసురరాజు కుమారుణ్ణి, బాలుణ్ణి, తెలిసీ తెలియనివాణ్ణి, గర్విష్ఠిని, లీలామానుష స్వరూపంతో ఉండే తమను స్తోత్రం చేయడం నాకు సాధ్యపడేది కాదు.

సర్వేశ్వరా! ప్రపంచ ప్రాణికోటి ప్రాణాధారా! తమను సంతసపరచి తమలో లీనమగుటకు ప్రతాపాలు, పౌరుషాలు, సౌందర్యాలు, సత్కార్యాలు చాలవు. కేవలం నిష్ఠలు, నియమాలు సరిపోవు. భక్తితత్వం ఒక్కటే తమను సంతోషపరుస్తుంది. ఈ విషయంలో గజేంద్రుడు తగిన తార్కాణమని చెప్పవచ్చు. అదే తగిన శక్తిని ముక్తిని ప్రసాదిస్తుంది. అందుకే మానవుడు మహత్తరమైన భక్తితో తమను కొలిచే గొప్ప తాత్విక శక్తిని సంపాదించాలి. ఆ పనితోనే శాశ్వతానందం సమకూరుతుంది. మానవుడు కులమత తత్వ మౌఢ్యాలను ప్రక్కన పెట్టి గుణ ప్రధానంగా మెలగాలి.

సామాన్యులకు ఈశ్వరుని లీలావిశేషాలు అర్థంకావు. ఆ స్వామి పరిపూర్ణుడు. అందువల్ల పనుల ఫలితాలను పరమేశ్వరునకు అర్పణ భావంతో అర్పించాలి. అలా చేయగల్గితే అద్దంలో ముఖం స్పష్టంగా కనబడిన చందాన అతనికి పరమ ప్రయోజనం కలుగుతుంది. భగవంతుడు భక్తునికి బంధువుతో సమానం. భక్తుణ్ణి సర్వవిధాలా కాచుకుంటాడు. అలాంటి దయా సముద్రుడైన భగవంతుడవు నీవే అన్నాడా ప్రహ్లాదుడు.

**కం. కావున నల్పుడ సంస్తుతిఁ**
**గావించెద వెఱపులేక కల నేరుపునన్**

**నీ వర్ణనమున ముక్తికిఁ**

**బోవు నవిద్యను జయించి పురుషుఁడనంతా!**

**పై పద్యం శ్రీమదాంధ్ర మహాభాగవతం సప్తమస్కంధం లోని 353 వది**

ఆదిదేవా! అనంతా! ఆదిమధ్యాంత రహితా! ఆనంద సంధాయకా! నేను అల్పుడను. నాకు కలిగిన కొంత జ్ఞానంతో, తమరిచ్చిన శక్తి సామర్థ్యాలతో భయపడకుండా తమను స్తుతించడానికి సాహసించుచున్నాను. పరమపురుషా! నా ప్రార్థన మన్నించు. సామాన్య పురుషుడు కేవలం తమ మహోత్తమ గుణాలు స్తుతియించి అతని అజ్ఞానమును జయించి తమ సాన్నిధ్యాన్ని పొందగలడని ప్రహ్లాదుడన్నాడు.

**మ. ఖరదంష్ట్రా భ్రుకుటీ సటాన ఖయు నుగ్రధ్వానయున్ రక్త కే**

**సరయున్ దీర్ఘ తరాంత్రమాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ**

**నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణక్రూర దుర్వార దు**

**ర్భర సంసార దవాగ్నికిన్ వెఱతు నీ పాదాశ్రయుంజేయవే!**

**పై పద్యం శ్రీమదాంధ్ర మహాభాగవతమందలి సప్తమ స్కంధంలోని 355 వది**

నేను ఏమాత్రమూ భయపడను. కానీ మహా భయంకరమైనది, భరింపరానిది, క్రూరమైనది అగు సంసారమనే ప్రళయకాలమందలి అగ్నిని చూచి వణికిపోతున్నాను. కావున నన్ను కనికరించి, కరుణామృతాన్ని నాపై ప్రసరింపచేసి తమ పద్మాలవంటి పాదసన్నిధిలో నాకు రక్షణ చేకూర్చు అని ప్రార్థించాడా ప్రహ్లాద కుమారుడు. ఇట్లు అనేక విధాలుగా స్తోత్రం చేసి సంతృప్తి కలుగక ఇంకా ఇలా అంటూ ఉన్నాడు.

విశ్వమంతా నీవై విశ్వాన్ని పాలించే విశ్వేశ్వరా! విమలమైన విశ్రుతితో వెలసే వేదవిహారా! శ్రీలక్ష్మికి, మహేశ్వరునకు, బ్రహ్మకు మొదలుగా గల మహోన్నతులకు తమదైన పవిత్ర హస్తంతో అభయము ఇవ్వలేదు. తామసగుణులగు దైత్యవంశంలో పుట్టిన రజోగుణుడనైన నా తలపై తమ అపారమైన పవిత్రత గల హస్తాన్ని ఉంచి దీవించావు. ఈ సంభావ్యమైన సన్నివేశం చాలా ఆశ్చర్యంగా ఉంది అన్నాడా బాలుడగు ప్రహ్లాదుడు. ఈవిధంగా ఎన్నెన్నో తత్వ సంబంధమైన, భవబంధ విముక్తి సంబంధమైన ఉదాహరణలను దశావతారమూర్తి అయిన ఆ నరసింహమూర్తి యెదుట బాలుడగు ప్రహ్లాదుడు పల్కుటతో స్వామి పరమానంద భరితుడై ప్రసన్నభావంతో వరాలు కోరుకోమన్నాడు.

మహా మహోన్నత మూర్తీ! నారసింహావతారా! నాకే కోరికా లేదు. ఎల్లవేళలా తమపై భక్తిభావాన్ని కలిగించి, నా తండ్రికి పాపము అంటకుండా సదయను చూపి, పరిశుద్ధాత్మను ప్రసాదించు నాకదే మహాభాగ్యమని మనసారా కోరుకున్నాడు ప్రహ్లాదుడు.

★★★

# అంతర్యామి ఆ పురుషోత్తముడే

- బండారు పురుషోత్తం

అంతటా వ్యాపించినవాడు, స్మరించినంతనే అభయమిచ్చువాడు, శరణుజొచ్చిన భక్తుని కాపాడుటే అతని మహోన్నత ప్రేమ. అట్టి శ్రీవేంకటేశ్వరుడే మా అంతర్యామి. వేరొక్క దైవము లేదు అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు.

ఇతరుల నెవ్వరినీ మేమడుగము. మేమడిగినది లేదనకుండా, ఇచ్చే దాత ఇతడే. ఇతనిలాగా వేరెవ్వరూ ఇవ్వలేరు. ఇతడు దేవతలకు దేవుడు. ఆది పురుషుడు శ్రీహరి. లక్ష్మీదేవిని వక్షమందు ఉంచుకొన్నవాడు. శ్రీవత్సమను పుట్టుమచ్చను రొమ్ముమీద గలవాడు. జగత్తు అంతటా వ్యాపించినవాడు. సముద్రాల కీవల గాని, ఆవల గాని, అతనిదే అధికారము. మన్మథునికి తండ్రి, గురువు ఇతడే మాకు దగ్గరైనవాడు.

విశ్వానికంతా ఏకైక దైవము. అతనికి నాశనం లేదు. శాశ్వతుడు, గజమును రక్షించి, వరములిచ్చువాడు, అంతము లేనివాడు. మమ్ములను కాచిన దైవము. వేదములచే కీర్తింపబడినవాడు. మాకు నిజమైన బంధువు.

కలి దోషములెన్ని ఉన్నా నశింపజేయువాడు. కైవల్యమును ప్రసాదించువాడు. ఇన్నీ తానై ఉన్నవాడు శ్రీవేంకటేశ విభుడు. మమ్ము చల్లగా చూచువాడు, తన బలంతో రక్షించువాడు. మా తల్లి, తండ్రి కూడా ఆతడే. ఆతడే మా అంతర్యామి.

**ఇతరుల నడుగము ఇతడే మా దాత.**
**ఇతని యీలి వారు లియ్యగలరా ||పల్లవి||**

**దేవదేవుడాదిమ పురుషుడు హరి**
**శ్రీవత్సాంకుడు, చిన్మయుడు**
**యీవల, నావల ఇలవేలు పతడు**
**భావజ గురుడు, మా పాలిటివాడు ||చరణం 1||**

**జగదేక గురుడు, శాశ్వతుడచ్యుతు**
**డగజకు వరదుడు, అనంతుడు**
**తగి మము నేలిన దైవము యేలిక**
**నిగమమూర్తి, మా నిజబంధువుడు ||చరణం 2||**

**కలిదోషహరుడు, కైవల్యవిభుడు**
**అలరిన శ్రీవేంకటాధిపుడు**
**చలిమి, బలిమి, మా జననియు, జనకుడు**
**అలమి ఇతడు, మా అంతర్యామి ||చరణం 3||**

**(అన్నమాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనములు.**
**సంపుటి 3, కీర్తన నెం.526)**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## నాడీజంఘుడు

సూతముని రావడం గమనించిన మునులంతా లేచి నిలబడి నమస్కరించి వినమ్రంగా ఆసీనులయ్యారు. "మహర్షి సత్తములారా ఇవాళ నేనొక మహానీతితో కూడుకొని ఉన్న కథను చెప్తాను. శ్రద్ధగా ఆలకించండి" – అంటూ సూతర్షి ప్రారంభించాడు.

కశ్యప వంశోద్భవుడైన 'నాడీ జంఘుడు' అనే పేరు కల్గిన ఒక పెద్ద కొంగ – కారడవిలో మర్రిచెట్టు మీద నివాసముంటోంది. తన వంశాన్నే తరింపచేసిన ఉన్నతుడు నాడీజంఘుడు. ఆతని ఉత్తమత్వాన్ని మెచ్చిన సృష్టికర్త బ్రహ్మదేవుడే నాడీజంఘుని తన మిత్రునిగా చేసుకున్నాడు. అంతటివాడు నాడీజంఘుడు.

గౌతముడనే బ్రాహ్మణుడు బ్రాహ్మణ్యాన్ని వదిలేసి, బోయవనితను పెండ్లాడి, బోయవారితో భోగలాలసుడైనాడు. ఒకనాడు ధనసంపాదనకై నగరాన్ని చేరడానికి వెళ్తూ దారిలో ఉన్న అడవిలో చిక్కుకుపోయి ఒక మర్రిచెట్టు నీడకు చేరాడు. ఆ మర్రిచెట్టు – నాడీజంఘుడు నివాసమున్నదే. చెట్టుక్రింద చేరిన బ్రాహ్మణుని చూసి నాడీజంఘుడు వెంటనే క్రిందికి దిగి – ఆతనిని గౌరవించి, ఆదరించి, పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, సేదతీర్చాడు. అరటిపళ్ళు తినిపించి, కడుపు నింపాడు. చిగురుటాకులతోను, పూలతోను పక్కను పరిచి, మంచి మాటలతో కబుర్లు చెప్పి, ఆతని పక్కనే పడుకుని ఆతనితో పాటే నిదురించాడు. మునులారా! ఇక్కడొక విషయాన్ని గమనించండి. నాడీజంఘుని నివాసం చెట్టు మీద. తానున్న చెట్టువద్దకు వచ్చిన వానిని అతిథిగా భావించి, సంభావించాడు. అతిథిని ఎత్తుగా పడుకోబెట్టి – తాను క్రిందుగా పడుకోవాలి. అది – గృహస్థ ధర్మం. అతిథిని దట్టమైన చెట్టుపైన పడుకోపెట్టలేడుగా. కారణం – వచ్చినవాడు మానవుడు. తాను పక్షి కాబట్టి చెట్టుపైన ఉండగలడు. అందుకని చెట్టు కింద అతిథిని పరుండజేసి, తానూ ఆతని పక్కనే నిదురించాడు. గృహస్థ ధర్మాన్ని సునిశితంగా

పాటించిన ఉత్తమ వ్యక్తిత్వ సంపన్నుడు – నాడీజంఘుడు.

తెల్లవారిన తరువాత గౌతమునితో –

"విను! మిత్రుండును రజతము
కనకము బుద్ధియును నాల్గు కారణములు మ
ర్త్యుని దారిద్ర్యము వాయుట
కని దేవ గురుండు సెప్పె నన్నిటిలోనన్"

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.484**

మనిషి పేదరికం పోవడానికి స్నేహితుడు, వెండి, బంగారం, ఆలోచనాశక్తి కారణాలని దేవగురుడైన బృహస్పతి చెప్పాడు. అంతేకాదు. వీటన్నిటిలో కూడా –

"మిత్రుండెక్కుడు కాశ్యప
పుత్రుడనగు నేను నీకు భూసురవర! స
న్మైత్రి యనుష్ఠించెద నటె
పాత్రము గాకుండు దే యపార శ్రీకిన్"

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.485**

స్నేహం మరీ విలువైనదని, సంపత్కారణమని చెప్పి – నాడీజంఘుడు మైత్రీ ధర్మాన్ని పాటించి అమిత సంపదను ఆశించిన ఆతనిని తన మిత్రుడైన విరూపాక్షుని దగ్గరకు పంపాడు. సాధుమనస్కులారా! నిజానికి విరూపాక్షుడు రాక్షసరాజు. జాతికి రక్కసుడైనా – సాధుగుణ సహితుడు. అందుకే ఉత్తముడైన నాడీజంఘునికి ప్రియసఖుడు కాగలిగాడు. తన వద్దకు చేరిన గౌతముని గురించి సర్వం తెలుసుకుని – లోలోపల అనిష్టత కలిగినా ఏమాత్రం బయటపడనీయక –

"ఇతడెట్టిడైన నేమగు?
నతడికి సఖుడట్టె బకమహత్తర సఖ్యం
బితనిం బాత్రము జేయదె!
యితనికి దృప్తియగునట్టు వితు ధనంబుల్"

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.492**

ఎంతటి అనర్హుడైనా – నాడీజంఘునితో చేసిన స్నేహమే ఈతని యోగ్యతకు కారణమయింది – అని తలపోసి ఆతడు మోయలేనంత అపార ధనావళులిచ్చాడు.



"మహనీయ బహుళ పూజా
సహితంబుగ భోజనంబు సంతృప్తిగ న
మ్మహితాత్ముడు నడపి దు
ర్వహ భారము గాగ కనకరాశియు మణులున్"

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.494**

కడుపునిండా అన్నం పెట్టి, సేవలు చేసి, గౌరవించి మరీ సాగనంపాడు.

"ఉత్తమునితో కూడిన నీచుడు కూడా సన్మానితుడవుతాడన్న నిజానికి ఇదొక గొప్ప నిదర్శనం. ఒకని గురించి తెలుసుకోవాలంటే అతని స్నేహితులను చూసి – ఆతని వ్యక్తిత్వాన్ని, యోగ్యతను గుర్తించవచ్చు అన్నది నిత్యసత్యం కదా. మోయలేక మోయలేక మోసుకుంటూ ఆ ధనరాశులతో మళ్ళీ అదే మర్రిచెట్టు చేరాడు గౌతముడు. అంతులేని ధనంతో తిరిగి వచ్చిన స్నేహితుని చూసి నాడీజంఘుడు తృప్తితో ఆనందంతో దరిచేరి –

"అట్లు సంతోషమున దేలి అతని దప్పి
వోవ బక వల్లభుడు పక్షపుట యుగమున
నల్లవీచి యాహార సమర్పణంబు
సేసి నిసియైన, సుఖనిద్ర సేయుచుండ"

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము**

దొప్పల వంటి తన రెక్కలతో విసరి, ఆతని బడలిక పోగొట్టి, ఆకలి తీర్చి, ప్రక్కనే పడుకుని ఆదమరిచి నిద్రపోయాడు.

అన్నంపెట్టి కడుపునింపి, సేవలు చేసి, సేదతీర్చి, అపార సంపదను అందించి, అమిత మేలును చేకూర్చిన ఆ కొంగను కేవలం, కేవలం తినడానికి మాత్రమే – ఒక కర్రను అందుకుని మెడమీదా – తలమీదా దబదబా చితకబాది, ప్రాణం పోయిందని రూఢి చేసుకొని, దాని ఈకలన్నీ పెరికివేసి, పీకను చీల్చి, పేగులు బయటికి లాగి మాంసాన్ని మూట కట్టుకుని, ఆ మూటను – ధనరాశులను మోసుకుంటూ ప్రయాణం సాగించాడు పరమ నీచుడైన గౌతముడు – అని దీర్ఘంగా నిట్టూర్చాడు సూతర్షి. మైమరచి వింటున్న మునులంతా ఖిన్నులయ్యారు. "శివ శివా" అంటూ గట్టిగా కళ్ళు, చెవులు మూసుకున్నారు కొందరు. "హరి హరీ" అంటూ అరిచాడో ముని. "అయ్యయ్యో" అంటూ వాపోయాడింకో ముని. మొత్తానికి ఒక్కసారిగా తాపసులందరూ తల్లడిల్లిపోయారు. సర్వం తెలిసిన సూతముని మాత్రం ఒక్క క్షణం మౌనంగా ఉన్నాడు. "ఆందోళన చెందకండి మునులారా" అంటూ మళ్ళీ చెప్పుకొచ్చాడు.

నిజమే. గౌతముడు బ్రాహ్మణుడు అయి ఉండీ భ్రష్టుడైనాడు. బోయకాంతను వివాహమాడి కులద్రోహి అయినాడు. కానీ ఇంతటి పాపకార్యం ఏ ఒక్కరూ చేసి ఉండరు. "అవును.

గురుదేవా! సంపత్తును ప్రసాదించిన వానిని సంహరించడం మహానేరం. సేదతీర్చిన వానిని చంపడం మహాఘోరం. అతిథిగా వచ్చి గృహస్థుని హతమార్చడం మహాపాతకం. అన్నింటినీ మించి అన్నం పెట్టిన వానిని అంతమొందించడం మహాపాపం. అన్నం పెట్టిన వానిని నిందించనేరాదు అంటారు. అలాంటిది ఏకంగా చంపడమా!? ఇలాంటి వీర ఘోర బీభత్స కృత్యం నభూతో నభవిష్యతి. చాలా బాధగా ఉంది. తరువాత ఏం జరిగిందో చెప్పండి తెలుసుకోవడానికి క్షణం కూడా ఆలస్యాన్ని భరించలేకపోతున్నాం'' అని ఆత్రంగా అడుగుతున్న శౌనకాదులను ఊరడించాడు సూతర్షి.

నాడీజంఘుని మరణంతో ఒక్కసారిగా మనస్సు కలుక్కుమని రాక్షసరాజు విరూపాక్షుడు ఉలిక్కిపడ్డాడు.

**"నిచ్చలు వచ్చు రేపకడ నెయ్యమెలర్పగ మత్సఖుండు నే**
**డిచ్చటికేలరాడు? గుణహీనత విప్రునియందు గల్మి నా**
**యిచ్చ దలంచితిం, దులువ యేమి దలంచెనొ? యక్కటా! మదిం**
**బొచ్చెము లేదు నమ్ము బక పుంగవుడెట్లగు నొక్కొ దైవమా!"**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.502**

తనలో తానే "నా మిత్రుడు రోజూ పొద్దున్నే వచ్చేవాడు. ఇవాళ ఇంకా రాలేదు. జాము పొద్దెక్కింది. ఆ బ్రాహ్మణుడు నీచుడని, అప్పుడే అనిపించింది. నాడీజంఘుడు అసలే ఉత్త అమాయకుడు. ఏమాత్రం కల్మషం లేనివాడు. అందరినీ నమ్మే ఉత్తముడు'' అని తలపోశాడు. వెంటనే తన పరివారాన్ని రప్పించి కొంగ ఎలా ఉందో చూసి రమ్మని పంపించాడు. వారంతా వెతికి వెతికి – ఎక్కడా కొంగ కనిపించక – కాస్త పక్కగా పడి ఉన్న కొంగ డొక్కను గుర్తించి, ఆ డొక్కనే తీసుకుని – రాజుకందించారు. పరుగు పరుగున వెళ్ళి బ్రాహ్మణుని వెదికి పట్టుకుని, రెక్కలు విరిచికట్టి తెచ్చి రాజు ముందు పడేశారు. రాజు గౌతముని చూసి – "వీడిని చంపి తినండి. వీడు చేసిన మేలు మరచినవాడు'' అని ఆజ్ఞాపించాడు.

**"...........................పోకడమాలిన వారమయ్య! యి**
**ద్దురిత శరీరముం దినగ దోసము మాకని వారలొల్లమిన్"**

**-శాంతిపర్వము –తృతీయాశ్వాసము – ప.505**

"ఈ పాపిష్టి శరీరాన్ని తినటానికి మేమంత నీతిలేని వాళ్ళమా!? వీడిని తింటే మాకు పాపము అంటుకుంటుంది'' అని గౌతముని శరీరాన్ని చిన్న చిన్న కండలుగా కోసి, పారేశారు. నరమాంసం ఇష్ట భక్షకులైన రాక్షసులు సహితం గౌతముని ఏవగించుకున్నారు.

అంతేకాదు.

**"వెదగోతల నెత్తురొలుక**
**బదద్రోచిన వచ్చి కుక్క పదువు వెనుకకున్**
**జడిసె కబళింప నొల్లక**
**కదుపులు నకనక బడంగగౌరమమఖ్యా"**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.508**

నకనక లాడుతున్న కుక్కల మంద పరుగు పరుగున వచ్చి అంత ఆకలితోనూ అవి ఆ పాపాత్ముడి శరీరాన్ని ముట్టకుండానే – వెనక్కు తిరిగి వెళ్ళిపోయాయి.

**"విను మది యట్టిద! కుక్కలు**
**దినగా రోయుం కృతఘ్ను దేహము మాంసం**
**బని చెప్పనాగమంబులు........."**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.510**

"కృతఘ్నుడి మాంసాన్ని కుక్కలు కూడా ముట్టవు. రోతపడతాయి'' అని వేదాలే ఘోషిస్తున్నాయి కదా. ఇప్పుడు జరిగిందదే. ఇదిలా ఉండగా – ఉత్తమ రాక్షస రాజైన విరూపాక్షుడు విల విల విలపిస్తూ – నాడీజంఘుడి డొక్కను తీసుకుని, గౌరవంగా తలకొరివి పెట్టాడు – మిత్రధర్మంగా. ఆ సమయంలో త్రిలోకాధినాథుడైన దేవేంద్రుడు వచ్చాడు అక్కడికి. మహేంద్రుని చూసి విరూపాక్షుడు నాడీజంఘుని బ్రతికించమని ప్రాధేయపడ్డాడు. ఆతని ప్రార్థనను విన్న ఇంద్రుడు "నీ చెలికాడు సాక్షాత్తు సృష్టి కర్త బ్రహ్మదేవునికి కూడా ప్రియసఖుడు కదా. నాడీజంఘుని నిత్యం చూడాలనే కోరుకుంటాడు. క్షణం క్రితం జరిగినది నీకు తెలియదు. ఎంత గొప్ప మంచిపని చేశావు రాక్షసేంద్రా! నీ స్నేహితునికి తల కొరివి పెట్టి, ఆతనికి పుణ్యలోక ప్రాప్తిని కలగజేయాలని ఆశించావు. ఎంత గొప్ప మనసు నీది! కానీ ఇంతలోనే ఒక అద్భుతం జరిగింది.

**"కదు నర్మిలి గ్రేపుం జను**
**గుదుప దొడగె నొక్క సురభి గుఱుపాల్బెరయం**
**బదు వత్స వక్త్ర ఫేనము**
**సుడిగాలిం దూలి పడియె సొదపై ననఘా!"**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.517**

దహన సంస్కారం చేసి నువ్విలా వచ్చావు. అక్కడే ఒక ఆవు తన దూడకు పాలిస్తుండగా – దూడ నోటినుండి నురగ తుప్పర ఎగిరి – నాడీజంఘుని చితిమీద పడింది. ఆ నురగ స్పర్శతో నాడీజంఘుడు తిరిగి బ్రతికాడు. నిజరూపంతో ప్రకాశించాడు. ఇదంతా ఆ బ్రహ్మదేవుని లోకాతీతమైన కృపా కటాక్షమే'' అని చెప్పుండగానే నాడీజంఘుడు వచ్చేశాడు. పరమానంద భరితుడైన విరూపాక్షుడు పరుగున అడుగు వేసి మిత్రుని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

అంతకుముందే బ్రహ్మ ఆనతి ప్రకారం ఇంద్రుడు నీచ బ్రాహ్మణుడైన గౌతముని కట్టి పడేశాడు.

**"ఆ నాడీజంఘుండును**
**దాని నెఱిగి భూసురునకు తన కతమున న**
**ద్దీన దశయగుట కోర్వక**
**వాని విడుపు కోరి వేడె వరముగ నింద్రున్"**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.520**

గౌతమునికి తన వలన కలిగిన దురవస్థను తట్టుకొనలేక ఆతనిని విడిపించమని దేవేంద్రుని వేడుకున్నాడు నాడీజంఘుడు.

**“ఆరయ మిత్ర ద్రోహము**
**దారుణమగు పాతకము కృతఘ్నత కంటెన్**
**వైరము గొని విడువ వలయు**
**నారెండు దెఱగుల వారి నాప్తులనైనన్”**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.525**

బ్రహ్మ హత్యా పాతకానికైనా నిష్కృతి ఉంటుంది కానీ చేసిన మేలు మరచిపోయిన వాడికి పాప విముక్తి ఉండదు. చేసిన మేలు మరచిపోవడం కన్నా స్నేహితునికి కీడు తలపెట్టడం మహాపాపం. ఇలాంటి వారిని వదులుకోవడం మంచిది. అయినా సాధు మనస్కులు ఇలాంటి వారికి కూడా ఎప్పుడూ మేలే తలపెడతారు. అంతటి ఉత్తమోత్తముని కోరిక కాదనలేకపోయాడు ఇంద్రుడు. దివ్యదృష్టితో బ్రహ్మదేవుని సంకల్పం కూడా అదేనని తెలుసుకుని – నాడీజంఘుని కోరిక తీర్చాడు. ఆ బ్రాహ్మణుని విడిచిపెట్టాడు. రాక్షసరాజు కూడా మిత్రుని కోరిక తీర్చాలన్న ఒకే ఒక్క ఆశయంతో అంతకుముందే ఇచ్చిన ధన రాశులన్నిటినీ తిరిగి ఇచ్చివేశాడు. అంతే. ఆ ధనాన్నంతా మోసుకుంటూ తన స్థావరానికి వెళ్ళిపోయాడు గౌతముడు. నాడీజంఘుని కొనియాడి దేవేంద్రుడు దేవలోకాన్ని చేరుకున్నాడు. విరూపాక్షుడు తన గృహానికి – నాడీజంఘుడు తన మర్రిచెట్టుకు చేరుకుని కలకాలం మైత్రీబంధంతో సుఖంగా జీవించారు.

మునులారా! అందుకే పెద్దలంటారు –

**“మిత్త్రుండైహికములు నా**
**ముష్మికములు నైన భద్రములు దల కొలుపున్**
**మిత్ర ధనంబులలోనను**
**మిత్త్రుడ యెక్కుడను మాట మెత్తురు ప్రాజ్ఞుల్”**

**- శాంతిపర్వము – తృతీయాశ్వాసము – ప.526**

స్నేహితుడు ఇహ పర సౌఖ్యాలను సమకూర్చగలడు. మిత్రుడు, ధనం, మిత్రులలో మిత్రుడే మిన్న. ఎవరైనా మేలును పొందాలంటే – ముందు మంచి మిత్రుని పొందాలి.

తనను చంపినవాడిని తానే బ్రతికించిన ఉత్తమోత్తముడు నాడీజంఘుడు. అతిథి సేవకు అగ్రగణ్యుడు. నిష్కపటి. నిర్మోహి. నిష్కాముడు. నిష్క్రోధి. అందుకే బ్రహ్మదేవుని మైత్రిని, అనుగ్రహాన్ని పొందగలిగాడు. స్నేహ ధర్మానికి సరి అయిన మారు రూపుడు నాడీ జంఘుడు. ఒక పక్షి (కొంగ) అయినా సర్వమానవాళికి ఆదర్శమూర్తి.

ఉగ్గబట్టుకుని వింటున్న మునులంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. “గురువర్యా! నేడెంత మహత్తరమైన కథను వినిపించారు. విన్న మా జన్మలు తరించాయి. మనసుకు ఎంతో ప్రశాంతత చేకూరింది. మా భయాలు, ఆందోళనలు అన్నీ తొలగిపోయాయి. చాలా ఆనందంగా ఉంది. ఇంత మంచి కథను తెలియ చెప్పిన మీకు కృతజ్ఞులము” అని నాడీజంఘుని ఔన్నత్యాన్ని తలచుకుంటూ తమ ఆశ్రమాలకు చేరుకున్నారు. చెమ్మగిల్లిన కళ్ళతో సూతముని తృప్తిగా నిట్టూర్చాడు.

# చిరకారి

సావధాన చిత్తులై ఉన్న శౌనకాదులను చూసి సూతమహర్షి “నాయనలారా! ఇవాళ మీకొక సనాతన ధర్మాన్ని తెలిపే కథను చెబుతాను. అంతేకాదు – తల్లి తండ్రుల విలువ, పుత్రధర్మం, అహింసా తత్త్వం, తొందరపాటు వలన కలిగే ప్రమాదం, ఆలోచనా ప్రయోజనం – ఒకటేమిటి – ఎన్నో విషయాలు ఈ కథలో – అవగతమవుతాయి. మానవ ప్రగతికి ఎంతో అవసరమైన అంశాలు ఎన్నో తెలుస్తాయి.

**“త్వరితము సేయక కార్యము**
**చిరంతన విమర్శనముగ చేసి యొనర్చన్**
**ధరణీశ్వర యోటు వడడు**
**పురుషుడు సిద్ధియును వానిపొందు దృఢముగన్”**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప.262**

పని చేసేటప్పుడు తొందర పడకూడదు. చక్కగా చాలాసేపు ఆలోచించి చేస్తే ఆ పని సక్రమంగా జరిగి విజయాన్ని చేకూరుస్తుంది – అని చిరకారి అనే పేరుగల ముని కుమారుడు నిరూపించాడు. ఆలోచన వలన ప్రమాదాలు, ఆపదలు కూడా తప్పిపోతాయన్న సత్యాన్ని ఈ కథ స్పష్టం చేస్తుంది. వినండి మునులారా! మేధా తిథి అనే ఒక మహర్షి కుమారుడు చిరకారి.

**“అతడు చిరకాల సువిచా**
**రితంబుగా చేసి యాచరించుం**
**గురు భూతపివర్యే! యెద్దియును నది**
**గతముగ చిరకారి నామకంబున పరగున్”**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప.265**

మేధాతిథి పుత్రుడు ఏ పనినీ తొందరపడి చేయడు. చిరకాలం ఆలోచించి ఎప్పటికో చేస్తాడు. అందువల్లనే అతడిని చిరకారి అన్నారు.

ఒక సందర్భంలో మేధాతిథికి భార్యపై కోపం వచ్చి, పుత్రుని పిలిచి – తల్లిని చంపమని ఆదేశించాడు. కోపావేశంతో చకచకా నడిచి వెళ్ళిపోయాడాయన. చిరకారి ఏ పనినైనా ఆలోచిస్తాడు కదా. అందుకే తల్లిని వెంటనే వధించకుండా ఆలోచించాడు. “తండ్రి ఆజ్ఞను మీరకూడదు. అలాగని కన్నతల్లిని చంపకూడదు. తండ్రిని కాదనకూడదు. తల్లిని కాపాడాలి. వంశం నిలపడానికి తల్లియే ఆధారం కదా. తాను తల్లి పేగు నుండి జన్మించినవాడు కదా. మరి తండ్రి! బీజం వేసేది తండ్రే కదా. నేనా – ఇద్దరి కలయికతో పుట్టిన వాడను. తపము, ధర్మం, విద్య, దైవం –

ఇవన్నీ తండ్రియే. అటువంటి తండ్రిని కాదనటం ధర్మాన్ని, దైవాన్ని కాదనడమే కదా. ఇక తల్లి!!

**"కరచరణాది సంఘటిత కాయము సంజననంబు వహ్నిపు**
**ట్టరణికి పోలె తల్లి దెసనైనది కాదొకొ! యట్లుగాక దు**
**ర్ధర మగు గర్భ భేదమును పట్టికినై నిజ దేహ చింతపై**
**భర మొకయింత లేకపడు పాటులు నక్కట! యెక్కుడింతకున్"**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప. 273**

అరణిని మథిస్తే అగ్ని జీవిస్తుంది. అలాగే సకల అవయవాలతో కూడిన ఈ శరీరం తల్లి నుండే జన్మిస్తుంది. అంతేనా! సహించశక్యం కాని గర్భధారణ భారం, తన గురించి తన ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా బిడ్డ కోసం తల్లి పడే పాట్లు అన్నా? ఇన్నా? ప్రసవ సమయంలో తల్లికే కదా ఎక్కువ కష్టం. తను మరణానికైనా సిద్ధపడి బిడ్డకు జన్మనిచ్చే తల్లియే సృష్టికి మూలం కదా. వందమంది ఆచార్యుల కంటే ఒక తండ్రి, వెయ్యిమంది తండ్రుల కంటే ఒక తల్లి గొప్పది. అందుకే వేదం కూడా మొట్టమొదటగా తల్లినే దైవంగా భావించాలని ''మాతృదేవోభవ'' అని బోధిస్తోంది. తల్లి వంటి సత్పదార్థం సృష్టిలోనే లేదు. తల్లి లేనివాడు అశక్తుడవుతాడు. శూన్యజీవనుడవుతాడు.

**"కలవాడు లేనివాడు స**
**బలు డబలుడు మూఢబుద్ధి ప్రాఘుడనంగా**
**వలదెవ్వరికైన జనని**
**కలిమియు అత్యంత సౌఖ్యకరమై యుండున్"**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప. 278**

ధనికుడైనా, పేదవాడైనా, బలవంతుడైనా, బలహీనుడైనా, మూర్ఖుడైనా, బుద్ధిశాలి అయినా, ఎవ్వడికైనా – తల్లి జీవించి ఉండటమే సుఖప్రాప్తిని కలిగిస్తుంది. తల్లి లేని పిల్లలకు విలువ ఉండదు. అంతటి పూజ్యురాలైన తల్లిని వధించడం మహాపాపం. కన్నతల్లిని చంపడానికి చేతులెలా వస్తాయి!? మనసెలా ఒప్పుతుంది!? – సహజంగా చిరకాలం ఆలోచన చేసే చిరకారి ఇన్ని విధాలుగా సుదీర్ఘంగా ఆలోచనలో పడిపోయాడు – అని ఒక్క క్షణం ఆగాడు సూతముని.

''చెప్పండి – మహర్షీ. అప్పుడేం జరిగింది? అంతసేపు అన్ని విధాలుగా ఆలోచించిన చిరకారి – చివరికి ఏం చేశాడు? తండ్రి మాటే విన్నాడా? తల్లిని చంపేశాడా? తండ్రిని ధిక్కరించి తల్లిని మిగుల్చుకున్నాడా? అంటూ ఆత్రంగా ప్రశ్నించారు మునులు. గాఢంగా నిట్టూర్చి సూతర్షి ''అదే చెబుతున్నా నాయనలారా! చిరకారి ఇలా ఆలోచిస్తూండగా – కాస్త దూరంగా వెళ్ళిన అతని తండ్ర మేధాతిథి ''అయ్యో! ఏదో ఇంత చిన్న తప్పిదానికి భార్యపై కోపించడమే కాక చంపమని పుత్రుని ఆజ్ఞాపించి వచ్చానే! నేనెంత తొందరపడ్డాను. నా తపస్సేమిటి!? నా ఈ ఆగ్రహావేశం ఏమిటి!? ఎంత కోపం వచ్చినా – కన్నతల్లిని వధించమని ఆదేశించటం ఎంత అనుచితం!? నేను తొందరపడ్డానే కానీ నా కుమారునికి తొందరపాటుతనం లేదుగా. ఎంతో ఆలోచించి కానీ ఆతడే పనీ చేయడుగా! తన సహజ స్వభావాన్ని విడిచి – క్రూర కార్యానికి తలపడడు'' – అనుకుంటూ వడివడిగా ఇంటి ముఖం పట్టాడు.

**"చిరముగ గర్భవాసమున చెందితి పుత్ర చిరంబుగాగ ని**
**న్నరసె గదయ్య తల్లి, అనయంబును నే పనుపంగ బూనియుం**
**చిరమగునట్టి యుత్తెఱగు సేత తలంచిత యేని సత్కృపా**
**పర! చిరకారి నాబరగు భాసిత నామము సార్థకంబగున్"**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప. 285**

కరుణాపరుడవైన కుమారా! నీవు చాలాకాలం నీ తల్లి గర్భంలో ఉన్నావు. పుట్టకముందు, పుట్టిన తరువాత ఎంతోకాలం, నీ తల్లి నిన్ను భరించింది. పోషించింది. నా క్షణికావేశ నిర్ణయాన్ని పాటించకుండా, చిరకారి అన్న నీ పేరును సార్థకం చేసుకున్నావు కదా. నాకు, నా తపస్సునకు ఏమాత్రం నింద రానీయకుండాను, నీకు మాతృహత్యా పాతకం చుట్టుకోకుండాను ప్రవర్తించి, నన్ను అదృష్టవంతుడిని చేశావు నాయనా –'' అని తలపోస్తూ ఇల్లు చేరాడు. తండ్రిని చూసిన మరుక్షణం – చిరకారి పరుగున వచ్చి తండ్రి పాదాలపై పడి నమస్కరించి అలాగే ఉండిపోయాడు. మునిపత్ని కూడా భర్త పాదాలపై పడి మన్నించమని వేడుకుంది. మేధాతిథి ఇద్దరినీ లేవనెత్తి ఆశీర్వదించాడు. పుత్రుడు తొందరపడనందుకు, గృహిణి మరణించకుండా ఉన్నందుకు పరమానందం చెందాడు. కొడుకుని తండ్రి చేసిన తప్పును సరిదిద్దినందుకు మెచ్చుకున్నాడు. ''నాయనా! నీ దీర్ఘ ఆలోచనా సరళియే నిన్ను, నీ తల్లిని, నన్ను కాపాడింది.

**"మిత్రత్వము శత్రుత్వము**
**పాత్రతయు నపాత్రతయును పరికించు సుచా**
**రిత్రుడు చిరతర గణనా**
**సూత్రితముగ దాన నెల్ల శుభములు నొందున్"**

**– శాంతిపర్వము – పంచమాశ్వాసము – ప. 289**

ఇతడు మిత్రుడు, ఇతడు శత్రువు, ఇతడు యోగ్యుడు, ఇతడు అయోగ్యుడు– అని పరిశీలించి, ఆలోచించి ఆచరించే సచ్చరిత్రుడు – సకల శుభాలనూ పొందుతాడు – అని చిరకారిని ప్రశంసించాడు తండ్రి.

చూశారా మునులారా! సచ్చరిత్రుడు కావడం వల్లనే చిరకారి తల్లిని దక్కించుకుని శుభాన్ని పొందాడు. అందుకే పెద్దలు – ఏ పనినైనా ఆలోచించి, ఆలోచించి, ఆలోచించి చేయాలి – అన్నారు. ''అవును మహాత్మా! ఎన్ని మంచి విషయాలు చెప్పారు. తల్లి విలువ ఎంత గొప్పగా వివరించారు. ఆలోచన అన్నది ఎంత లోతుగా ఉండాలో చక్కగా చెప్పారు – అంటూ మునులందరూ తమ తమ తల్లులను స్మరించుకుంటూ ఆశ్రమాలకు చేరారు.

★ ★ ★



# మకర సంక్రాంతి

డా|| మరుదాడు అహల్యాదేవి

పుష్యమాసంలో వచ్చే సంక్రాంతి మనకు ముఖ్యమైన పండుగ. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే సమయంలో వచ్చే పండుగ కాబట్టి 'మకర సంక్రాంతి' అని, ఉత్తరాయణ పుణ్యకాల ప్రవేశం కూడా అప్పుడే కాబట్టి 'ఉత్తర క్రాంతి' అని కూడా దీనిని పిలుస్తారు. ప్రతి సంవత్సరం సూర్యుడు ఒక్కొక్క నెలలో ఒక్కొక్క రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా ప్రవేశించిన రోజున సంక్రమణం అని అంటారు. మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశించటం వల్ల మకర సంక్రమణం అని పేరు వచ్చింది. సంక్రమణం అనగా పాతది పోయి కొత్తది వచ్చుట. ఈ సంక్రమణం నుండి సూర్యుడు తన ప్రచండ తేజస్సుతో దివ్య కాంతులతో ప్రకాశిస్తుంటాడు.

మన పూర్వులు సూర్య సంచారమును రెండు భాగాలుగా చేశారు. సూర్యగమనం భూమధ్య రేఖకు ఉత్తర దిశలో ఉన్నప్పుడు ఉత్తరాయణమనీ, దక్షిణ దిశలో ఉన్నప్పుడు దక్షిణాయనమనీ, మకర సంక్రమణం మొదలు కర్కాటక సంక్రమణం వరకు ఉన్న కాలాన్ని ఉత్తరాయణమనీ అంటారు. దక్షిణాయనం పితృదేవతలకు ముఖ్యమైతే ఉత్తరాయణం దేవతలకు ముఖ్యం. అందుచేతనే కురుక్షేత్ర సంగ్రామంలో నేలకొరిగిన భీష్ముడు అంపశయ్యపై ఉత్తరాయణం వచ్చేవరకు నిరీక్షిస్తూ ఉన్నాడు.

దక్షిణాయనంలో ఎక్కువ వర్షాలు కురిసి, పంటలు నాశన మవడం, వివిధ రకాలైన వ్యాధులు కలరా, శీతరోగములు, అంటువ్యాధులు విజృంభిస్తాయి. ఈ కాలం అనారోగ్యానికి నెలవనే చెప్పవచ్చు. ఉత్తరాయణంలో వర్షాలు తగ్గి, ఎండ కాచి, కొద్దిగా చలి ఉంటుంది. రైతులు ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకునే వేళ. హేమంత ఋతువులోని చల్లదనానికి క్రిమికీటకాదులు వృద్ధి చెందుతాయి. ఈ కారణం చేత పేడ నీళ్ళను, గృహ ప్రాంగణమందు చల్లి, అలికి శుభ్రము చేసి గుల్ల సున్నపు పిండితో ముగ్గులు వేస్తారు. పేడ, ముగ్గులోని కాల్షియం క్రిమి కీటకాల నాశనకారి. అందువల్లే ఈ ఋతువులో ముగ్గులు వేస్తారు. సూర్యుడు ధనూరాశిలో సంచారము చేయు నెల రోజులను ధనుర్మాసమందురు. ఇది చాంద్రమానం ప్రకారం మార్గశిర



పుష్యమాసంలో వచ్చును. దానినే నెల పట్టడం, నెలనంటు పెట్టడం అంటారు. ఈ నెల రోజులు, ప్రాతఃకాలంలో దేవాలయాలందు, విశేష పూజలు చేస్తారు. ధనుర్మాసము విష్ణువుకు ప్రీతికరమైన మాసము. ప్రతి ఇంట ముంగిట ఆవుపేడ నీళ్ళలో కలిపి చల్లి రంగురంగుల రంగవల్లికలతో అలంకరిస్తారు. ఇంటికి సున్నముకానీ, రంగులు కానీ వేసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతము పలికేందుకు సిద్ధంగా ఉంటారు. క్రొత్త అల్లుళ్ళతో, కుమార్తెలతో, బంధుమిత్రులతో ప్రతి గృహము కళ కళ లాడుచుండును. గడపలకు రంగులు వేసి, పసుపు, కుంకుమలతో తీర్చిదిద్దుతారు. ద్వారబంధములపైన, గుమ్మాలను బంతిపూవులు మామిడాకుల తోరణాలతో అలంకరిస్తారు.

## భోగి

ఇది ఇంద్రునకు ప్రీతికరమైన రోజు. ఇంద్రుని, ఇష్టదేవతలను పూజించవలెను. ఈరోజున తెల్లవారు జామున ఇంటి ముంగిట కాని, నాలుగు మార్గముల కూడళ్ళ వద్ద భోగిమంటలు వేయుదురు. ధనుర్మాసము నెలరోజులు తాము అర్చించిన గొబ్బెమ్మలను పిడకలుగా చేసి వానిని దండగా గుచ్చి కూర్చి ఆ దండలను ఈ భోగి మంటలలో పిల్లలచే వేయించుట సంప్రదాయము. ఉదయముననే అభ్యంగన స్నానము చేసి కొత్త బట్టలు కట్టుకుంటారు. సాయంకాలం చిన్నపిల్లలకు భోగిపళ్ళు (రేగిపండ్లు, పూలరేకులు, చిల్లరడబ్బులు) పోసి, హారతి ఇచ్చి దిష్టి తీస్తారు. పేరంటాండ్రకు నానబెట్టిన శనగలు, పండ్లు, తాంబూలము వాయనము ఇస్తారు. కొందరు బొమ్మల కొలువు పెడతారు. ఈరోజే శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి నెత్తడం, గోదాదేవి శ్రీమహావిష్ణువును పతిగా పొందడం జరిగింది. ఈరోజు అనగా ధనుర్మాసము చివరిరోజు దేవాలయాల్లో గోదాదేవి, శ్రీరంగనాథులకు కళ్యాణం చేస్తారు.

## సంక్రాంతి

పెద్ద పెద్ద ముగ్గులతో తెలుగునాట ప్రతి గృహము సంక్రాంతి పురుషుని ఆహ్వానించుచుండును. ఈరోజు నుండియే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. ఈరోజునే సూర్యుడు మకరరాశి లోకి ప్రవేశించును. ఉత్తరాయణమున ఉరి వేసుకుని మరణించినా పుణ్యలోకములు కలుగునని నానుడి. దీనిని పెద్దల పండుగ అని వ్యవహరిస్తారు. ఈరోజున పితృదేవతలకే తర్పణములు వదులుదురు. పంటలు రైతులకు పుష్కలముగా చేరును గాన దీనిని పంటల పండుగ అని అంటారు. ఈనాడు తెలకపిండితో ఒళ్ళు రుద్దుకుని స్నానము చేయవలెను.

**శ్లో ॥ రవి సంక్రమణే ప్రాప్తేన స్నాయాద్యాస్తు మానవ ।**
**సప్తజన్మ సురోగ స్యాతనిర్ధన శ్చైవ జాయతే ॥**

సూర్య సంక్రమణ సమయమున స్నానము చేయనివాడు ఏడు జన్మల యందు రోగియై దరిద్రము అనుభవించును. ఈరోజున కొత్త బియ్యము, కొత్త బెల్లంతో కొత్త కుండలో పాయసము చేస్తారు. దీనినే పొంగలి అంటారు. తమిళనాడులో ఈ పండుగను పొంగల్ అని వ్యవహరిస్తారు. ఈరోజున పాయసము, ధాన్యము, పండ్లు, విసనకర్రలు, వస్త్రములు, త్రిమూర్తుల ప్రతిమలను పండితులకు దానము చేయవలెను. మహిళలు పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యములు, బెల్లము, నువ్వులు, పువ్వులు పుణ్యస్త్రీలకు దానము చేసిన మాంగల్యాభివృద్ధి కలుగును. దేవాలయములు సందర్శించి నువ్వుల నూనెతో దీపములు వెలిగిస్తారు.

ఈరోజు ప్రత్యేకంగా కూష్మాండం (గుమ్మడికాయ) దానం ఇస్తారు.

**శ్లో ॥ కూష్మాండే బహు బీజాని బలపుష్టి ప్రవర్తనమ్ ।**
**యస్మాదస్య ప్రదానేన అవఃశ్మాంతిం ప్రయచ్ఛమే ॥**

అంటే గుమ్మడి కాయను దానం చేయడం వల్ల బహు బీజాని అంటే దాతకు వీర్యపుష్టి, బలము దినదినాభివృద్ధి కలుగుతాయి. గుమ్మడికాయ దానంతో పాటు, ఆరగించడం వల్ల ఆరోగ్యపరంగా ఎంతో వృద్ధి కలుగుతుంది. స్త్రీలకు వంధ్యా దోషం ఉంటే అనగా పిల్లలు కలగకుండా ఉంటే వ్యాధి నివారింపబడుతుందని ఆయుర్వేదం నిర్ధారిస్తున్నది. అందువల్లనే సంక్రాంతిని 'కూష్మాండ క్రాంతి' అని కూడా పిలుస్తారు. అందుకే ఈరోజున గుమ్మడికాయను కూరగానో, ముక్కల పులుసుగానో వండుకుని తినాలి. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక్క ముక్కయినా వచ్చేలా చూసుకోవాలి. ఇక నువ్వులు కలిపిన సజ్జల రొట్టె ఈ పండుగలోని ప్రధాన భక్ష్యం.

## కనుమ

ఇది పశువుల పండుగ. ఆయుధముల పండుగ. నాగలిని రైతులు ఆరాధిస్తారు. పశువులన్నిటినీ కడిగి పసుపు, కుంకుమలు పెట్టి, పూలదండలతో వాటిని అలంకరించి పూజిస్తారు. 'కనుమనాడు మినుము కొరకవలె, లేనిచో యముడు ఇనుము కొరికించునని' నానుడి. కాబట్టి ఈరోజు గారెలను తప్పక వండుతారు. 'కనుమనాడు కాకైనా మునుగునని' సామెత. కాబట్టి ఎల్లరూ తలారా స్నానం చేయవలెను. 'కనుమనాడు కాకైనా కదలదని' లోకోక్తి. కావున ఎవరూ ప్రయాణం చేయరాదు.

## ముక్కనుమ

ఈరోజు కొత్తగా వివాహమయిన ఆడపిల్లలు 'సావిత్రీ గౌరీవ్రతం' అంటే 'బొమ్మల నోము' పడతారు. ఈ దేవిని తొమ్మిది రోజులు పూజించి తొమ్మిది పిండివంటలతో రోజూ నివేదన చేసి పిదప ఆ మట్టి బొమ్మలను పుణ్యతీర్థమందు నిమజ్జనం చేస్తారు.

ఇంటి ముందు కళ్ళాపులు చల్లుతూ, ప్రతిరోజూ వివిధ రకాల ముగ్గులతో, సప్త వర్ణాల రంగవల్లికలను తీర్చిదిద్ది 'ఇంద్రధనుస్సులను' ముంగిట చూస్తున్నట్లు భ్రమింపచేస్తారు.

ఈ పండుగ దినాలలో ''కోటి విద్యలు కూటి కోసమే'' అనునట్లుగా హరిదాసులు హరినామ సంకీర్తనలు చేస్తూ వచ్చి 'కృష్ణార్పణం' అంటూ ముంగిట భిక్షను స్వీకరిస్తూ ఉంటారు. ఇక గంగిరెద్దుల వారు బసవన్నను ఆడిస్తూ చిన్నారులను దీవిస్తూ ఉంటారు. జంగమ దేవరలు, బుడబుక్కల వాళ్ళు, కొమ్మ దేవరలు, పిట్టల దొరలు, విచిత్ర వేషధారులు మున్నగు కళాకారులంతా ఈ పండుగ దినాలలో వచ్చి వారి వారి కళలను ప్రదర్శిస్తూ చివరగా ఒక పాత వస్త్రాన్ని ఇమ్మని కోరి భుజానికి వేసుకొని పోతూ 'సుభోజ్యంగా ఉండాలమ్మా' అంటూ దీవించి పోతూ ఉంటారు. ఏ కళాకారుణ్ణీ రిక్తహస్తాలతో పంపకుండా కలిగినదానిలో ఎంతో కొంత ఇచ్చి పంపుతుంటారు.

'మకరం' అంటే మొసలి. ఇది పట్టుకుంటే వదలదు. మానవుని ఆధ్యాత్మిక మార్గానికి అడుగడుగునా అడ్డు తగులుతూ, మోక్షమార్గానికి అనర్థాణ్ణి చేయడంలో ఇది అందె వేసిన చేయి. అందువల్ల ఈ మకర సంక్రమణం పుణ్యదినాలలో దీని బారినుండి తప్పించుకునేందుకు ఎవరికి వారు యథాశక్తి లేదు అనకుండా దానధర్మాలు చేయడం మంచిదని పెద్దలు చెబుతారు. నిత్యజీవనంలో కూడా దీని బారిన పడకుండా చూచుకుంటూ కలిగినంతలో దానం చేస్తుండాలి. సంక్రాంతి ఒంటరిగా మాత్రం రాదు. మహారాణిలా ముందు భోగిని, వెనుక కనుమను వెంటబెట్టుకుని చెలికత్తెల మధ్య రాకుమార్తెలా వస్తుంది. మహారాణిలా వచ్చే ఆ సంక్రాంతి లక్ష్మికి మనమందరం ఆహ్వానం పలుకుదాం.

★★★

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. జీవాత్మ, పరమాత్మ – మోక్షం వీటి గురించి మౌలిక భాషలో వివరించండి? - కౌసల్య, అనంతపురం**

జవాబు : జీవాత్మ మనలో ఉండే మన అసలైన స్వరూపం. ఈ బయటకు కనబడే దేహం మనం కాదు. ఈ ఆత్మను నడిపించేవాడు, ఆత్మకన్న భిన్నమై ఉండేవాడు, ఏ నిర్వచనానికి అందనివాడు పరమాత్మ. ఆత్మలెన్నో ఉంటాయి కాని పరమాత్మ ఒక్కడే. ఆత్మకు ఆది, అంతం లేదు. అది నాశనం పొందదు. ఆత్మలన్నీ కోరుకునేది పరమాత్మనే. జీవాత్మ రకరకాల జన్మలనెత్తి తన నిజ తత్త్వాన్ని గురువుల బోధనలతో అవగతం చేసుకుని, బంధాల నుండి విడివడి ఆ పరమాత్మలో తన ఉనికిని స్థిరం చేసుకోవడాన్నే ముక్తి లేదా మోక్షం అంటారు. తిరిగి జనన మరణ చక్రంలో చిక్కుకోకుండా ఆ పరమాత్మ సన్నిధిలో నిత్యులుగానో, ముక్తులుగానో (ఈ లోకంలో మనం బద్ధులం) మారితే అదే మోక్షం. ఏది ఏమైన భగవత్ కృపతోనే మనకు ఇహమైనా, పరమైనా లభిస్తాయి.

**2. శ్రీ వైష్ణవులు 4 మండపాలు చాలా గొప్పగా భావిస్తారు. అవి ఏమిటో, ఏక్కడ ఉన్నాయో, వాటి గొప్పతనం గురించి వివరించండి? – కస్తూరి రంగాచార్య వంగల**

జవాబు: ఆ నాలుగు మండపాలు చాలా విశిష్టమైనవి. అవి శ్రీరంగం, తిరుమల, కంచి, మేల్కోటలలో ఉన్నాయి. శ్రీరంగంలో భోగమండపం, తిరుమలలో పుష్పమండపం, కంచిలో త్యాగమండపం, మేల్కోటలో జ్ఞానమండపం ఉన్నాయి. భోగ మండపంలో సింహ, గజ, శార్దూల, వృషభ, సర్ప గతులు గల స్వామి నడకలు మనకు కనిపిస్తాయి. తిరుమలలోని పుష్పమండపము పుష్పకైంకర్యానికి ప్రసిద్ధి. కంచి అనగా త్యాగమండపం (24 జానల వెడల్పు గల గొడుగులు కేవలం ఇక్కడే సమర్పించడం జరుగుతుంది) ఇక్కడ పెరుమాళ్ భగవద్రామానుజులను త్యాగము చేసినారు. మేల్కోట జ్ఞానమండపం. ఇక్కడ వైరముడి కిరీటం వంటిది. ఇక్కడ లభించే భగవత్, భాగవత, ఆచార్య జ్ఞానం మరెక్కడా లభించదు అని అంటారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

– ఎడిటర్, శ్రీవేంకటేశం

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

## 289. క్షీర సారాశన రతాయ నమః

పాల సారములను – పెరుగు, మీగడ, వెన్న, నేయి మొదలగునవి భక్షించుట యందు అధికమై ప్రీతి గలవాడు కృష్ణుడు. పోతన భగవంతుని కృష్ణుని బాలక్రీడలను పరమ రమణీయంగా వర్ణించినాడు.

**"వల్లవ గృహ నవనీతము లెల్లను భక్షించి వచ్చి యెరుంగని భంగిన్**
**దల్లి గదిసి చిట్టాడు" చుండేవాడు కృష్ణుడు (- భాగ. 10 – పూర్వ – 302)**
**"పడతీ నీ బిడ్డడు మా కడవలలో నున్న మంచి కాగిన పాలా**
**పడుచులకు బోసి చిక్కిన కడవల బో నడిచె" (భాగ. 10 – పూర్వ – 307)**
**"ఆడం జని మీగడ పెరు గోడక నీ సుతుడు త్రావి యొక యించుక తా**
**గోడలి మూతిం జరిమిన గోడలు మ్రుచ్చనుచు నత్త కొట్టె లతాంగీ ||" (భాగ. 10 – పూర్వ – 310)**
**"ఓ యమ్మ! నీ కుమారుడు మా యిండ్లను బాలు పెరుగు మననీడమ్మా!**

ఇట్లు కృష్ణుడు క్షీర సారములైన పెరుగు, మీగడ, వెన్న, నేయి మొదలగు వానిపై మిక్కిలి ప్రీతి గల్గి భక్షించేవాడు. క్షీర సారాశన రతుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

సమాజ పరిశీలకుడు, విమర్శకుడు అగు యోగి వేమన

**పాల సాగరమున పవ్వళించిన వాడు - గొల్ల యిండ్ల పాలు గోర నేల?**
**ఎదుటి వారి సొమ్ము లెల్లవారికి తీపి - విశ్వదాభిరామ వినుర వేమ ||**

అని కృష్ణుడు ఇరుగు పొరుగు ఇండ్లలో చేసిన పాలు, పెరుగు, వెన్న దొంగతనమును విమర్శించినాడు.

## 290. దధి భాండ ప్రమర్దనాయ నమః

పెరుగు కడవలను పగలగొట్టువాడు కృష్ణుడు.

**మ || "కడుపారం జనుబాలు ద్రావని సుతున్ గం జాక్షి పీఠంబు పై**
**నిడి పొంగారెడు పాలు దించుటకు నై యేగంగ దద్బాలు డె**
**క్కుడు కోపంబున వాడిఱాత దధి మత్కుంభంబు పో గొట్టి తెం**
**పడరం గుంభము లోని వెన్నదినె మిథ్యా సంకులద్బాష్పుడై || - భాగ. 10 – పూర్వ – 358**

**"అంత నా లోలలోచన, పాలు దించి వచ్చి వికలంబులైన దధి కుంభ శకలంబులం బొడగని, తుంట కొడుకు వెన్న దింట యెరింగి నగుచు" - భాగ. 10 – పూర్వ – 359**

ఇట్లు పోతన భాగవతములో కృష్ణుడు పెరుగు కడవలను పగల గొట్టుటను స్వాభావికంగా వర్ణించినాడు.

దధి భాండ ప్రమర్దనుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 291. నవనీతాపహర్త్రే నమః

వెన్న దొంగ కృష్ణునికి నమస్కారము.


బాలకృష్ణునికి వెన్న అంటే అతి ప్రీతి. తన యింట్లోనే కాక ఇరుగు పొరుగు ఇండ్లకు వెళ్ళి ఉట్లపై దాచిపెట్టిన వెన్నను తాను తిని తోడి బాలురకు తినమని ఇచ్చేవాడు.

ఒకనాడు యశోద వెన్న దొంగను పట్టుకొని రోటికి కట్ట దలచి

**"వీరెవ్వరు శ్రీకృష్ణులు, గారా యెన్నడును వెన్న గానరట కదా**
**చోరత్వం బించుకయును నేరరట ధరిత్రి నిట్టి నియతులు గలరే**

– భాగ. 10 – పూర్వ – 372 అని మేలమాడింది.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 292. నీల నీరద భాసురాయ నమః

నల్లని మేఘముల వలె ప్రకాశించువాడు కృష్ణుడు.

శ్రీకృష్ణుని అవతార సమాప్తికి కారకుడైన జరుడు తన తప్పిదమును గుర్తించి, శ్రీకృష్ణుని పాదములపై బడి రక్షింపుమని ప్రార్థించాడు. ఆ జరుని తప్పిదమును క్షమించి శ్రీకృష్ణుడు చతుర్భుజుడైన నారాయణునిగా సాక్షాత్కరించి, వానికి మోక్ష మొసంగినాడు. ఆ జరుని ఎదుట సాక్షాత్కరించిన భగవత్స్వరూపము ఇట్లు ఉన్నది –

**జలధర దేహు నాజాను చతుర్బాహు సరసీరుహాక్షు విశాల వక్షు**
**జారు గదా శంఖ చక్ర పద్మ విలాసు గంఠ కౌస్తుభ మణి కాంతి భాసు**
**గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు శ్రీవత్సలాంఛనాంచిత విహారు**
**నురు కుండల ప్రభాయుత కుంతల లలాటు వైఢూర్య మణి గణ వర కిరీటుని**

బ్రహ్మాది దేవతలు, ఋషులు దర్శించి, స్తుతించారు. ఈ దివ్య స్వరూపమే భూమిపై వేంకటాద్రిపై శ్రీనివాసునిగా (వేంకటేశునిగా) అవతరించింది.

బ్రహ్మాది దేవతలు, ఋషులు కృష్ణుని వద్దకు చేరి, అతని దుష్ట శిక్షణ కార్యక్రమమును ప్రశంసించినారు. వారందరు కృష్ణుని అవతార సమాప్తితో భూలోకమున భగవద్రూపమును దర్శించలేక పోతున్నందుకు దుఃఖించారు. అంతలో జరుని ఎదుట ప్రత్యక్షమైన భగవద్రూపము భూమిపై నుండి పైకెగసి సూర్య మండలమున ప్రవేశించింది. ఆ సమయమున భూమిపై నున్న బ్రహ్మాది దేవతలు, ఋష్యాదుల నుద్దేశించి, అశరీరవాణి – భగవంతుని వాక్కు

**భుజై శ్చతుర్భిః సముపేతం మమేదం - రూపం విశిష్టం జీవితం సంస్థితం చ**
**భూమౌ గతం పూజయతాప్రమేయం - సదాఽహి తస్మి న్నివసామీతి దేవాః ||**
**(మహాభారతం–మౌసల పర్వం–అధ్యా – 5–34 శ్లోకం)**

ఓ దేవతలారా! నా జీవితం ముగిసింది. చతుర్భుజములతో నున్న ఈ రూపము భూమిని చేరి శాశ్వతంగా ఉండగలదు. ఈ అర్చాస్వరూపమును పూజించవలసింది. ఈ అర్చారూపంలో నేను సదా నివసిస్తాను అని వినిపించింది. ఈ భగవంతుని సందేశము వేంకటాద్రిపై స్వయంభూగా అర్చాస్వరూప ఆవిర్భావమును, దానిని పూజించుటకు దైవ సమ్మతిని తెలియ జేయుచున్నది.

వేదాంత దేశికులు 'తత్త్వ మాతృక' అను గ్రంథములో మహాభారతం, మౌసల పర్వం లోని ఈ సన్నివేశములో నున్న భగవద్వాక్యమును ఉదాహరించినారు. 'భూమౌ గతం పూజయతాప్రమేయం' అను భగవంతుని వాక్యము బ్రహ్మాది దేవతల, ఋష్యాదుల ప్రార్థనకు సమాధానము. వారు ఆచరించదగిన కార్యమును ఉపదేశించుచున్నది. భగవంతుని అర్చామూర్తికి చేయు పూజాదులు కూడ ముక్తిప్రదము లగును. భారతేతి హాసము ఆధారంగా అత్యంత ప్రాచీన కాలము నుండి – శ్రీకృష్ణావతార సమాప్తి నుండి – ఈ కలియుగాది నుండి 18–2–3102 బి.సి నుండి వేంకటాద్రిపై శ్రీమన్నారాయణుని స్వయంవ్యక్త స్వరూపము – అర్చావతార మూర్తి – వెలసి యుండెనని ధ్రువపడుచున్నది.

బ్రహ్మాది దేవతలు వేంకటేశ్వరుని అనాదిగ ప్రతి నిత్యము రాత్రి పూట పూజించుచున్నారను విశ్వాసము, సంప్రదాయము, ఐతిహ్యము గలదు. నేడు కూడ రాత్రి పూజాంతమున గర్భాలయ తలుపులు మూయుటకు ముందు ఆకాశగంగా తీర్థమును అయిదు బంగారు పాత్రలలో నింపి, వాటితో పాటు పూజార్థము ఉపయోగించెడి గంధాది సామగ్రిని శ్రీవారి సన్నిధిలో వుంచి తలుపులు మూయుచున్నారు. బ్రహ్మాది దేవతలు వచ్చి వేంకటేశ్వర స్వామిని పూజించి తీర్థ స్వీకారము చేసి వెళ్ళుచున్నారు. ప్రాతఃకాలమున విశ్వరూప దర్శనమున బ్రహ్మాది దేవతలు తీర్థ స్వీకారము చేయగా మిగిలిన శ్రీవారి తీర్థమును బ్రహ్మ తీర్థము అను పేరుతో భక్తులకు ఇచ్చుచున్నారు. తథాస్తు! నేడు తి.తి.దే. అధికారులు గర్భగృహమును అర్ధరాత్రి నుండి ప్రభాత వేళ 4–30 ఏ.ఎం వరకు మూసివేసి యుండుట లేదు. వారు సంప్రదాయమును పాటించుట లేదు.? ఇది నిందార్హమైన అనుచిత చర్య! (సశేషం)

ధారావాహికం



# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి, 9550241921

## 14 వ శ్లోకం

**తృష్ణాతోయే మదన పవనోద్ధూత మోహోర్మిమాలే**
**దారావర్తే తనయ సహజ గ్రాహ సంఘాకులేచ ।**
**సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం న స్త్రిధామన్**
**పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ ||14||**

"ఓ త్రిధాముడా! తృష్ణ అనే ఉదకములు (ఆశ అనే జలములు) కలది, అటువంటి ఆశలు మన్మథుడు అనే గాలి చేత కదులుతూ, సకల మోహములలో పడి, సంసారం అనే ఉచ్చులో పడి ఇందులో దాటే ఉపాయం లేక మునిగిపోతున్న మాకు ఓ వరదా! నీ పాదభక్తి అనే నౌకను మాకు అనుగ్రహించి దరిచేర్చండి.

"భక్తి అనేది కలగడానికి ప్రధానమైనది మనస్సు, అది చంచలమైనది, ఇంద్రియములకు అధిపతి అయినవాడు 'హృషీకేశుడు' – హృషీకాణాం ఈశః ఇంద్రియములకు ఈశుడు. శరీరములందు క్షేత్రజ్ఞ (జీవ) రూపమున నుండి ఇంద్రియములను తమ తమ విషయముల యందు ప్రవర్తిల్ల జేయువాడు.

(సంసారమను సముద్రములో పడి, మునుగుచు, తేలుచూ, దాటలేక బాధపడుచున్న వారికి విష్ణువే నౌక అని, విష్ణుభక్తియే నౌక అని వెనుకటి 2 శ్లోకములలో పేర్కొని, ఆ నౌకను ఇవ్వమని విష్ణువునే ప్రార్థింపవలెనని తెలుసుకొని, ఈ శ్లోకంలో ప్రార్థించుచున్నారు.)

ఈ సంసారమను సముద్రములో ఆశయే జలము. ఆ జలము కామమను పెనుగాలిచే కదిలింప బడుచున్నది. ఆ విధంగా కదులుటచే మోహమను కెరటములు వరుసగా సాగుచుండును. ఈ సముద్రములో భార్య సుడిగుండము వలె పట్టి తిప్పి, అందు పడినవారిని బయటకు పోనీయక ముంచి వేయును. బిడ్డలు, బంధువులు మొసళ్ళు మొదలగు జంతువులవలె కబళింప ప్రయత్నించు చుందురు. ఇట్లు భయంకరమగు సంసార మహాసముద్రమున పడి, దాటు ఉపాయము లేక మునుగుచున్న మాకు, ఓ వరద! ఓ త్రిధామ! నీ పాదపద్మభక్తి అనెడి నౌకను ఇచ్చి దరిజేర్చుమయ్యా.

**"నమో నమోఽనిరుద్ధాయ హృషీకేశేన్ద్రియాత్మనే ।**
**నమః పరమహంసాయ పూర్ణాయ నిభృతాత్మనే" ||**

లేదా ఎవరి ఇంద్రియములు అందరి జీవులకువలె తమ తమ విషయములందు ప్రవర్తించకుండా తన వశము నందుండునో అట్టి పరమాత్ముడు హృషీకేశుడు.

"సూర్య రశ్మిర్హరికేశాః పురస్తాత్ సూర్యుని కిరణము హరికి సంబంధించు కేశమే అను శ్రుతి వచనము"

సూర్య చంద్రులును కేశములుగా (కిరణములు) గల విష్ణువు హృషీకేశుడని చెప్పబడును. అలాంటి పరమాత్మ యొక్క పాదపద్మముల యందు మన భక్తిని సమర్పిస్తే సంసార సాగరమనే ఈ అగాధం నుండి దాటడానికి నావని ప్రసాదిస్తాడు. నావ అంటే తన యొక్క సాన్నిధ్యాన్ని పొందింప చేసే పరమాత్మ అనుగ్రహమే మనకు నావ.

సంసారవృక్ష చ్ఛేదనమునకు భగవంతుడి యందు సంగము, మిగిలినవాటి యందు అసంగము అనే శస్త్రము కావాలంటే అది భగవంతుడే ప్రసాదించాలి అని శరణాగతి చేసినచో భగవంతుడే దానిని కృప చేయును.


ఈ రీతిగా ఆశ మితిమీరిన పక్షంలో అనర్థములకు మూలమవుతుంది. ఆ ఆశాజలముల వల్ల గాలి అలలు కలిగి స్వాధీనము తప్పి, మన్మథ వికారములు కలుగుతాయి. భార్య అను బంధము వల్ల ఏర్పడ్డ మరిన్ని బంధములు పిల్లలు, బంధువులు

ఇలా సహజన్ముల యొక్క భాధ కలుగుతుంది. అటువంటి బాధను తొలగించుకోడానికి పరమాత్మ యొక్క పాదభక్తి ఒక్కటే శరణ్యము అంటూ మన కులశేఖరాళ్వార్లు ఉపాయమును తెలియజేస్తున్నారు.

మాహాత్ముల మహిమలను మనం అర్థం చేసుకోవటం కష్టం. దున్న పోతుతో వేదాన్ని పలికించిన మహాయోగి పుంగవుడు జ్ఞానేశ్వరుడు.

భారత దేశం భక్తులకు పుట్టినిల్లు. అందులో మహారాష్ట్ర దేశంలో అనన్య భక్తి సామ్రాట్టులున్నారు. జ్ఞానదేవుడు, నామదేవుడు, పుండరీకుడు మొదలైన భక్తులంతా తమ భక్తీ వైభవంతో పండరి నాథుడైన పాండురంగ విఠలుని సన్నిధిలో మెలగి, సాక్షాత్కారం పొంది ఆయన్ను చేరినవారే. వీరందరిలో జ్ఞానదేవుడు మిన్న అంటారు.

ఈయన క్రీ.శ.1275వ సంవత్సరంలో మహారాష్ట్రలోని అవె గ్రామంలో విఠలపంత్ కులకర్ణి, రఖుమాబాయి (రుక్మిణిబాయి) దంపతులకు జన్మించారు. వివాహం అయిన కొద్ది కాలానికే విఠల పంత్ సన్యాసం స్వీకరించారు. అయితే విఠలపంత్ కు దీక్షనిచ్చిన రామానంద స్వామియే శాస్త్ర విరుద్ధంగా సన్యాసాన్ని స్వీకరించావు. కాబట్టి మళ్ళీ గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని విఠల పంత్ ను ఆదేశించారు. తరువాత వీరికి వరుసగా నివృత్తి నాథుడు, జ్ఞానదేవుడు, సోపానదేవుడు అనే ముగ్గురు కుమారులు, ముక్తాబాయి అనే కుమార్తె జన్మించారు. సన్యాసం స్వీకరించి తిరిగి గృహస్థాశ్రమంలోకి వచ్చాక కలిగిన సంతానం కాబట్టి ఆ కుటుంబమంతటినీ వెలివేశారు. కుల



బహిష్కరణ చేశారు. వారికి ఉపనయనాదులు కూడా జరగలేదు. అయినా వీరందరూ పారమార్థిక చింతన కలిగిన వారైనారు. విఠలపంత్, రుక్మిణీబాయి దంపతులు తాము ఆశ్రమ ధర్మాన్ని ఉల్లంఘించినందుకు ప్రాయశ్చిత్తంగా తమ దేహాలను ప్రయాగ వద్ద త్రివేణి సంగమంలో సమర్పించుకున్నారు.

జ్ఞానదేవుడు చదువులో దిట్ట. అన్ని శాస్త్రాలను అభ్యసించినవాడు. అయిన అప్పటి బ్రాహ్మణులు ఉపనయన దీక్ష యివ్వక పరిహాసం చేశారు. తండ్రి బ్రతిమాలుతున్న సమయంలోనే ఒక రైతు దున్నపోతును తొలుకుంటూ దాన్ని జ్ఞానా అంటూ అదిరిస్తూ ఆ దారిలో కనబడ్డాడు. ఆ దృశ్యము చూపిస్తూ ఆ పంతుళ్ళు తెగ నవ్వుకుంటూ చూశావా ఆ దున్నపోతు కూడా జ్ఞానదేవుడేనట, అదీ వేదాలు వల్లిస్తుందేమోనని పరిహాసం చేశారు.


అప్పుడు జ్ఞానదేవుడు వెంటనే అవును దున్నపోతు కూడా వేదాలు వల్లిస్తుందని చెప్పాడు. అందుకు ఆ పంతుళ్ళు ఏదీ వేదాలు చెప్పమను మేము చూస్తాం అన్నారు. అప్పుడు జ్ఞానదేవుడు దున్నపోతును తన దగ్గరకు తీసుకొని దాని చెవిలో ఏదో చెబుతాడు. అంతే, దున్నపోతు మాట్లాడడం మొదలు పెట్టి వేదాలు వల్లెవేసింది. బ్రాహ్మణులూ ఆశ్చర్యపోయి క్షమించమంటూ జ్ఞానదేవుని పాదాలు పట్టుకున్నారు. అంతటి మహానుభావుడు జ్ఞానదేవుడు.

అయినా ఆయనని ఇంకా పరీక్షించాలనుకున్న మరో పండితుడు, జ్ఞానదేవుడితో 'గాడిద తో వేదం పలికించమని' పరీక్ష పెట్టారు. అప్పుడాయన దాని తలమీద చేతులు ఉంచారు. వెంటనే ఆ గార్ధభం నాలుగు వేదాలను స్వరం, ఉచ్చారణలతో సహా స్పష్టంగా వల్లించడం ప్రారంభించింది. దాంతో జ్ఞానదేవుని ప్రజ్ఞ అక్కడి వారికి అర్థమయ్యింది. ఆయన ఆధ్యాత్మిక ఉన్నతికి అక్కడి వారందరూ శిరస్సు వంచి ప్రణామాలర్పించారు.

ఇంకోసారి జ్ఞానదేవుడిని ఒక బ్రాహ్మణుడు తన ఇంటికి ఆబ్దీకానికి అంటే తద్దినానికి ఆహ్వానిస్తే వెళ్లారు. అక్కడ ఆ బ్రాహ్మణుని పితృదేవతలను మంత్రపూర్వకంగా ఆహ్వానించారు జ్ఞానదేవుడు. అందరు సాక్షాత్కారమై వచ్చి, పితృవధీని (భోజనమును) సంతృప్తికరంగా పొందారు. అంతటి యోగం, సిద్ధి ఆ మహానుభావుడికి ఉండేవి.

ఆ రోజుల్లో చాంగదేవుడనే యోగిపుంగవుడుండేవాడు. ఈ యోగి అనేకమైన సిద్ధులను వశపరచుకొని అహంకారంతో విర్రవీగుతుండేవాడు. ఒక పులిమీద స్వారీ చేసుకుంటూ చేతిలో పాముల్ని శూలాలను తిప్పుకుంటూ జ్ఞానదేవుని చూడడానికి వెళ్ళాడు. జ్ఞానదేవుడు తన అన్నదమ్ములతో ఒక గోడనెక్కి ఇంటివద్దనే వున్నాడు. తాను వస్తున్నట్లు ఒక తెల్లకాగితాన్ని చాంగదేవుడు పరిహాసంగా పంపిస్తాడు. అప్పుడు జ్ఞానదేవుడు నవ్వుకుంటూ గోడమీదనుంచే పలకరిస్తాడు. గోడే నడుస్తూ

వెళ్ళింది. చాంగదేవుడు దిగ్భ్రాంతి చెంది తన తప్పు మన్నించమని ప్రార్థిస్తాడు. దానికి ఆయన తన సోదరి ముక్తాబాయిని ఆశ్రయించమని ఆనతినిచ్చారు. ఆమె చిన్న బాలికే అప్పుడు. అంత చిన్నపిల్ల దగ్గర ఏమీ తెలీని పసిపిల్ల వద్ద ఎలా నేర్చుకొంటాను అని భావించినా ఆ తర్వాత, ఆమె పెట్టిన పరీక్షలకు తట్టుకొని, ఆమె వద్ద శుశ్రూష చేసి జ్ఞానాన్ని పొందాడు చాంగ దేవుడు.



జ్ఞానేశ్వరుడు సాధించిన యోగసిద్ధి వలన సమాజం అంతా జ్ఞానేశ్వరుని వైపు ఆకర్షితమైంది. సంత్ జ్ఞానేశ్వరుడు భగవద్గీతలోని 770 శ్లోకాలకు సరళమైన మరాఠీ భాషలో వ్యాఖ్యానం వ్రాశాడు. మరాఠీ భాషలో గానానుకూలమైన ఓవీ ఛందస్సులో 9000 ఓవీలతో మృదు మధురము, సర్వ సులభమైన భాషలో రచించాడు. ప్రసన్న, గంభీర భావాలతో ఇది “భావార్థదీపిక”గా వెలుగొందినది. భగవద్గీతపై దేశభాషలలో వ్రాసిన వ్యాఖ్యనాలలో ఇదే మొట్టమొదటిది. ఇది “జ్ఞానేశ్వరి”గా లోక ప్రసిద్ధి పొందింది. తరువాత సర్వోపనిషత్సారంతో స్ఫూర్తివాదాన్ని ప్రతిపాదిస్తూ “అనుభవామృతం” (అమృతానుభవ్) “హరి పాట్ కే అభంగ్”, “చాంగ దేవ పైసటి” మొదలగు గ్రంథాలను వ్రాసి తన జ్ఞానాన్ని సమాజానికి సమర్పించారు. అవేగాక వేలాది అభంగాలను కూడా రచించారు. జ్ఞానేశ్వరుని ఈ రచనలు భారతీయ సంస్కృతి, ధర్మములందే కాక, భక్తి సాహిత్యంలోనే అద్వితీయ స్థానాన్ని ఆక్రమించింది.

సంత్ జ్ఞానేశ్వర్ పైఠాన్ ప్రాంతం లోని గోదావరి నది ఒడ్డున “ఆపేగావ్”లో ఉండేవారు. ఆయన గురువు అన్నగారైన నివృత్తినాథుడే! జ్ఞానదేవుడు పేరుకి తగినట్టే మహాజ్ఞాని. చిన్నతనంలోనే వేదశాస్త్రాలను క్షుణ్ణంగా అభ్యసించారు. 15 ఏళ్లకే ఆయన భగవద్గీతకు మరాఠీ భాషలో రాసిన వ్యాఖ్యానం ‘భావార్థదీపిక’ – ‘జ్ఞానేశ్వరి గీత’ గా పేరు పొందింది.

జ్ఞానదేవునికి ఒక తమ్ముడు, చెల్లెలు కూడా ఉన్నారు. తమ్ముడు సోపానదేవుడు, చెల్లెలు ముక్తాబాయి. వీరందరూ సార్థక నామధేయులు. పేరుకి తగినట్టే జీవనాన్ని సాగించి ముక్తికాంతను చేరుకున్నారు.

ఒకరోజు దీపావళి పండుగ. ముక్తాబాయి భక్ష్యాలు చేసి అన్నలకి విందు చేయాలి అనుకుంది. కానీ భక్ష్యాలు కాల్చేందుకు పెనం లేదు. అంగడికి వెళ్లి తీసుకొద్దాం అనుకుంటే, ఈ కుటుంబం అంటే పడని అసూయాపరుడైన విసోబా అంగడిలో వీరికి ఎలాంటి సరుకూ అమ్మకూడదని ఆంక్షలు విధించాడు. దాంతో తల్లడిల్లుతున్న ముక్తాబాయి బాధని చూసి, విషయం తెలుసుకున్న జ్ఞానదేవుడు తన వీపునే కాలే పెనంగా మార్చేశారు. చెల్లెలు తనవీపుమీద చేసిన భక్ష్యాలని అన్నదమ్ములు ఆనందంగా ఆరగించారు. విసోబాకి తగిన గుణపాఠం చెప్పారు. ఇలాంటి విచిత్ర లీలలు ఆయన జీవనంలో అడుగడుగునా కనిపిస్తాయి.

**అగ్ని జ్వాలలు ఎవరినీ సమీపించలేవు ?**

జ్ఞానదేవుడు బాల్యం నుంచి ఆ పాండురంగడిని అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తూ ఉండేవాడు. ఆశ్రమ జీవితాన్ని కొనసాగిస్తూ ... ప్రజలకు జ్ఞానబోధ చేస్తూ ఉండేవాడు. పరమాత్ముడి తత్త్వాన్ని అర్థం చేసుకుని ఆయనకి సమీపంగా జీవించమని చెబుతూ ఉండేవాడు. జ్ఞానదేవుడి బోధనలను అక్కడి ప్రజలు ఎంతో ఆసక్తితో వింటూ ఆచరిస్తూ వుండేవాళ్లు.

జ్ఞానదేవుడు భక్తుడు మాత్రమే కాదనీ, దైవాంశ సంభూతుడని భావించేవాళ్లు. అందువలన ఆయన పట్ల ఎంతో మర్యాద పూర్వకంగా నడచుకునే వాళ్లు. జ్ఞానదేవుడి కీర్తిప్రతిష్ఠలను చూసి ఓర్వలేని కొందరు ఆయనకి వ్యతిరేక వర్గంగా తయారవుతారు. తమకి సాధ్యమైనంతగా వాళ్లు ఆయన గురించి ఇతరులతో చెడుగా చెప్పడం మొదలెడతారు. భక్తి పేరుతో ప్రజలను జ్ఞానదేవుడు తప్పుదోవ పట్టిస్తున్నాడనీ, ఆయనను ఊరు నుంచి తరిమేయాలని ప్రచారం చేయసాగారు.

ఈ విషయం చెవిన పడటంతో జ్ఞానదేవుడి మనసుకు కష్టం కలుగుతుంది. తాను చేస్తున్నది తన స్వార్థం కోసమే అయితే, అగ్నిదేవుడు తన ఆశ్రమంతో పాటు తమని కూడా దహిస్తాడని చెబుతాడు జ్ఞానేశ్వర్.

అందరూ చూస్తుండగానే ఆయన తన సోదరులతో కలిసి ఆశ్రమంలోకి ప్రవేశించి, లోపలి నుంచి తలుపులు వేసి ఆశ్రమానికి నిప్పు పెడతాడు. ఊహించని ఈ సంఘటనకు ఆయన సేవకులతో పాటు వ్యతిరేకులు కూడా బిత్తరపోతారు.

జ్ఞానేశ్వర్ సేవకులు ఆ మంటల బారి నుంచి ఆయనని కాపాడాలనుకుంటారు గానీ, ఎగసి పడుతోన్న మంటల సమీపంలోకి వెళ్లలేకపోతారు. ఆశ్రమం పూర్తిగా కాలిపోతోందని అంతా అనుకుంటూ వుండగా, ఒక్కసారిగా మంటలన్నీ మాయమై ఎప్పటిలా ఆశ్రమం దర్శనమిస్తుంది. ఇది చూసిన వాళ్లంతా తమ కళ్లను తామే నమ్మలేకపోతారు. లోపల జ్ఞానేశ్వర్ తో పాటు ఆయన సోదరుల పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవడం కోసం ఆత్రంగా అడుగు ముందుకు వేయబోతుండగా, వాళ్లంతా ఎప్పటిలానే ప్రశాంత వదనాలతో బయటికి వస్తారు.

ఎలాంటి స్వార్థం లేకుండా ఆయన ప్రజలకు జ్ఞానబోధ చేస్తున్నాడనే విషయం అందరికీ అర్థమై పోతుంది. జ్ఞానేశ్వర్ సేవకులతో పాటు ఆయన వ్యతిరేకులు సైతం పరిగెత్తుకుంటూ

వచ్చి ఆయన పాదాలపై పడతారు.


మహాభక్తుడైన జ్ఞానేశ్వర్ ని అగ్నిజ్వాలలు తాకలేకపోయిన ఈ సంఘటన, ఆయన జీవిత చరిత్రలో స్పష్టంగా కనిపిస్తూ వుంటుంది. అసమానమైన ఆయన భక్తికి నిలువెత్తు నిదర్శనమై నిలుస్తూ వుంటుంది.

**భక్తులపై విషం ప్రభావం చూపలేదా ?**

భగవంతుడు తనని విశ్వసించిన వాళ్లని అనాథలను, అభాగ్యులను చేయడు. ఏదో ఒక రూపంలో వాళ్లకి సహకరిస్తూ ఉంటాడు. వాళ్లకి ఆదరణను, ఆశ్రయాన్ని కలిగిస్తూ ఉంటాడు. తన భక్తులపై విషం సైతం ప్రభావం చూపకుండా ఆయన రక్షిస్తుంటాడు. ప్రహ్లాదుడి విషయంలోనే కాదు, జ్ఞానదేవుడి విషయంలోను ఇది మరోసారి నిరూపించబడింది.

నా అనే వాళ్లు లేకపోవడంతో తమని ఆదరించేవారి కోసం అన్వేషిస్తూ తన సోదరులతోను ... చెల్లి తోను కలిసి బయలుదేరుతాడు జ్ఞానదేవుడు. ఆకలిని .. దాహాన్ని తట్టుకోవడానికి వాళ్లు దైవ నామస్మరణనే మార్గంగా ఎంచుకుంటారు. అలా వాళ్లు చాలాదూరం ప్రయాణించి ఓ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ లభించిన పండ్లతో ఆకలి తీర్చుకుంటారు.

దాహం కావడంతో అక్కడికి దగ్గరలో కనిపిస్తోన్న ఒక బావి దగ్గరికి వెళతారు. ఆ బావి గట్టున నిలబడి అందులోని నీటితో తనవాళ్ల దాహం తీరుస్తాడు జ్ఞానదేవుడు. ఈ దృశ్యం చూసిన గ్రామస్తులు పరుగు పరుగున అక్కడికి వస్తారు. జ్ఞానదేవుడు వాళ్లు



ఆ నీటిని తాగడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తారు. చాలాకాలం క్రితమే ఆ బావిలోని నీళ్లు విషపూరిత మయ్యాయని చెబుతారు.

అందువలన ఆ బావిలోని నీటిని తాగిన మనుషులు, పశువులు చనిపోవడం జరిగిందని అంటారు. ఈ కారణంగానే ఎంతో దూరం నడిచివెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నట్టు చెబుతారు. భయపడవలసిన పనిలేదనీ, నిజానికి ఆ బావిలోని నీళ్లు ఎంతో రుచికరంగా వున్నాయని చెబుతాడు జ్ఞానదేవుడు. ఆ విషయం పట్ల వాళ్లకి నమ్మకం కలిగించడం కోసం, మరోమారు తాను తాగడమే కాకుండా వాళ్లతోను ఆ నీళ్లను తాగిస్తాడు.

ఎవరికీ ఏమీ కాకపోవడంతో వాళ్లంతా ఆనందాశ్చర్యాలకి లోనవుతారు. జ్ఞానదేవుడి స్పర్శ కారణంగానే ఆ నీటిలో గల విషం విరుగుడు కాబడిందనీ, ఇక నీళ్ల విషయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడవలసిన పనిలేదని అంటారు. ఇకమీదట తమ గ్రామంలోనే ఉండమనీ, వాళ్లకి అవసరమైనవన్నీ తాము సమకూరుస్తామని అంటారు. అలా భగవంతుడి దయవలన జ్ఞానదేవుడు వాళ్లకి ఆ గ్రామస్థుల ఆదరాభిమానాలు లభిస్తాయి. జ్ఞానదేవుడిలోని భక్తి పరిపక్వ దశకు చేరుకోవడానికీ, ఆయన కీర్తి ప్రతిష్ఠలు దశ దిశలా వ్యాపించడానికి ఆ గ్రామమే వేదిక అవుతుంది.

"సంత్ జ్ఞానేశ్వర్"గా అందరిచేత పిలువబడే జ్ఞానదేవుడు 'భక్తశిఖామణిగా', 'జ్ఞానేశ్వర మహారాజు'గా ప్రసిద్ధుడు. పూర్ణయోగిగా జ్ఞానేశ్వరుడిని భావిస్తారు. నిత్యం పాండురంగ విభునితో మాట్లాడుతూ, ఆయనతో తిరుగుతూ ఉండేవాడు. పూనా దగ్గర 'ఆలంది'లో ఆయన చూపిన అద్భుతాలన్నీ ఇవాళ మనకు చిత్రాలుగా ప్రత్యక్షం అవుతాయి. వాటిని చూసి ఆనందించడం ఒక మధురానుభవం. 'సచ్చిదానందుడు' అనే గృహస్తు చనిపోతే, అతన్ని బ్రతికించిన ప్రాణదాత జ్ఞానేశ్వరుడు. అతడు ఆ తర్వాత "సచ్చిదానంద బాబా" గా జ్ఞానదేవుని శిష్యుడై, ఆయన భావ వ్యాప్తికి తోడ్పడ్డాడు.

సంత్ జ్ఞానేశ్వరుని ప్రయత్న ఫలితంగా హిందూ సమాజంలోని వర్ణాశ్రమ వ్యవస్థలో ప్రవేశించిన దోషాలు, కురీతులు ప్రక్షాళనం చేయబడి సమరసత ప్రతిష్ఠించబడింది. 'సమత' అనేది ఉచ్చ స్వరమైనది'. ప్రజలందరూ మృదువైన భక్తిసూత్రంలో బంధింపబడి మతాంతరీకరణల ప్రమాదం నుంచి రక్షింపబడ్డారు. దుర్గతిలో చిక్కుకుపోతున్న హిందువులకు తాను వ్రాసిన గీత లోని కర్మయోగం ద్వారా చికిత్సా విధానాన్ని సూచించాడు జ్ఞానేశ్వరుడు. మహారాష్ట్ర ప్రాంతంలో వీరు చూపిన భాగవత ధర్మం లేదా భక్తి సంప్రదాయ మార్గాన్ని "వరకరి" సంప్రదాయం అంటారు. దాన్ని సుదృఢం చేసి అవైదిక శక్తులను పరాజితులను గావించారు. ఇంతటి మహత్తర కార్యాన్ని సాధించిన సంత్ జ్ఞానేశ్వర్ జీవించింది ఖచ్చితంగా 21 సంవత్సరాల 3 నెలల 5 రోజులు మాత్రమే. క్రీ.శ.1296 మార్గశిర బహుళ త్రయోదశి గురువారం పూనా వద్ద అలంది అనే ప్రదేశంలో జ్ఞాన దేవుని జ్ఞానజ్యోతి అఖండ చైతన్య జ్యోతిలో విలీనం అయింది. జ్ఞానదేవులకు తన అన్న నివృత్తి నాధులు అంటే ప్రేమ, భక్తీ, గౌరవం ఎక్కువ. సాంప్రదాయాలకు అతీతంగా ఆయన రాసిన 'జ్ఞానేశ్వరి గీత' ఇప్పటికీ శిరోధార్యమే.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

వెళ్ళాడు సుగ్రీవుడు. గర్జించాడు. ఆకాశం బద్దలైందా అన్నట్లుందా సింహనాదం. విన్నాడు వాలి. తాగిన మత్తు దిగింది. క్రోధాగ్ని చెలరేగింది. శరీరమంతా ఎర్రబారింది. ఇంద్రుడిచ్చిన బంగారుమాల అందుకున్నాడు. మెడలో వేసుకున్నాడు. సంధ్యా సమయంలో గ్రహణం పట్టిన సూర్యుడిలా ఉన్నాడు.

## హితవు

అడుగులు వేశాడు వాలి. భూమి దద్దరిల్లింది. చూసింది తార. ఆమె అతని భార్య. సంభ్రాంత చిత్త అయింది. వెంటనే తేరుకుంది. గబగబా నడిచింది. వాలిని చేరింది. స్నేహాతిశయంతో కౌగలించుకుంది. అంటోంది.

''మహావీరా! నీ కోపం నదీప్రవాహంలా ఉంది. నా మాట విను. శాంతించు. యుద్ధంలో నిన్ను మించినవాడు లేడు. రేపు ఉదయం వెళ్ళు. యుద్ధం చెయ్. ఇపుడు వద్దు. ఈలోగా నీ బలం తగ్గదు. పరాక్రమం తగ్గదు. ఎందుకు చెబుతున్నానో విను. ఆలోచించు''.

ఇందాక చావు దెబ్బలు తిన్నాడు సుగ్రీవుడు. అంతలోనే యుద్ధానికి పిలుస్తున్నాడు. నీ తమ్ముడు తెలివిపరుడు. కార్య కుశలుడు. అతని వెనుక ఎవరో ఉన్నారు. ఇందాక అంగదుడు వచ్చాడు. వేగులవాళ్ళు చెప్పారట. నాతో అన్నాడు. ఇక్ష్వాకు వంశీయుడు, అయోధ్యాపతి దశరథుడు. అతని పుత్రులు రామలక్ష్మణులు. పరాక్రమవంతులు. అజేయులు. మన సుగ్రీవునికి సాయపడుతున్నారు. రాముడు రణ కర్కశుడు. ప్రళయాగ్నిలా విజృంభిస్తాడు. సర్వమూ దహిస్తాడు''.

''స్వామీ రాముడు సాధువులకు, ఆపన్నులకు రక్షకుడు. అతనితో విరోధం వద్దు. మంచిది కాదు. సుగ్రీవుడు నీ తమ్ముడు. పరాయివాడు కాదు. బాంధవ్యం తెంచినా తెగదు. అతడు ఆత్మీయుడు. అంతటివాడు దొరకడు. నీ మేలు కోరేదాన్నయితే – నన్ను సంతోషపరచాలనుకుంటే – నీకు సమ్మతమైతే రామునితో కలహం వద్దు. ఇపుడు ఇంతకంటే మంచి దారి లేదు''.

అవి తార మాటలు. హితకరాలు – క్షేమదాయకాలు. అయితే వినాశకాలం దాపురించింది. ఆయువు మూడింది వాలికి. ఆమె మాటలు రుచించలేదు.

విన్నాడు వాలి. బదులిస్తున్నాడు. ''సుందరీ సుగ్రీవుడు నా సోదరుడే. కాని ఇపుడు నా శత్రువు. గర్జిస్తున్నాడు. రెచ్చగొడుతున్నాడు. యుద్ధానికి పిలిస్తే శూరులు వీరులు

ఊరుకోరు. ఎదురు దాడి చేస్తారు. ఛేయకపోతే చావడం మేలు. ఇక రాముడంటావా – ధర్మజ్ఞుడు. కృతజ్ఞుడు. పాపకార్యం ఎందుకు చేస్తాడు? తమ్ముడి పొగరు అణుస్తాను. వాడి రణ కండూతి తీరుస్తాను. కొడతాను అంతేకాని వాణ్ణి చంపను. ఒట్టేసి చెబుతున్నాను. నమ్ము. నా మేలు కోరి చెప్పావు. చాలు. నన్ను అడ్డగించకు. వెళ్ళిపో''.


వినింది తార. మరోసారి కౌగలించుకుంది. భర్తకి ప్రదక్షిణం చేసింది. అతని విజయాన్ని కోరింది. స్వస్తి వచనాలు పలికింది. అవన్నీ మంత్రయుక్తాలు. దుఃఖ పరవశురాలైంది. అంతఃపురానికి వెళ్ళింది.

## మలి పోరు

కోపోద్రిక్తుడైనాడు వాలి. నగరం వెలుపలికి వచ్చాడు. చుట్టూ చూశాడు. 'సదదర్శ శ్రీమాన్ సుగ్రీవం హేమ పింగళమ్' బంగారు రంగులోని సుగ్రీవుడు కనబడ్డాడు. చక్కగా తట్టీ కట్టి ఉన్నాడు. అగ్నిహోత్రంలా ప్రజ్వరిల్లుతున్నాడు. యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు.

ఇక్కడ సుగ్రీవుని శ్రీమాన్ అన్నాడు వాల్మీకి. రాముని (నారాయణుని)తో, లక్ష్మణుని (ఆదిశేషుని)తో అనుగ్రహింపబడ్డాడు. గజపుష్పమాల ధరించాడు. అంచేత సుగ్రీవుడు లక్ష్మీ సంపన్నుడైనాడని వాల్మీకి అభిప్రాయం. భగవత్ ఐశ్వర్యమే మహా సంపద. ఇహలోక ఐశ్వర్యాదులు కావు. అందుకే సుగ్రీవుడు శ్రీమాన్ అనిపించుకున్నాడు.

వాలి సుగ్రీవులు భయంకరులు. బలవంతులు. పరాక్రమవంతులు. శత్రు సంహార దక్షులు. పిడికిలి బిగించాడు వాలి. తమ్ముణ్ణి కొట్టాడు. ఒకే దెబ్బ. నోట్లోంచి రక్తం కారింది. సుగ్రీవుడు భయపడలేదు. ఓ మద్దిచెట్టు పెరికాడు. అన్నని కొట్టాడు. దెబ్బకి దిమ్మ తిరిగింది వాలికి. చలించిపోయాడు. ఒకరి లోపం ఒకరు వెదకసాగారు. చెట్లతో కొమ్మలతో కొట్టుకున్నారు. పిడికిళ్ళతో పొడుచుకున్నారు. గుద్దుకున్నారు. గోళ్ళతో రక్కుకున్నారు. కాళ్ళతో తన్నుకున్నారు. చేతులతో చరుచుకున్నారు. మేఘాల్లా గర్జించారు. ఇద్దరి శరీరాలు నెత్తురుతో తడిసిపోయాయి. క్రమంగా వాలి బలం పెరిగింది. పరాక్రమం పెరిగింది. సుగ్రీవుని బలం మందగించింది. అయినా కోపం పెరిగింది. చురుకుదనం పెరిగింది. తమ్ముని దర్పాన్ని అణగదొక్కాడు వాలి.



దిక్కులు చూస్తున్నాడు సుగ్రీవుడు. మాటి మాటికీ చూస్తున్నాడు. అతడు ఆర్తుడైనాడు. గ్రహించాడు రాముడు. ఆ చూపులు తన కోసమే అని గ్రహించాడు. బాణం తీశాడు. ధనుస్సుకి తొడిగాడు. విషసర్పంలా ఉందా శరం. ఆకర్ణాంతం లాగాడు నారిని. ఆ లాగినపుడు శబ్దం పుట్టింది. పక్షులు ఎగిరిపోయాయి. మృగాలు పరుగులు తీశాయి. రామబాణం మెరుపులా మెరిసింది. పొగలు కక్కింది. భగ భగ మండింది. వేగంగా పోయింది. వాలి గుండెల్లో నాటుకుంది.

మహా తేజశ్శాలి బలశాలి వాలి. కిందపడ్డాడు. ఆశ్వయుజ పూర్ణిమ నాడు ధ్వజోత్సవం జరుగుతుంది. ఉత్సవం ముగుస్తుంది. ధ్వజాన్ని కింద పడేటట్లు తోస్తారు. అలా పడ్డాడు వాలి. చైతన్య రహితుడైనాడు. రక్తధారలు స్రవిస్తున్నాయి. గాలి ఒరవడి ఎక్కువైంది. రక్తవర్ణ అశోక వృక్షం పడ్డట్లు – పడ్డాడు వాలి.

అయితే వాలి మెడలో బంగారుమాల వుంది. అది వజ్రాలు పొదిగిన మాల. అది దేవేంద్రుడు ఇచ్చాడు. అది ఉన్నంతవరకు – వాలి ప్రాణం పోదు. తేజస్సు తగ్గదు. సంధ్యారాగం అలముకున్న మేఘమా అన్నట్లు కనిపించాడు వాలి. మంటలు ఆరిపోయిన అగ్నిలా కనిపించాడు.

రామబాణం ఒక దివ్యాస్త్రం. అది స్వర్గానికి దారి చూపుతుంది. అది వాలికి పరమగతిని ప్రసాదిస్తుంది. దుర్ధర్షుడు దుస్సహుడు సింహవక్షుడు మహాబాహుడు హేమమాలాధరుడు వాలి. అది రామబాణమని తెల్సుకున్నాడు. అతణ్ణి చూడాలనిపించింది. తేనెకన్నులు తెరుస్తున్నాడు. మూస్తున్నాడు. వాలిని చూశారు రామలక్ష్మణులు. అతణ్ణి సమీపించారు. ముందు ఉన్నాడు లక్ష్మణుడు. వెనుక ఉన్నాడు రాముడు. చూశాడు వాలి. అంటున్నాడు.

## ఆక్షేపణలు

'రామా! నీవు రాజపుత్రుడవు. కులీనుడవు. ధర్మశాస్త్ర వేత్తవు. లోకప్రసిద్ధుడవు. ఒకరితో యుద్ధం చేస్తున్నాను. నేనపుడు పరాసక్తుణ్ణి. నన్నెందుకు చంపావు? దాంతో నీకేం ప్రయోజనం?

రామః కరుణవేదేచ ప్రజానాంచ హితేరతః ।
సానుక్రోశో జితోత్సాహః సమయజ్ఞో దృఢవ్రతః ॥

నీవు కరుణామయుడవు. దయామయుడవు. ప్రజాహిత రతుడవు. జితేంద్రియుడవు. ఉత్సాహవంతుడవు. శక్తిమంతుడవు. సదాచార సంపన్నుడవు. ఇంద్రియ నిగ్రహం కలవాడవు. మనోనిగ్రహం సహనం ధర్మాచరణ ధైర్యం సత్యవ్రతం పరాక్రమం అపరాధులను శిక్షించడం – ఇవి రాజలక్షణాలు.



సుగ్రీవునితో నీవు ఉన్నావు. తెలుసుకుంది తార. యుద్ధానికి పోవద్దని చెప్పింది. అయినా వచ్చాను. ధర్మాత్ముడు రాముడు. దొంగ దెబ్బ తీయడు అని నమ్మాను. కాని ధర్మం అనే ముసుగు కప్పుకున్నావు. అధార్మికుడవు. గడ్డి కప్పిన బావి లాంటివాడవు. నివురు గప్పిన నిప్పు లాంటి వాడవు. ధర్మాన్ని అడ్డు పెట్టుకున్నావు. లోకాన్ని మోసగిస్తున్నావు. ఇలాంటివాణ్ణి నేను చూడలేదు.

రామా! నేను నీ దేశంలో లేను. నీ పట్టణంలో లేను. ఎవరికీ అపకారం చేయలేదు. నిన్ను అవమానపరచలేదు. ఏ పాపమెరుగను. నన్నెందుకు చంపావు. నీతో పోరాడలేదు. మరొకరితో పోరాడుతున్నాను. నన్నెందుకు చంపాలనుకున్నావు? పైకి జటా వల్కలాల ధారివి. పైకి ధర్మపరుడివి. నిజానికి అధర్మపరుడివి.

క్షత్రియుడవు. వేదశాస్త్ర అధ్యయనుడవు. ధర్మమార్గావలంబివి. ఇలాంటి క్రూరకర్మలు చేస్తావా? రాజవంశంలో పుట్టావు. ధర్మాత్ముడు – అని పేరు పొందావు. సౌమ్య రూపంలో ఉన్నావు. ఎందుకు ఈ పాడు పని చేశావు? శాంతం, దమం, సహనం, ధర్మాచరణ, సత్యవచనం, ధైర్యం, పరాక్రమం, అపరాధుల్ని శిక్షించడం – ఈ ఎనిమిది గుణాలు. అవి రాజుకి ఉండాలి.

నేను వనచరుణ్ణి. నీవు నగరవాసివి. నేను వానరుణ్ణి. నీవు నరుడవు. పైగా రాజువి. నేను కాయ కసరులు పండ్లు దుంపలు తినేవాణ్ణి. నీవు రాజభోజనం చేసేవాడివి. నేనేం చేశానని – నన్ను చంపావు? నీకు నాకు భూ వివాదం లేదు. జల వివాదం లేదు. వెండి బంగారం కారణం కాదు. స్త్రీ వివాదం అసలే లేదు. నేను తినే కందమూలాలకు ఆశపడ్డావా? మనమధ్య ఏ వివాదం లేదు. మరి నన్నెందుకు చంపబోయావు?

నీతిని పాటించడం, వినయంతో ఉండడం, దోషులను దండించడం, నిర్దోషులను అనుగ్రహించడం – ఇవి రాజుకు ముఖ్య విధులు. వాటిపట్ల సమయానుకూలంగా ప్రవర్తించాలి. నీవు వాటినన్నింటిని ఏకం చేశావు. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావు. నీవు కామదాసుడవు. కోపస్వభావుడవు. చపలుడవు. ఇంద్రియ లోలుడవు. ధర్మం మీద శ్రద్ధ లేదు. ధనుస్సు ఉంది. బాణాలున్నాయి. అంతమాత్రాన ప్రయోగించ వచ్చునా? ఏం అపరాధం చేయలేదు నేను. నన్ను బాణంతో కొట్టావు. చంపాలనుకున్నావు. వాలిని ఎందుకు చంపావు అని సత్పురుషులు అడుగుతారు. అపుడేం చెబుతావు?

రాజును చంపినవాడు, బ్రాహ్మణుని చంపినవాడు, గోవును చంపినవాడు, దొంగతనం చేసినవాడు, ప్రాణుల్ని హింసించినవాడు, నాస్తికుడు, అన్నగారి కంటే ముందే పెండ్లి చేసుకున్న తమ్ముడు, చాడీలు చెప్పినవాడు, స్నేహితుల్ని చంపినవాడు, గురుభార్యని రమించినవాడు – వీళ్ళంతా పాపాత్ములు. అందరూ నరకానికి పోతారు. నీవు ఆ తెగవాడివే.

సత్పురుషులకి జింక చర్మం ఆసనం. నా చర్మం పనికిరాదు. చమరీ మృగానికి కేశాలుంటాయి. అవి దైవసేవకి పనికి వస్తాయి. చామరాలుగా ఉపయోగిస్తారు. నా రోమాలు దేనికీ పనికిరావు. క్షత్రియులు మాంసం తింటారు. ముళ్ళపంది, పంది, ఉడుము, కుందేలు, తాబేలు – వీటికి ఐదు గోళ్ళుంటాయి. వాటిని చంపుతారు. ఆ మాంసం తింటారు. మాకూ ఐదు గోళ్ళున్నాయి. కాని కోతుల్ని ఎవరూ చంపరు. తినరు. అలాంటప్పుడు నన్నెందుకు చంపావు?

నా భార్య చెప్పింది నిజం. నేనామె మాట వినలేదు. మూర్ఖుణ్ణి. ఆయువు మూడింది నాకు. నీవు కపటివి. పరులకు అపకారం చేస్తావు. నీచపు పనులు చేస్తావు. నక్క వినయం చూపుతావు. మహా పాపివి. దశరథ మహారాజు ధర్మాత్ముడు. ఆయనకు ఎలా పుట్టావు నీవు? అపరాధం చేస్తారు చూడు. వాళ్ళపై నీ పరాక్రమం చూపు. నిరపరాధిని నేను. నా మీద నీ పరాక్రమమా? నాకు శక్తి ఉంటే – సామర్థ్యం ఉంటే – నా కంట పడివుంటే – యుద్ధం

చేసివుంటే – ఈపాటికి యమదర్శనం చేసేవాడివి. బాగా తాగి తెలివి తప్పి వుంటాడు. అలాంటివాణ్ణి పాము కరిచినట్లు – చాటున దాగావు. నన్ను చంపావు.

సీత కోసం సుగ్రీవుని ఆశ్రయించావు. వాడి కోసం నన్ను దెబ్బ తీశావు. నన్ను అడిగి వుంటే – మైథిలిని రావణుడు ఎక్కడ దాచినా – సముద్రంలో దాచినా, పాతాళంలో దాచినా వాడితో పోరాడేవాణ్ణి. చావగొట్టేవాణ్ణి. బంధించేవాణ్ణి. నీముందు పడేసేవాణ్ణి. ఒక్కరోజులో ఆ సాధ్విని తెచ్చేవాణ్ణి. నీకు అప్పగించేవాణ్ణి.

రామా! సుగ్రీవుడు నా తమ్ముడు. నాతో యుద్ధం చేయవచ్చు. నన్ను చంపవచ్చు. రాజ్యం పొందవచ్చు. వాడు నా జ్ఞాతి. నీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. వాడికోసం నన్నెందుకు కొట్టావు? ఎందుకు చంపావు? నీది అధర్మం. అక్రమం. అన్యాయం. పుట్టినవాడు చస్తాడు. అది సహజం. అది అనివార్యం. అది నాకు దుఃఖకరం కాదు. అధర్మంగా నన్ను చంపావు. రాజ్యం సుగ్రీవునికి ఇస్తున్నావు. అదే నా బాధ. అదే నా దుఃఖం. అదే నాకు విచారకరం. రామా! ఆలోచించు. వీలుంటే సమాధానం చెప్పు.

అలా 33 ప్రశ్నలు వేశాడు వాలి. అవి పరుషంగా ఉన్నాయి. వినయంగా ఉన్నాయి. నిష్ఠూరంగా ఉన్నాయి. నోరు ఎండిపోయింది వాలికి. బాణపు దెబ్బ తొలుస్తోంది. బాధ ఎక్కువైంది. మరేం మాట్లాడలేదు. సూర్యకాంతితో తేజరిల్లుతున్నాడు రాముడు. అతణ్ణే తదేకంగా చూస్తుండిపోయాడు వాలి.

## ధర్మోపదేశం

విన్నాడు రాముడు. సుదీర్ఘ ఆక్షేపణలు. చూశాడు వాలిని. అంటున్నాడు. "వాలీ! నీకు ధర్మార్థ కామాలు తెలియవు. అవి తెలిసిన పెద్దలుంటారు. బుద్ధిమంతులుంటారు. వాళ్ళని అడగలేదు. తెల్సుకోలేదు. నాదే తప్పు అంటున్నావు. నన్ను తూలనాడుతున్నావు".

"నీకూ నాకు సంబంధం ఏమిటి – అడిగావు కదా! రాముడు బదులిస్తున్నాడు. ఈ అఖండ భూమండలమంతా ఇక్ష్వాకు రాజులది. మా వంశీయులది. ఈ రాజ్యం మాది. నేను వద్దన్నాను. నా తమ్ముడు భరతుడూ వద్దన్నాడు. నన్నే తీసుకోమన్నాడు. అపుడు మేం ఒక ఒప్పందం చేసుకున్నాం. నేను వనవాసం ముగిస్తాను. తిరిగి వస్తాను. అంతవరకూ నీవే రాజుగా వుండు అన్నాను. నగరాలు, పట్టణాలు, పల్లెలు, ప్రజలు భరతుని అధీనం. కొండలు, అడవులు, వనాలు, మృగాలు నా అధీనం. మా రాజు భరతుడు. నేను అతని ప్రతినిధిని. ఇద్దరం ధర్మనిరతులం. అధర్మపరులుంటే శిక్షిస్తాం".

"నీకు తమ్ముడు సుగ్రీవుడు. వాణ్ణి కట్టుబట్టలతో తరిమేశావు. వాడు బతికి ఉన్నాడు. వాడి భార్యని లాక్కెళ్ళావు. అనుభవిస్తున్నావు. అది నేరం. అది అధర్మం. నీవు శిక్షార్హుడవు. అందుకే బాణం వేశాను. పడగొట్టాను. దండించాను. కన్నతండ్రి – తనకంటే పెద్దవాడైన అన్న – విద్య నేర్పిన గురువు – వీళ్ళు ధర్మమార్గంలో ప్రవర్తించాలి. అప్పుడే ఆ ముగ్గురూ తండ్రితో సమానం. తమ్ముని భార్య మరదలు. కూతురితో సమానం. కోడలు కూతురితో సమానం. అది లోక ధర్మం. నీ తమ్ముడి భార్య రుమ. ఆమె నీకు కూతురుతో సమానం. కాని ఆమెని అనుభవిస్తున్నావు. అది అధర్మం. అది మహాపాపం. దానికి మరణ దండన శిక్ష. అది ధర్మశాస్త్ర వచనం. అందుకే నిన్ను చంపాను".

"ధర్మం అతి సూక్ష్మమైంది. ఒక పుట్టు గుడ్డివాడు – గుడ్డివాళ్ళతో నడిస్తే ఏమవుతుంది? నీవు చపలుడవు. చపలులతో ఆలోచిస్తే ధర్మాధర్మాలు తెలుస్తాయా? నన్ను సాయం అడిగి వుంటే – అన్నావు. సుగ్రీవుడు నా మిత్రుడు. అగ్నిసాక్షిగా స్నేహితులం. సుఖం దుఃఖం సమానంగా పంచుకోవాలనుకున్నాం. సుగ్రీవుడు నాకు లక్ష్మణుని లాంటివాడు. తన భార్యని రాజ్యాన్ని పొందాలి. అది వాని కోరిక. వాని కోరిక తీరుస్తానన్నాను. నలుగురు వానరుల ముందు ప్రతిజ్ఞ చేశాను. ఇచ్చిన మాటని కాదని – నీతో స్నేహం చేస్తే – అది మహాపరాధం.

నీ తమ్ముడు నాకు మిత్రుడు. వానికి నీవు శత్రువు. మిత్రుని శత్రువు నాకూ శత్రువే. అందుకే నిన్ను చంపాను. అపరాధం చేసినవాణ్ణి క్షమించరాదు. విడిచిపెట్టరాదు. అలా చేస్తే – వాడి పాపం రాజుకి చుట్టుకుంటుంది. తప్పు చేసినవాణ్ణి దండిస్తే – వాడి పాపం పోతుంది. వాడు నరకానికి పోడు. స్వర్గం చేరగలడు".

పూర్వం మా వంశంలోనివాడు మాంధాత. అతడు చక్రవర్తి. ఒక బౌద్ధ భిక్షువు. శ్రమణకుడు వుండేవాడు. వాడు ఇలా అపరాధం చేశాడు. అపుడా చక్రవర్తి వానిని ఇలాగే శిక్షించాడు. ప్రజలు పాపాలు చేస్తారు. వాటికి ప్రాయశ్చిత్తంగా శిక్షలుంటాయి. ఆ శిక్షల్ని అమలు చేస్తారు రాజులు. నేను స్వతంత్రించి నిన్ను శిక్షించలేదు. మా పూర్వీకులు ఎలా చేశారో అలా చేశాను. మనుధర్మ శాస్త్రం ఏం చెప్పిందో అలాగే చేశాను. కనుక నేను శిక్షించటం ధర్మ సమ్మతం.

ఒక వానరుణ్ణి చంపవచ్చా – అన్నావు నీవు. నీవు వానరుడవే. నరునిలా సంధ్యా వందనాలు ఆచరిస్తున్నావు. నీవు మృగానివి. మృగాల్ని రాజులు వేటాడుతారు. రాజర్షులు ధర్మబద్ధులు వేట ధర్మమన్నారు. వేటలో ఎదురుగా ఉండి చంపవచ్చు. చాటునుంచి చంపవచ్చు. మాటువేసి చంపవచ్చు. వలపన్ని చంపవచ్చు. పరిగెడుతున్న దాన్ని చంపవచ్చు. ఎలాగైనా వేటలో చంపవచ్చు. అలాగే నిన్ను చంపాను. నాది దోషం కాదు. అధర్మం కాదు. తెలియక నన్ను దూషించావు. నాకు కోపం లేదు. నిన్ను చంపానని బాధ లేదు.

**దుర్లభస్యచ ధర్మస్య జీవితస్య శుభస్యచ |**
**రాజానో వానరశ్రేష్ఠ ప్రదాతరో న సంశయః ||**

ధర్మమార్గం దుర్లభమైంది. ఆ దారిలో ప్రజల్ని నడిపించేవారు

రాజులు. ప్రజల ప్రగతికి కృషి చేసేవారు రాజులు. వాళ్ళని హింసించరాదు. నిందించరాదు. ఆక్షేపించరాదు. నీవు పరుషంగా పలికావు. అయినా నాకు కోపం లేదు''. అది రాముని సమాధానం. 42 శ్లోకాలు.

విన్నాడు వాలి. ఆక్రోశం తగ్గింది. ఏది ధర్మం ఏది అధర్మం తెల్సింది. రెండు చేతులు జోడించాడు. అంటున్నాడు "పురుషోత్తమా! నేను అల్పజ్ఞుణ్ణి. నీవు సర్వజ్ఞుడవు. నీవు చెప్పింది నిజం. ఎంతో కఠినంగా మాట్లాడాను. నీ మనసు నొప్పించాను. నాది తప్పు. చేయరాని పని చేశాను. నన్ను క్షమించు. నీవు ప్రజాహిత రతుడవు. నా దోషాలు చూశావు. ఏ అపరాధికి ఏ శిక్ష విధించాలో నీవు నిర్ణయిస్తావు. నీ నిర్ణయం తిరుగులేనిది''.

**(సశేషం)**

# గణ గణమంటూ గంటానాదం

**– కౌతా నిర్మల**



పూజా సామగ్రిలో గంట తప్పకుండా ఉంటుంది. దేవాలయాల్లో గంటను వేలాడదీస్తారు. గంటానాదం చేసిన పిమ్మటనే భగవంతుని ఆరాధనను ఆరంభిస్తారు. దేవతలకు ఆహ్వానం పలుకుతూ, ఆనందింపచేస్తుంది శ్రావ్యమయిన గంటానాదం. అదే గంటానాదం, రాక్షసులకు భయంకరంగా వినిపించి వారిని దూరంగా తరిమేస్తుంది. పూజాసమయంలో దైవానికి కర్పూర హారతిని ఇచ్చేటప్పుడు, నైవేద్యాన్ని సమర్పించేటప్పుడు గంటను మ్రోగించాలి. దేవాలయానికి వచ్చిన భక్తులు ఆలయంలో వేలాడదీయబడిన గంటను మూడుసార్లు మ్రోగిస్తారు. ఆలయాల్లో పూజ చేసేటప్పుడు మ్రోగించే చిన్న గంటలకు లోహదండం ఉంటుంది. ఆ దండంపైన సుదర్శన చక్రం, ఐదు పడగలతో ఉన్న సర్పం, నంది, గరుత్మంతుడు, హనుమంతుడు లాంటి ఆకృతులతో ఏ ఒకటయినా ఉండాలి. ఆ ఆకృతి లేని గంటను పూజకు ఉపయోగించకూడదు. గంటానాద మహిమలను అగ్నిపురాణం తెలియచేసింది. మరణ సమయంలో సుదర్శన చక్రంతో కూడిన గంటను వాయిస్తే యమభటులు ఆ జీవి చెంతకు చేరలేరని స్కాందపురాణంలో తెలియజేయబడింది.

కొంతమంది గృహాల్లో పూజాగది తలుపులకు రంధ్రాలు చేసి చిన్న చిన్న గంటలను అమరుస్తారు. ఆవులు, ఎద్దులు, ఏనుగుల మెడలో గంటలు కట్టాలని కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రంలో తెలిపాడు. అవి ఇటూ అటూ మేత కోసం సంచరించేటప్పుడు వాటి మెడలోని గంటలు ధ్వని చేయడం వల్ల క్రూరమృగాలు ఆ శబ్దాలకు భయపడి వాటి చెంతకు చేరకుండా తప్పుకుంటాయి. గంటలు రాగి, కంచు, ఇత్తడి, వెండి లోహాలతో తయారు చేయబడతాయి. ఇనుము, స్టీలు గంటలు వాడకూడదు పూజకు.

దైవపూజకే కాక, నిత్యజీవితంలో కూడా గంటలను ఉపయోగిస్తారు. పాఠశాలలో, తరగతులు ఆరంభించటానికి ముందు, పాఠశాల సమయం ముగించే సమయంలో బడిగంట గణగణ మంటూ మ్రోగుతుంది. ఒక పీరియడ్ పూర్తవగానే గంటను కొడతారు. ఎన్ని పీరియడ్లు జరిగితే అన్ని గంటలు కొడతారు. పరీక్షల సమయంలో కూడా, అరగంట కొకసారి గంటను కొడతారు. ఆ గంటను విన్న విద్యార్థినీ విద్యార్థులు తమ కాలపరిమితిని తెలుసుకుంటూ చక చకా పరీక్ష రాసేస్తారు. గృహంలో తలుపులకు కర్టెన్ తో పాటు సన్నని గంటలను గుమ్మానికి కడతారు. గాలి వీచినప్పుడు అవి కదులుతూ శ్రావ్యంగా సన్నని శబ్దం చేస్తాయి. ఆ శబ్దం వినటానికి ఆహ్లాదంగా ఉంటుంది.

నృత్యం చేసే నర్తకీ నర్తకులు కాళ్ళకు శబ్దం చేసే చిన్న గంటలను కట్టుకుంటారు. వాటిని గజ్జెలు అంటారు. నృత్య ప్రదర్శనలోని నృత్య భంగిమలతో పాటు ఆ గజ్జెల శబ్దం కూడా మనస్సును ఆకట్టుకుంటుంది. బాలికలు శబ్దం చేసే మువ్వల పట్టీలను ధరిస్తారు. గంగిరెద్దు మెడలో గంటల పట్టీని కట్టి ఆడిస్తారు. అది కాళ్ళు ముందుకూ, వెనక్కూ కదిలిస్తూ విన్యాసాలు చేస్తుంటే ఆ గంటలు వింత ధ్వని చేస్తాయి. సంక్రాంతికి యాచనకు వచ్చే జంగం దేవరలు ప్రతి ఇంటిముందు గంటను మ్రోగిస్తారు. అంబులెన్స్, ఫైరింజన్ లాంటివి గంటలు మ్రోగిస్తూ రోడ్డుమీద వేగంగా ప్రయాణిస్తాయి. హైదరాబాద్ లోని సాలార్ జంగ్ మ్యూజియం లోని ఒక గడియారంలో ఒక బొమ్మ, ఎన్ని గంటల సమయమైతే కరెక్టుగా ఆ సమయానికి అన్ని గంటలు మ్రోగించటాన్ని ఎందరో ఆసక్తిగా, కుతూహలంగా చూస్తారు. కొన్ని గడియారాలు గంటలు కొడతాయి. ప్రతి అరగంటకు, గంటకు సమయాన్ని సూచిస్తూ గంటలు కొట్టే ఏర్పాటు ఆ గడియారంలో ఉంటుంది.

రోడ్డుమీద తిరుగుతూ వ్యాపారం చేసేవారు గంట మ్రోగిస్తారు. ముఖ్యంగా ఐస్ క్రీమ్ బండివాడు గంటలు మ్రోగిస్తుంటే పిల్లలందరూ ఆ శబ్దాన్ని గుర్తుపట్టి, ఐస్ క్రీమ్ కోసం బండిచుట్టూ చేరుతారు. పూర్వం పల్లెటూళ్ళలో ఎద్దులబండి వాహనంగా ఉండేది. ఎద్దుల మెడలో గంటలపట్టీ, గణగణ మంటూ శబ్దం చేస్తూ ఉండేది. ఈవిధంగా ఆధ్యాత్మికంగా, వ్యాపారపరంగా, సమాజపరంగా గంటానాదానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.





# వాడపల్లి వెంకన్న కోర్కెలు తీర్చేవాడన్న

మందరపు వి.జి.శంకరాచారి

సప్తగిరీశుడు... అర్చామూర్తిగా ఎక్కడ రూపు దాల్చినా... తనను నమ్మినవారిని రక్షిస్తూ... అభయ హస్తంతో అనుగ్రహ వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఈ ప్రహసనంలో శ్రీవేంకటేశుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రాలు ఈ భారతావానిలో చాలా చోట్ల ఉన్నాయి. అటువంటి క్షేత్రాలు భక్తులపాలిట కొంగుబంగారాలు. కోర్కెలు తీర్చే కల్పవృక్షంగా ఆ క్షేత్రం పరిఢవిల్లుతుంది. ఆ విధంగా భక్తుల కోర్కెలు తీర్చే వెంకన్నగా ప్రసిద్ధిపొందిన క్షేత్రమే తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయ మండలంలోని వాడపల్లి గ్రామం. ఇక్కడ స్వామివారు స్వయంభువుగా వెలిశారు. ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి పొందిన ఈ క్షేత్రం గురించి చరిత్రలో చెప్పిన వాస్తవ ఇతిహాసం.

వైకుంఠవాసియైన నారాయణుడి దగ్గరకు సనక సనందనాది మునులు వెళ్ళి భూలోకంలో పాపము విపరీతముగా పెరిగిపోవుచున్నది. పాపపు నీడలో పుణ్యాత్ములు జీవించలేక తీవ్ర మనస్తాపమును చెందుచున్నారు. వారి జీవితాలు దుర్భరముగా మారుచున్నవి. కావున ప్రజల సంరక్షణార్థం భూలోకమున అవతరించి ప్రజలను రక్షించమని వేడుకుంటారు. వారి వేదనను అర్థం చేసుకున్న నారాయణుడు...

"సనక సనందాది మునులారా! మీ వేదన నాకు అర్థమైంది. భూలోకంలో పాపులను శిక్షించటానికి... నా భక్తులను రక్షించుకోవటానికి నేను స్వయంభువునై అవతరిస్తాను. కలియుగంలో అర్చా స్వరూపుడనై భూలోకంలో మానవుల పాపములను కడుగుచున్న గౌతమీ ప్రవాహ మార్గంలో 'నౌకాపురం' అను ప్రదేశంలో వెలయుదును. లక్ష్మీసహితంగా ఒక చందన వృక్ష పేటికలో గౌతమీ ప్రవాహ మార్గంలో నౌకాపురి చేరుకుంటాను. ఈ విషయాన్ని నారదుని ద్వారా ప్రజలకు తెలియజేయండి" అని చెబుతాడు.

నారాయణుడు చెప్పిన మాటలు విని బహు సంతసించినారు మునులు. నారాయణ మంత్రోపాసకుడు అయిన నారదుడు ఈ విషయాన్ని భూలోకంలో వ్యాప్తి చేసినాడు.

నారాయణుడు చెప్పిన కొంత కాలమునకు గౌతమీ

ప్రవాహంలో కొట్టుకుని వస్తున్న చందన పేటికను గమనించిన ప్రజలు ఆ పేటికను తీసుకుని రావడానికి ప్రయత్నించగా అది విఫలమై వారికి కనిపించకుండా పోతుంది.

అదేరోజు నారాయణుడు ఆ నౌకాపురిలో నివసిస్తున్న ఒక సద్బ్రాహ్మణునికి స్వప్నంలో కనిపించి "ఓ విప్రోత్తమా! నేను దారుమూర్తినై ఒక చందన పేటికలో గౌతమీనది గర్భంలో ఉన్నాను. ఆ పేటిక మీద కృష్ణగరుడ పక్షి వాలి ఉంటుంది. ఈ నౌకాపుర ప్రజలందరూ శుచిగా నదిలో స్నానమాచరించి మంగళవాయిద్యాలతో నౌకలో నదీమధ్య ప్రదేశమునకు చేరుకున్న వెంటనే అక్కడ కృష్ణగరుడ పక్షి వాలిన చందనపేటిక తేలుతూ కనిపిస్తుంది. అందులో నేను శంఖ చక్ర గదాయుధములతో వేంకటేశ్వరమూర్తిగా దర్శనమిస్తాను. ఆ దారుమూర్తిని తీసుకుని వచ్చి ఈ నౌకాపురిలో ప్రతిష్ఠాపన చేసి నన్ను పూజించినచో నేను వారి కోర్కెలు తీరుస్తాను. ఏడు శనివారములు క్రమం తప్పకుండా దర్శించిన వారి కోర్కెలు సిద్ధిస్తాయి. భవిష్యత్తులో ఈ నౌకాపురి వాడపల్లి అనే దివ్యమైన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందుతుంది" అని చెబుతాడు.

వృద్ధ బ్రాహ్మణుడు శ్రీమన్నారాయణుడే వేంకటేశ్వర స్వామిగా దర్శనమిచ్చినందుకు బహు సంతసించి ఈ విషయాన్ని ఊరిలో గల పెద్దలందరికీ తెలియజేస్తాడు.

వృద్ధ బ్రాహ్మణుడు చెప్పిన మాటలు నమ్మి ఒక శుభముహూర్తంలో ప్రజలు గౌతమీనదిలో శుచిగా స్నానమాచరించి మంగళవాయిద్యములతో గౌతమీ నదీ గర్భమునకు చేరుకునేసరికి అక్కడ స్వామివారు చెప్పినట్లు చందన పేటిక తేలుతూ దానిమీద కృష్ణ గరుడ పక్షి వాలి ఉండడం గమనిస్తారు. అది గమనించిన ప్రజలు జయ జయ ధ్వానాలతో ఆ పెట్టెను నౌకాపురికి తీసుకొని వచ్చి నేర్పరియైన శిల్పితో చందనపేటిక మూతను తెరిపిస్తారు. ఆ పేటిక తెరవగానే...

కోటి సూర్యకాంతులతో వెలిగిపోతున్న నారాయణ స్వరూపమైన శ్రీవేంకటేశ్వరుడు శంఖ చక్ర గదాయుధాలతో దర్శనమిస్తాడు. ఆ మూర్తిని ఆగమశాస్త్రం ప్రకారం ఒక చిన్న గుడిలో ప్రతిష్ఠించి స్వామివారిని పూజించడం ప్రారంభిస్తారు.

ఈ గుడి ప్రతిష్ఠాపనకు అప్పటి పెద్దాపురం సంస్థానాధీశులైన వత్సవాయి తిమ్మ గజపతి రాజు గారు సహకరించారు. అంతేకాదు... ఈ గుడి ఆదాయ నిమిత్తం కొన్ని భూములను... స్థిరాస్థులను సమర్పించినారు. ఇది నది పరీవాహక ప్రాంతంలో ఉండుట వలన నదీగర్భంలో కలిసిపోగా ప్రస్తుత ఆలయాన్ని పినపోతు గజేంద్రుడు అనే అగ్నికుల క్షత్రియుడు నిర్మించినాడు.

స్వయంభువుగా వెలసిన ఈ అర్చామూర్తి దారుమూర్తి (చెక్కతో రూపొందించబడినది). ఈ క్షేత్రాన్ని భక్తితో ఏడు శనివారాలు దర్శించుకుని అక్కడ ఉన్న డిబ్బీలో ప్రదక్షిణకి రూపాయి చొప్పున ఏడు ప్రదక్షిణలు చేసి ఏడు రూపాయలు సమర్పించుకుని క్రమం తప్పకుండా ఏడు శనివారాలు దర్శించి తమ కోర్కెలు తీర్చమని భక్తితో ప్రార్థన చేస్తే స్వామివారు తప్పకుండా వారి వారి కోర్కెలు తీరుస్తారు. ఎంతోమంది ఈ క్షేత్రాన్ని దర్శించి తమ యొక్క కోర్కెలను తీర్చుకున్నవారే. అందుకే వాడపల్లి వెంకన్నను కోర్కెలు తీర్చే వెంకన్నగా కొలుచుకుని ఆరాధిస్తారు. వాడపల్లి వెంకన్న కళ్యాణోత్సవాలు సర్వ ఏకాదశి రోజు నుండి 5 రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ప్రజలు అశేషంగా తరలి వస్తారు.

★★★

# హరినామస్మరణం ఎంతో గొప్పది



హరి హరతి పాపాని దుష్ట చిత్తైరపి స్మృత అనిచ్ఛయాపి సంస్పృష్టో దహత్యేవా హి పవకః

హరి నామ స్మరణ చేయువారు ఎంతటి పాపాత్ములైనా వారి పాపాలు నమసిపోయి తేటతెల్లమవుతారు. ఎలా అంటే నిప్పును తెలియక ముట్టుకున్నా కాలుతుంది. అలాగే హరినామ స్మరణ తెలియక చేసినా (పలికినా) ప్రోగు చేసుకున్న పాపరాశి పూర్తిగా దగ్ధమవుతుంది.

ఎంతటి పవిత్రత అంటే... మాతృగర్భంలో నుండి బయటపడిన నవజాత శిశువు ఎలా అయితే కర్మబంధనం లేకుండా ఉంటాడో... అలా పాపం అనేది నీరుగారిపోతుంది.

హరినామ స్మరణ తెలియక చేస్తేనే ఇలా ఉంటే... భక్తిభావంతో చేస్తే... ఎలా ఉంటుందో... మీరే గ్రహించండి.

**శంఖ చక్ర వైకుంఠ పాణి జై శ్రీమన్నారాయణ**

ధారావాహికం



శ్రీ పద్మపురాణాంతర్గత

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

ఐదవ అధ్యాయం

## లక్ష్మీదేవి ఆవిర్భావ వృత్తాంతం

### 1 .పాతాళ లోకంలో లక్ష్మీదేవి :

దేవలుడు దేవదర్శనుని మరల ''మహాత్మా! పద్మ సరస్సు యొక్క మాహాత్మ్యమును, దాని పుట్టుకను గురించి వినవలెనని నాకు కుతూహలముగా నున్నది. కావున నాయందు దయయుంచి ఆ విషయాన్నంతా వివరంగా చెప్పండి'' అని అడిగాడు.

అప్పుడు దేవదర్శనుడు దేవలా! ధర్మనాయకా! పద్మసరోవర ఆవిర్భావాన్ని గురించి చెబుతాను విను. పూర్వం లక్ష్మీదేవి భృగుమహర్షికి 'ఖ్యాతి' అను భార్యయందు జన్మించింది. వైకుంఠంలో నివసించే శ్రీమహావిష్ణువును భృగుమహర్షి కాలితో తన్నగా, అతని పాదధూళి సోకి లక్ష్మీదేవి కోపించి పాతాళంలోని కపిలుని ఆలయానికి వెళ్ళింది. పాతాళ మూలంలో ఉన్న ఆ కపిలాలయంలో కపిల మహర్షి భక్తితో ఆమెను పూజించాడు. లక్ష్మీదేవి కపిలునిచే ఆరాధింపబడుతూ చాలాకాలం పాతాళంలోనే ఉన్నది.

### 2. కొల్హాపురంలో మహాలక్ష్మి :

ఇలా ఉండగా శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి ఎడబాటును సహించలేక భృగుమహర్షిని ఆశ్వాసపరచి పంపించి, వైకుంఠంలో నీలాదేవిని ఉంచి భూదేవితో కూడా భూలోకానికి వచ్చాడు. ఆ పురుషోత్తముడు, జనార్దనుడు నానా రూపాలు ధరిస్తూ శంఖ చక్ర గదాద్యాయుధములను ధరించి శ్రీదేవిని అన్వేషిస్తూ, యాబది ఆరు దేశములలో వెదకుచు చివరకు లక్ష్మీదేవికి అధిష్ఠానమైన శ్రేష్ఠమైన కొల్హాపురానికి చేరాడు.

అక్కడ పూర్వం అగస్త్య మహర్షి లక్ష్మీదేవి అర్చామూర్తిని దివ్యాలయంలో ప్రతిష్ఠించి ఆరాధించాడు. ఆవిధంగా మహర్షులచే ఆరాధించబడుతున్న శ్రీమహాలక్ష్మిని చూచి శ్రీమహావిష్ణువు తాను కూడా ఆమెను ఆరాధిస్తూ ఆ దేవదేవుడు పది సంవత్సరాలు అక్కడే ఉన్నాడు.

### 3.అశరీరవాణి సందేశం :

ఇలా ఉండగా అశరీరవాణి విష్ణువుతో ''శ్రీమహావిష్ణూ! భగవానుడా! లక్ష్మీదర్శన లాలసుడా! ప్రసన్నుడవు కమ్ము. ఇక్కడ నుండి దక్షిణ దిక్కుకు వెళ్ళి కృష్ణవేణీ నదికి దక్షిణంగా ఇరవైరెండు యోజనాల దూరంలో సువర్ణముఖరీ నది ఉన్నది. దానికి ఉత్తరం వైపున మునీశ్వరులు తపస్సు చేస్తూ ఉంటారు. నీవు ఆ నదీ తీరానికి వెళ్ళి అక్కడ నీ కుంతాయుధముతో (బల్లెముతో) త్రవ్వి

ఒక చిన్న సరోవరాన్ని నిర్మించు. అక్కడ తపస్సు చెయ్యి. దేవలోకం నుండి స్వర్ణ కమలాలను తెప్పించి వాటిని ఆ సరస్సులో నాటు. ఆ సరస్సు ఒడ్డున అనేక జాతుల పుష్ప మొక్కలను నాటి, ఉద్యాన వనాన్ని నిర్మించు.

పద్మవల్లభా! ఆ పద్మారామం లోని పద్మ సరస్సులో ఏకాక్షర మంత్రాన్ని గాని, సహస్రాక్షర మంత్రాన్ని గాని జపిస్తూ, ఆ సరస్సు నందలి స్వర్ణ కమలములతో లక్ష్మీదేవిని ఆరాధిస్తూ పన్నెండు సంవత్సరాలు తపస్సు చెయ్యి. అప్పుడు లక్ష్మీదేవి ప్రసన్నురాలై సాక్షాత్కరిస్తుంది. పద్మలోచన అయిన ఆ లక్ష్మీదేవి స్వర్ణ కమలంలో, బంగారు పద్మాకృతిలో, పదునారు సంవత్సరములకు లోపు వయస్సు కలదై నీకు ప్రత్యక్షమవుతుంది. నీవు వెంటనే ఇక్కడనుండి స్వర్ణముఖరీ తీరమునకు వెళ్ళవలసింది'' అని చెప్పింది.

## 4.పద్మ సరోవర నిర్మాణం :

శ్రీమహావిష్ణువు అశరీరవాణి చెప్పిన మృదువైన పలుకులు విని గరుత్మంతుని అధిరోహించి సువర్ణముఖరీ నదీ తీరానికి వెళ్ళాడు. రాక్షస సంహారి అయిన భగవానుడు అక్కడ అనేకమంది దేవతలను, పర్వతాలను, వనాలను చూస్తూ వరాహస్వామి నెలకొన్న అంజనాద్రిని దర్శించాడు. అక్కడ స్వామిపుష్కరిణిని చూచి, భూవరాహ స్వామి సన్నిధిలో గరుడ వాహనము దిగి స్వామిపుష్కరిణిలో స్నానం చేశాడు. అక్కడ వైఖానస మహర్షులు ఆయనకు ఆతిథ్యమిచ్చి పూజించారు. రాజు రూపంలో ఉన్న ఆ పురుషోత్తముని వారు గుర్తించలేదు. భగవానుడు ఆ రాత్రి అక్కడ గడిపి, మరునాడు ఉదయమే లేచి, ఆ మునుల వద్ద సెలవు తీసుకొని గుఱ్ఱం రూపం ధరించిన గరుత్మంతుని అధిరోహించి, గదను, బల్లెమును ధరించి కొండకు దక్షిణముగా వెళుతూ బంగారు పద్మాలతో నిండిన సువర్ణముఖరీ నదిని చూచి విస్మితుడై గరుడుని నుండి దిగాడు.

శ్రీహరి అక్కడ సమతలంగా ఉండే ప్రదేశంలో బల్లెంతో భూమిని త్రవ్వాడు. గోకర్ణాకారంలో ఒక సరోవరాన్ని నిర్మించాడు. వాయుదేవుని పిలిచి 'నీవు స్వర్గలోకము నుండి ఇంద్రుని అనుమతితో స్వర్ణకమలములను తీసుకొని రమ్ము. వాటిని నేను లక్ష్మీదేవి పూజ కొరకై ఈ సరస్సులో నాటిస్తాను' అనగా విని వాయుదేవుడు భగవానునితో 'ఈ సువర్ణముఖరి నదిలో బంగారు కమలాలు ఉన్నాయి కదా! స్వర్గలోకం నుండి తీసుకురావడమెందుకు?' అని అడిగాడు. అప్పుడు భగవానుడు 'ఓ వాయుదేవా! పూర్వమశరీరవాణి కొల్హాపురంలో 'నీవు దేవలోకం నుండి బంగారు కమలాలు తెచ్చి వాటితో లక్ష్మీదేవిని ఆరాధించు' అని నాకు చెప్పింది. కావున నీవు దేవలోకం నుండి దేవేంద్రుని అనుమతి పొంది శీఘ్రంగా స్వర్ణ కమలాలను తీసుకొనిరా' అని చెప్పాడు. అంతట వాయుదేవుడు దేవలోకానికి



వెళ్ళి దేవేంద్రుని అనుమతి పొంది బంగారు కమలాలను తీసుకొని వచ్చాడు. మాధవుడు వాటిని ఆ సరోవరంలో నాటి ఆ సరస్సుకు తూర్పువైపున సూర్యనారాయణుని ప్రతిష్ఠించాడు. లక్ష్మీదేవిని పొందుటకై ఆయన సూర్యుని అర్చించాడు.

## 5.లక్ష్మికై విష్ణువు తపస్సు :

ఆ దేవదేవుడు ఆద్యంతాలలో ప్రణవాన్ని చేర్చి శక్తిబీజం, శ్రీ బీజం, కామ బీజాలతో కూడిన మూడక్షరాల మహామంత్రాన్ని ప్రతిరోజు మూడువేల సార్లు జపిస్తూ మూడు వందలు తర్పణం చేస్తూ వేయి స్వర్ణ కమలాలతో లక్ష్మీదేవిని ఆరాధిస్తూ ఉషఃకాలంలో పద్మసరస్సులో తర్పణం చేస్తూ పాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటూ ఆహార నియమంతో లక్ష్మీదేవిని ఆరాధిస్తూ ఆ పద్మ సరోవర తీరంలో సూర్యుని సన్నిధిలో పశ్చిమాభిముఖుడై అనన్య మనస్కుడై పన్నెండు సంవత్సరాలు దీక్షతో తపస్సు చేయసాగాడు.

ఈవిధంగా శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి కొరకు తపస్సు చేస్తుండగా విష్ణుమాయా మోహితులైన ఇంద్రాది దేవతలు తల్లడిల్లి చక్రవర్తి వేషంలో ఉన్న విష్ణువు తపస్సును చెడగొట్టటానికి ఉద్యమించారు. వారంతా అప్సరసలను పిలిచి 'ఓ అప్సరసలారా! మీరు భూలోకానపికి వెళ్ళండి. అక్కడ అంజనాద్రి సమీపంలో మునులచే సేవించబడుతున్న సువర్ణముఖరి ఉంది. దానికి

ఉత్తర తీరంలో అగస్త్య మహర్షి ఆశ్రమం ఉంది. ఆ ఆశ్రమానికి తూర్పువైపున ఒక రాజు తపస్సు చేస్తున్నాడు. స్వర్ణకమలాలు గల పద్మ సరోవర తీరంలో సూర్యుని ఎదురుగా త్రిలోకాధిపత్యాన్ని కోరుతూ మాయావియైన చతుర్భుజుడు తపస్సు చేస్తున్నాడు. మీరు వెళ్ళి నృత్య గీతాదులతోను, శృంగార చేష్టలతోను అతనిని క్షోభింపచేసి తపస్సుకు విఘ్నం కలిగించండి' అని ఆదేశించాడు.

దేవతలిలా ఆజ్ఞాపించగా అప్సరాంగనలు వసంతుడు, మన్మథులతో పద్మసరోవరం వద్దకు వచ్చారు. వసంతుడు క్రిందకు దిగి ఆ వనంలో బాగా విజృంభించాడు. మామిడి, మోదుగ, మందార, కర్ణికార వృక్షాలు పూలతోను, నవ పల్లవాలతోను శోభాయమానంగా ఉన్నాయి. కోకిలలు, తుమ్మెదలు, అనేక పక్షులు మధురంగా కూస్తున్నాయి. సుందరమైన వనంలో తపస్సు చేస్తున్న చతుర్భుజుడైన ఆ సుందర పురుషుణ్ణి చూచి ఆ అప్సరసలందరూ మోహితులై మధురంగా గానం చేస్తూ ఆయన ముందర నాట్యం చేశారు. ఆ పూదోట అంతా మలయమారుతం కలువపూల పరిమళంతో చల్లగా వీస్తూ అక్కడ వారికి మదన తాపాన్ని కలిగిస్తున్నది.

ఇంతలో శ్రీమహావిష్ణువు కొంచెం కళ్ళు తెరిచి వారిని మోహింప చేయుటకై మరొక మాయను ప్రయోగించాడు. ఆ విష్ణుమాయకు వశులై వారంతా సిగ్గుతో తలలు వంచుకున్నారు. ఆయన మాత్రం నిర్వికారుడై నిరంజనుడై మునుపటిలాగా సరస్సులో పూలు కోస్తూ యథావిధిగా లక్ష్మీదేవిని ఆరాధిస్తున్నాడు. ఆ నిర్వికారుడైన పురుషోత్తముని భంగపరచుటకు అశక్తులై ఆ అప్సరాంగనలు విష్ణుమాయచే మోహితులై స్వర్గలోకానికి తిరిగి వెళ్ళిపోయారు. అప్పుడు విష్ణు భగవానుడు ఆ మాయాదేవికి "నీవు లోకపూజ్యురాలవవుతావు. నీకు చెరకు విల్లు అవుతుంది. పుష్పబాణాలు ధరిస్తావు. చక్రాన్ని, పద్మాన్ని ధరించి, ఆకులు, పాలతో పూజింపబడుతూ మానవులకు చతుర్విధ పురుషార్థాలను ప్రసాదిస్తావు" అని వరమిచ్చి లక్ష్మీదేవిని ఆరాధిస్తూ ఉన్నాడు. ఇలా తపస్సు చేస్తుండగా పన్నెండు సంవత్సరాలు గడిచాయి.

## 6.పద్మ సరస్సులో శ్రీదేవి :

అటు పిమ్మట పదమూడవ సంవత్సరంలో, కార్తీక మాసంలో, శుక్ల పక్షంలో, పంచమీ శుక్రవారం నాడు మంత్ర ముహూర్తంలో ఉత్తరాషాఢ నక్షత్రంలో సుఖంగా వాయువు వీస్తుండగా ముల్లోకాలలోని వారంతా ప్రసన్నంగా ఉండగా, సూర్యుడు నిర్మల తేజస్సుతో ప్రకాశిస్తుండగా అందరి మనస్సులు ప్రసన్నంగా ఉండగా ఆ పద్మసరోవరం మధ్యనుండి గొప్ప తేజస్సు ఆవిర్భవించింది.

ఆ తేజోరాశి వేయి సూర్యుల కాంతితో, బంగారు వన్నెతో వెలుగొందుతున్నది. దాని మధ్యలో బంగారు పద్మాలతో నిర్మించిన గొప్ప రథం ఆవిర్భవించింది. దానికి నాలుగు వైపులా నాలుగు మదగజాలు పూన్చబడి ఉన్నాయి. దాని మధ్యలో లక్ష్మీదేవి సహస్ర దళ శోభితమైన సువర్ణ పద్మంలో కర్ణికా మధ్యంలో పద్మాసనంలో కూర్చుని, చేతిలో పద్మాన్ని ధరించి పద్మం వంటి నేత్రములు కలదై, ఎర్రని పద్మముల వంటి పదద్వయం కలదై, బంగారు పద్మమొగ్గలను పోలిన స్తనద్వయముచే కొంచెము వంగినదై, వికసించిన తామరపువ్వులోని పుప్పొడి వలె పరిమళించే ఉచ్ఛ్వాస నిశ్వాస ములు గల ముఖపద్మము గలదై, దొండపండు లాంటి అధరముపై చిరునవ్వుతో సుధారసాన్ని చిందిస్తూ, కాంతి-తేజస్సులకు నిలయమైన, విశాలమైన నేత్రద్వయము కలదై, సర్వరత్న ఖచితమైన స్వర్ణాభరణాలు ధరించి తామరపూవు కర్ణికను, కలువపువ్వును చెవికమ్మలుగా ధరించి, ముత్యాల హారాలను ముంగురులకు అలంకరించుకొని, ముత్యాల కిరీటాన్ని ధరించి, మురుగులు, కడియాలు, కంకణాలు ధరించి, మెరుపు తీగెల వలె ప్రకాశిస్తున్న చిత్ర విచిత్రమైన చీరను ధరించి, చిరునవ్వులు చిందిస్తూ మనోహర రూపము కలదై, మాధవుని సాదరంగా వీక్షించి ఆ పద్మాలయ సుగంధ ద్రవ్యాలు పూయబడిన కలువపూదండను చేతబూని, తులసి, దూర్వా, ఇప్ప, పద్మ, కలువ మాలలను ధరించి పద్మరథంపై ఆసీనురాలై చతుర్భుజుడైన దేవదేవుని దర్శించింది.

## 7.దేవతల పుష్పవర్షం :

అప్పుడు దేవతాగణాలన్నీ దేవ దుందుభులు మ్రోగించాయి. శంఖాలు పూరించారు. వీణలు వాయించారు. గంధర్వులు షడ్జాది స్వరాలతో తాళయుక్తంగా గానం చేశారు. వాటిని వింటూ దానికి తగ్గట్టుగా అప్సరసలు ఆనందపరవశలై నాట్యం చేశారు. ఆ వాద్య ఘోషతో జగత్తంతా నిండిపోయింది. అది విని లక్ష్మీదేవి ప్రత్యక్షమైందని తెలుసుకొని బ్రహ్మదేవుడు హంసారూఢుడై ముని బృందంతో అక్కడికి వచ్చాడు. కైలాసం నుండి పార్వతీ పరమేశ్వరులు ప్రమథాది గణాలతో విచ్చేశారు. ఆ శంఖధ్వనిని విని దేవేంద్రుడు శచీదేవితోను, దిక్పాలురతోను అక్కడకు వచ్చాడు. వసిష్ఠాది మహర్షులు, సనకాది యోగులు ఆ పద్మసరోవర తీరంలోని పద్మనాభుని ఆశ్రమానికి విచ్చేశారు. ఆ పద్మరథంలో ఉన్న లక్ష్మీదేవిని, సర్వలోకేశ్వరిని దర్శించి విద్యాధరులంతా సంతోషంతో పుష్పవృష్టిని కురిపించారు.

## 8.లక్ష్మీదేవి భగవంతుని వరించుట :

దేవతలందరూ ఆశ్చర్యచకితులై ఆనందంతో ఆమెనే చూస్తూ నిలబడి పోయారు. దేవతలు, దానవులు, పాతాళవాసులైన నాగులు మదన మోహితులై ఆమెను అభిలాషతో వీక్షిస్తున్నారు. ఈమె 'నన్నే వరించాలని' వారంతా తలపోస్తున్నారు. వారంతా ఆ విధంగా అనుకొంటుండగానే లక్ష్మీదేవి చిరునవ్వుతో లేచివచ్చి వెంటనే తన చేతిలోని కలువపూల దండను విష్ణుభగవానుని మెడలో వేసి, ఆయనను ఆలింగనం చేసుకొని, నలువైపులా



చూచింది. విష్ణువు వక్షస్థలంలో విరాజిల్లుతున్న ఆ లక్ష్మీదేవి యొక్క కటాక్ష వీక్షణాల వలన దేవతలు, దానవులు, యోగులు మొదలగు వారంతా తమ తమ అధికారాలను పొందారు. ఆ లక్ష్మీపతి లక్ష్మీదేవితో కూడి కృతార్థుడైనాడు.

## 9.పద్మసరస్సుకు వరాలు :

ఆపైన శ్రీహరి పద్మసరోవరాన్ని చూచి 'ఓ సరోవరమా! నీ తీరంలో సూర్యుని అనుగ్రహంతో నేను తపస్సు చేసి, లక్ష్మీదేవిని శాశ్వతంగా పొందాను. కావున ఈరోజు నుండి నీకు 'పద్మసరోవరం' అనేపేరు ప్రసిద్ధమవుతుంది. నీవు లక్ష్మీదేవికి ప్రీతికరమైన దానవు. నీనుండి లక్ష్మీదేవి ఉద్భవించింది కాబట్టి నీ కీర్తి ముల్లోకాలలో ప్రసిద్ధమవుతుంది' అని ఆ రమాపతి పద్మసరస్సుకు వరమిచ్చి గరుడుని అధిరోహించి శేషాద్రికి వెళ్ళి, స్వామిపుష్కరిణీ తీరంలో లక్ష్మీదేవితో ఆ రమణీయ ప్రదేశంలో ఏకాంతంగా రమిస్తున్నాడు. ఓ దేవలా! పవిత్రమైన పద్మసరోవర ఆవిర్భావ గాథను నేను నీకు చెప్పాను అని దేవదర్శనుడు అనగా దేవలుడు 'దేవదర్శనా మహానుభావా! నాకీ పవిత్రమైన చరిత్రను తెలియజేసినందుకు మీకెంతో కృతజ్ఞుడను' అన్నాడు.

★★★

# గోవిందా! గోవింద!

**తిరుమల వేంకటేశ్వరుని దర్శించే యాత్రికులు "గోవిందా! గోవిందా!" అని అంటారెందుకు?**

సమాధానం : నైమిశారణ్య వాసులగు కొందరు మహర్షులు శుక మహర్షి ద్వారా శ్రీవేంకటాచల మహిమను విని, తమ తిరుమల యాత్రలో ''గోవిందా!'' అనే నామాన్నే మాటిమాటికీ ఎలుగెత్తి పలికారని శ్రీ వరాహపురాణంలో ఉంది.

గోవింద పదం వరాహస్వామిని, శ్రీకృష్ణుని, వేంకటేశ్వరుని తెలుపుతుంది. హిరణ్యాక్షునిచే పాతాళంలో ముంచి వేయబడిన భూమిని ఉద్ధరించినది వరాహావతారంలోనే కదా! అందుకే ఆయన ''గాం విందతి గోవిందః'' భూమిని పొందినవాడు గోవిందుడయ్యాడు.

మరల గోవర్ధన పర్వతమునెత్తి గోపాలకులను, గోవులను కాపాడినపుడు ఇంద్రుడు ''గోవింద పట్టాభిషేకం'' చేశాడు కనుక శ్రీకృష్ణుడు గోవిందుడయ్యాడు.

తర్వాత కలియుగ వైకుంఠమైన తిరుమలలో వేంచేసిన శ్రీనివాసుడు కూడా శ్రీకృష్ణుడే అని భగవద్గీతలోని చరమశ్లోకం ''సర్వధర్మాన్ పరిత్యజ్య'' అర్థమును, తన దివ్యహస్తములలోని ముద్రలతో ప్రకాశింపచేయుచున్నాడని పెద్దలు చెబుతున్నారు. అందువల్ల గోవిందా అని పిలిచే భక్తుల ప్రయాణంలో అలసటను, ఆర్తిని శ్రీవేంకటేశ్వరుడు తొలగిస్తున్నాడు.

''గోవిందా!'' అని పిలిస్తే చాలు శ్రీవరాహస్వామి, శ్రీకృష్ణుడు, శ్రీనివాసుడు ముగ్గురూ ఒకేసారి పలికి కటాక్షాన్ని



భక్తులపై కురిపిస్తున్నారు.

''గోవింద నామం మరువాం మరువాం'' అని భక్తులనడానికి కారణం ఇదే. ప్రహ్లాదుడు, ద్రౌపది, గోదాదేవి మున్నగువారు తమ ఆర్తిని ''గోవింద'' నామ స్మరణతోనే వెలిబుచ్చి రక్షణ పొందారు.

**గోవిందా! గోవింద! సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## వేంకటాద్రి లేదా వేంకటాచలం

‘వేంకట’ అనే పదబంధంలో ‘వేం’ అనే పదానికి ‘పాపము’, ‘కట’ అనే పదానికి ‘తొలగించేది’ అనే అర్థాలు ఉన్నాయి. వెరసి ‘వేంకట’ అంటే ‘పాపాలు తొలగించెడిది’ అని అర్థం. అనాదిగా కోట్లమంది శాపగ్రస్తుల, శరణార్థుల పాపాలను తొలగిస్తూ ఉన్న కారణంగా ఈ పర్వతం ‘వేంకటాద్రి’గా వర్ధిల్లుతోంది. పురాణాలలో ఈ పర్వతం భక్తుల పాపాలను తొలగించిన ఉదంతాలు కొల్లలుగా కానవస్తాయి. వేంకటాద్రి శిఖరరాజంపై కొలువై ఉన్న స్వామిపుష్కరిణి మహిమతో పాపాలు తొలగిన అనేక పౌరాణిక గాథలు కూడా మనం ఇంతకుముందే తెలుసుకున్నాం. అయితే ఈ సందర్భంలో అనేక పురాణాల్లో ఉటంకించబడిన ‘మాధవుడు’ అనే బ్రాహ్మణుని వృత్తాంతాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

పూర్వం తిరుపతి పట్టణానికి సమీపంగా ఉన్న ‘శ్రీకాళహస్తి’ అనబడే సుప్రసిద్ధ శైవక్షేత్రంలో ‘పురందరుడ’నే విష్ణుభక్తుడు, సద్బ్రాహ్మణుడు తన భార్య మరియు మాధవుడనే యుక్తవయస్కుడైన పుత్రునితో నివసించేవాడు. మాధవుడు కూడా తండ్రి వలెనే వేదవేదాంగాలు అభ్యసించి నిత్యానుష్ఠానాలు క్రమం తప్పకుండా అత్యంత నిష్ఠతో ఆచరిస్తుండేవాడు. కొంతకాలానికి పాండ్యదేశానికి చెందిన చిత్రలేఖ అనబడే సుందరమైన, సౌశీల్యవతియైన యువతితో మాధవుడి వివాహం జరిగింది. కొన్నాళ్ళు శాస్త్ర సమ్మతమైన గృహస్థ జీవితం గడిపిన తరువాత విధివశాత్తూ మాధవునికి శాస్త్రసమ్మతం కాని కోరిక కలిగింది. ఒకనాడు మాధవుడు ఉదయపు సంధ్య అనంతరం తన భార్యతో సంగమించాలన్న కోరికను వెలిబుచ్చాడు. సుగుణవతియైన భార్య అకాల విహారం శాస్త్రాలలో సంపూర్ణంగా నిషేధించబడిందని, అటువంటి విపరీత సంగమం వల్ల జన్మించే సంతానం కుటుంబానికి, సమాజానికి అరిష్టం కలుగజేస్తుందని నచ్చచెబుతుంది. సర్వవిద్యా పారంగతుడైన మాధవునికి ధర్మా ధర్మాలు క్షుణ్ణంగా అవగతమే. కానీ ప్రారబ్ధ కర్మ వల్ల మాధవుడు భార్య హితవును పెడచెవిన పెట్టి ఆమెను నిర్బంధంగా అసందర్భోచితమైన కార్యానికి ఒప్పించి, దర్భలు సేకరించే నెపంతో భార్యతో కలిసి అరణ్యంలోకి వెళ్ళాడు. అక్కడ వారిరువురూ సమాగమానికి సన్నద్ధులవుతారు. దురదృష్టవశాత్తు అదే సమయంలో మాధవునికి కుంతల అనే శూద్రజాతి స్త్రీ కనబడుతుంది. ఆమె మరింత సౌందర్యంతో ప్రకాశించడంతో కామోద్రిక్తుడైన మాధవుడు యుక్తాయుక్త విచక్షణను విస్మరించి, భార్యను పంపివేసి ఆ అటవిక స్త్రీ పొందు కోరుతాడు.

అక్షరజ్ఞానం ఏమాత్రం లేని ఆ స్త్రీ కూడా, తప్పొప్పులను తెలిసి



ఉండటం చేత మాధవునికి అనేక రకాలుగా నచ్చచెబుతుంది. పరస్త్రీ వ్యామోహం వల్ల మాధవుడి బ్రాహ్మణ్యం మంట గలుస్తుందని, ఆ అకృత్యం వల్ల కలిగే పాపం మాధవుని కుటుంబాన్ని పట్టి పీడిస్తుందని హితవు పలుకుతుంది. విధి బలీయమవ్వడంతో మాధవుడు ఆ స్త్రీ పలుకులను కూడా పెడచెవిన పెట్టి ఆమెను బలాత్కరించబోతాడు. వివశురాలైన ఆ స్త్రీ సూచన మేరకు శిఖ, యజ్ఞోపవీతాలను తొలగించుకోవడానికి, జీవితాంతం ఆమెతో కలిసి జీవితం గడపటానికి, ఆమెతో కలిసి మద్య మాంసాదులను సేవించటానికి సైతం సిద్ధపడి ఆమెతో సంభోగిస్తాడు.

ఆమెకిచ్చిన మాట ప్రకారం ఆమెతో కొంతకాలం ఆటవిక జీవితం గడిపిన తరువాత కుంతలకు అకాల మరణం సంప్రాప్తిస్తుంది. ఆమెను అమితంగా ప్రేమించిన మాధవుడు కుంతల మరణాన్ని జీర్ణించుకోలేక, జీవితంపై విరక్తి చెంది, కొండలు, కోనల్లో గమ్యం లేకుండా సంచరిస్తుంటాడు.

అలా చాలకాలం గడిచిన తరువాత అతని పూర్వజన్మ ప్రారబ్ద కర్మ తీరిపోవడంతో తీర్థయాత్రకు బయల్వెడలిన ఒక రాజపరివారం మాధవునికి తారసపడుతుంది. మాధవుడు ఆ బృందంతో సహా వేంకటాద్రి పాదభాగంలో ఉన్న 'కపిలతీర్థం'లో స్నానమాడి, నిర్ధనుడవ్వడం వలన నల్లమట్టితోనే పిండాలను చేసి పూర్వీకులకు నిష్ఠతో పిండప్రదానం చేసి వేంకటాద్రిని అధిరోహించడం ప్రారంభిస్తాడు. ఆ రోజుల్లో అంటే మట్లకుమార అనంతరాజు అలిపిరి నుండి గాలిగోపురం వరకు గల మెట్లమార్గాన్ని నిర్మించకముందు కొండ ఎక్కే మార్గం కపిలతీర్థం నుండే ప్రారంభమయ్యేది. శేషాచలేశ్వరుని దర్శనార్థం పరమ పావనమైన వేంకటాద్రి పర్వతాన్ని స్పృశించగానే మాధవునికి వమనం జరిగింది. ఆ వాంతి ద్వారా శరీరంలో ఉన్న మలినాలతో పాటుగా అతనిలో గూడుకట్టుకుని ఉన్న సమస్త పాపాలు బహిర్గతములై, మాధవుడు కడిగిన ముత్యములా ప్రకాశించాడు. ఈ అద్భుతాన్ని అంబరం నుండి వీక్షిస్తున్న దేవతలందరూ పుష్పవృష్టి కురిపించారు.

తన తండ్రి గారికి నెలవైన వేంకటాచల స్పర్శామాత్రం చేతనే మాధవుడు పునీతుడైన పరమాద్భుత దృశ్యాన్ని పరికించిన బ్రహ్మదేవుడు అతనికి ప్రత్యక్షమై, భవిష్యత్తులో మాధవుడే సుదర్శనుని కొడుకు ఆకాశరాజుగా జన్మించి, శ్రీమహాలక్ష్మికి మరో రూపమైన పద్మావతికి తండ్రియై, సాక్షాత్తు శ్రీనివాసుణ్ణి అల్లుడిగా పొందుతాడని వరమిస్తాడు. అలా తన పాపాలను పటాపంచలు చేసుకొని, బ్రహ్మదేవుని వరంతో తన జన్మ సార్థకమయిన తరువాత మాధవుడు వేంకటాచలానికి వెళ్ళి స్వామిపుష్కరిణిలో స్నానమాడి, వరాహస్వామిని, తదనంతరం శ్రీనివాసుణ్ణి దర్శించుకుని, మరుజన్మకై ఎదురు చూస్తూ భౌతిక దేహాన్ని త్యజిస్తాడు. అలా స్పర్శామాత్రం చేతనే పాపాలను తొలగింపగలిగిన మహాత్మ్యం కలిగి ఉన్నది కావున ఈ పర్వతం వేంకటాద్రి లేదా వేంకటాచలం లేదా వేంకటగిరిగా ప్రశస్తి కెక్కింది. ప్రాతః సంధ్య వేళలో నిదుర లేచిన వెంటనే ఈ పర్వత నామాన్ని స్మరించినంతనే గంగాది నదులలో వేలసార్లు స్నానమాచరించిన ఫలితం కలుగుతుందని భవిష్యోత్తర పురాణంలో చెప్పబడింది.

## నారాయణాద్రి లేదా నారాయణాచలం

పూర్వం నారాయణుడు అనే మహర్షి ఏ ప్రదేశంలో తపస్సు చేసుకోదల్చినా ఏదో ఒక ఆటంకం ఏర్పడుతుండేది. దాంతో విసిగి వేసారిన నారాయణుడు తన తపఃశక్తితో బ్రహ్మదేవుడిని ప్రత్యక్షం గావించుకుని, తన తపస్సు అవిఘ్నంగా కొనసాగడానికి అనువైన ప్రదేశాన్ని సూచించమని కోరాడు. అప్పుడు బ్రహ్మదేవుడు శేషాచల శ్రేణులలోని ఒక పర్వతాన్ని చూపించి అక్కడ ఏ ఆటంకమూ

లేకుండా తపస్సు చేసుకోవచ్చని సెలవిచ్చాడు. నారాయణుడు బ్రహ్మదేవుడు సూచించిన ప్రదేశంలో శ్రీమన్నారాయణుని గురించి కఠిన తపమాచరించి వారి కటాక్షాన్ని పొందాడు. అలా నారాయణ మహర్షి తపస్సు చేసి శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకున్న ప్రాంతం కాబట్టి ఆ గిరిశిఖరం నారాయణాద్రి లేదా నారాయణగిరిగా పేరు పొందింది.

అంతేకాకుండా శ్రీమహావిష్ణువు వైకుంఠం నుండి భూలోకానికి వేంచేసినప్పుడు సప్తగిరులలో అత్యంత ఉన్నతమైన నారాయణగిరి పర్వతంపైనే మొట్టమొదటగా కాలు మోపాడని పురాణాలలో చెప్పబడింది. ఆ ప్రదేశంలో శ్రీవారి ఆగమనానికి గుర్తుగా వెలసినటువంటి శ్రీవారి పాదాలను నేడు కూడా మనం దర్శించుకోవచ్చు. దేవాలయం నుండి వేదపాఠశాలకు వెళ్ళే మార్గంలో కొన్ని మెట్లెక్కి, అద్దాల పేటికలో భద్రంగా పదిలపర్చబడి నిత్యమూ పూజలందుకునే ఈ పరమ పవిత్రమైన పాదాలను భక్తులందరూ తప్పక దర్శించుకుంటారు. సప్తగిరి శిఖరాలన్నింటిలోకి అతి ఎత్తైన శిఖరం కావడం వల్ల ఆ ప్రదేశం నుండి శేషాచల సానువులన్నింటిని, దట్టమైన అడవులను, ప్రకృతి సోయగాన్ని నయనానందకరంగా వీక్షించవచ్చు.

ఇప్పటివరకు మనం సప్తగిరులలోని ఆరు శిఖరాల గురించి తెలుసుకున్నాం. ఏడవ శిఖరంపై కొంత సందిగ్ధత ఉంది. ఒక్కొక్క గ్రంథంలో ఒక్కో పేరు ప్రస్తావించబడింది.

## వృషాద్రి లేదా వృషాచలము

ఏడవ శిఖరం పేరు కొన్నిచోట్ల వృషాద్రిగా పేర్కొనబడింది. వృషము అంటే ధర్మము లేదా యజ్ఞము అని అర్థం. ధర్మదేవతకు వృషాధిపతి అనే నామాంతరం ఉంది. సర్వధర్మాలకు అధిపతి అయిన ధర్మదేవత ఈ శిఖరంపై తీవ్రమైన తపస్సు చేసి, శ్రీనివాసుని కటాక్షింప చేసుకుని, ఎల్లవేళలా తన ధర్మాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించగలిగే దక్షతను, ధర్మసందేహం వచ్చినప్పుడు సరియైన మార్గాన్ని మాత్రమే ఎంచుకునే విచక్షణను ప్రసాదించమని వేడుకున్నది. వృషాధిపతి లేదా ధర్మదేవతకు శ్రీవేంకటేశ్వరుడు కోరిన వరాన్ని ఇవ్వడం వలన ఇది వృషాద్రి లేదా వృషాచలంగా వినుతికెక్కింది.

## నీలాద్రి లేదా నీలాచలం

మరికొన్ని పురాణాలలో నీలాద్రిని ఏడవ శిఖరంగా పేర్కొన్నారు. నీలాద్రి అనే పేరు రావడం వెనుక చాలా ఆసక్తికరమైన కథనం ఉంది. ఒకానొకప్పుడు నీలాదేవి అనే భక్తురాలు ఒక గిరిశిఖరంపై తీవ్రంగా తపస్సు చేసుకుంటున్న సమయంలో ఆ ప్రదేశంలో విచ్చలవిడిగా సంచరించే క్రూరమృగాలు ఆమె తపస్సును భగ్నం చేయసాగాయి. తనకు భక్తురాలు అయిన నీలాదేవి తపస్సు నిర్విఘ్నంగా కొనసాగింపచేసే నిమిత్తం ఆమె కోరిన విధంగా శ్రీనివాసుడు విల్లంబులు ధరించి, ఆ మృగాలను వేటాడి ఆమె తపస్సుకు కావలసిన ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరచాడు. మృగయా వినోదంతో అలసి సొలసిన అక్కడే గాఢనిద్రకు ఉపక్రమించాడు.

నిద్రావస్థలో ఉన్న శ్రీవేంకటేశ్వరుడి ముఖారవిందాన్ని తనివితీరా గాంచిన నీలాదేవికి ఒక లోపం కొట్టొచ్చినట్లుగా కనబడింది. అదేమిటంటే శ్రీనివాసునికి నుదుటిపైన కొంతభాగంలో కురులు లేవు. ముగ్ధమనోహరమైన శ్రీవారి ముఖానికి ఆ విషయం అతి తీవ్రమైన లోటుగా నీలాదేవికి తోచింది.

కలియుగ ఆరంభంలో శ్రీవేంకటేశ్వరుడు స్వామిపుష్కరిణికి తూర్పు దిక్కున ఉన్న పాము పుట్టలో నివాసమున్నప్పుడు గొల్లవాని గొడ్డలి ప్రహారంతో శ్రీవారి నుదుటి భాగంలో లోతైన గాయమై, రక్తస్రావం జరిగినట్లు మనం ఇంతకుమందే తెలుసుకున్నాం. తర్వాతి కాలంలో గాయం మానిపోగా దెబ్బ తగిలిన ప్రదేశంలో తిరిగి శిరోజాలు మొలవలేదు.

నీలాదేవి వెంటనే నల్లకలువలులా నిగనిగలాడుతున్న తన శిరోజాలను బలవంతంగా ఊడలాగి వాటిని తన దివ్యశక్తితో,



శూన్యంగా ఉన్న శ్రీవారి నుదుటి భాగంలో అతికించింది. దాంతో శ్రీవారి ముఖారవిందం శిరోజాలతో నిండుగా, పూర్ణచంద్రబింబం వలె మెరిసిపోతూ ఉండడంతో నీలాదేవి తన్మయురాలై శ్రీవారిని తదేకంగా చూస్తూ ఉండిపోయింది. కొంతసేపటి తరువాత నిద్రలేచిన శ్రీవారు నుదుటిభాగంపై తడిమి చూసుకుని శిరోజాలు సంపూర్ణంగా ఉండటం గమనించాడు. అదే సమయంలో శిరోజాలను బలవంతంగా ఊడబెరుకుకోవడంతో గాయపడి రక్తమోడుతున్న నీలాదేవి శిరస్సును కూడా గమనించాడు. జరిగినదంతా తన దివ్య దృష్టితో తెలుసుకున్న శ్రీనివాసుడు నీలాదేవి వాత్సల్యానికి అబ్బురపడ్డాడు. స్త్రీలు ప్రాణప్రదంగా ప్రేమించే శిరోజాలను సైతం లెక్కచేయకుండా తనకు సమర్పించిన నీలాదేవి భక్తి తత్పరతను, ఔదార్యాన్ని ప్రశంసించిన శ్రీవారు ఇకనుండి ఆ శిఖరం నీలాద్రి లేదా నీలాచలంగా పిలువబడుతుందని, శిరోజాలు ఆమె పేరున నీలాలు లేదా తల నీలాలుగా పిలువబడతాయని, తనకు ప్రేమతో తలనీలాలు సమర్పించుకున్న భక్తులందరి కోరికలు ఈడేరుతాయని వరమిచ్చాడు. అందువల్లనే ఇప్పటికీ కోట్లాది భక్తులు శ్రీవారికి తమ తలనీలాలను సమర్పించుకుంటారు. స్వామివారికి సమర్పించుకునే లెక్కలేనన్ని మొక్కుబడులలో తలనీలాల సమర్పణ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

మరికొన్ని గ్రంథాలలో ముఖ్యంగా శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో శ్రీశైలం అనబడే మరో శిఖరం కూడా సప్తగిరులలో ఒకటిగా చెప్పబడింది. 'శ్రీ' అనగా శ్రీమహాలక్ష్మి. క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఉద్భవించినపుడు ఆమె శ్రీమహావిష్ణువును భర్తగా కోరుకుని, తన నివాసస్థానం ఎక్కడో తెలుపమని వారిని ప్రార్థించింది. దానికి బదులుగా శ్రీమహావిష్ణువు తనకు శాశ్వతనివాసం లేదని, తాను భక్తుల మదిలోనే కొలువుంటానని, భక్తులను అనుగ్రహించటానికి, రక్షించటానికి ఎల్లవేళలా త్రిలోక సంచారం చేస్తూ ఉంటానని, అందువల్ల శ్రీమహాలక్ష్మి తన శరీరంలో అవిభాజ్య భాగమై, తన వక్షస్థలంలోనే కొలువై, వక్షస్థల లక్ష్మిగా సుప్రసిద్ధమవుతుందని బదులిచ్చాడు. శ్రీమహాలక్ష్మిని తన హృదయంలో కొలువుంచుకున్న శ్రీవేంకటేశ్వరుడు విలసిల్లే పర్వతం కనుక అది శ్రీపర్వతం లేదా శ్రీశైలంగా వినుతికెక్కిందని పురాణ కథనం – పుట–93 తేది. ఆగస్టు, 24.


రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com





# ప్రత్యక్షదైవం శ్రీ సూర్యనారాయణుడు

– డా॥ దేవులపల్లి పద్మజ

**జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్**
**తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరమ్ !!**

చంద్రుడు మఘ నక్షత్రాన ఉండే మాసం మాఘం. 'మఘం' అంటే యజ్ఞం. అఘం అనే పదానికి సంస్కృతంలో పాపము అని అర్థము. మాఘము అనగా పాపాలను నశింపచేసేది. యజ్ఞ యాగాలకు అనువైనది. మాధవ ప్రీతికరమైనది.

ప్రపంచానికి ప్రాణశక్తిని అందించే సర్వవ్యాపి నారాయణుడు సూర్యభగవానుడు. ఆయన సకల లోకములకు ఆత్మస్వరూపుడు. ప్రపంచానికి కాలస్వరూపుడు, గ్రహరాజు, దేవతలలో అగ్రగణ్యుడు, జ్ఞానాన్ని పంచే శివరూపుడు, మోక్షాన్ని ప్రసాదించే జనార్దనుడు, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్నిచ్చే అగ్నిరూపుడు. అందుకే శ్రీ సూర్యభగవానుని ప్రత్యక్షదైవముగా భావిస్తారు. సూర్యుడు లేనిదే సృష్టిలేదు, రేయింబవళ్ళుండవు. కాలానికి కాలమానం సూర్యమానం. సకల చరాచర సృష్టికి, జీవరాశి మనుగడకు సూర్యశక్తి తప్పని సరి. భాస్కరుడు ఈ మండలాన్ని ప్రకాశింప చేస్తాడు. సూర్యుడు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, శబ్ద, రస, రూప గంధాలుగా ప్రపంచానికి ఆపద్బాంధవుడయ్యాడు. సూర్యుడు సర్వ దిక్కులకు వ్యాపించి సర్వ శుభాలను, దీర్ఘాయువును ప్రసాదిస్తాడు. సూర్యభగవానుడు భూమినుండి 14.98 కోట్ల కిలోమీటర్ల ఎత్తులో ఉంటాడు. సూర్య కిరణము సెకనుకు 3 లక్ష కిలోమీటర్ల వేగముతో ప్రయాణిస్తాయి. అవి భూమిని చేరటానికి 8 నిమిషాలు పడుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేస్తారు.

సూర్య సంచారాన్ని అనుసరించి ఉత్తరాయణం మరియు దక్షిణాయనంగా సంవత్సర కాలాన్ని విభజించవచ్చును. మకరం నుండి మిధునరాశి వరకు గల సూర్య సంచారాన్ని ఉత్తరాయణ పుణ్యకాలంగా భావిస్తారు. ఈ కాలం ఎంతో శుభప్రదమైనదని, ఆరోగ్యకారకమని, మోక్షప్రదాయకమని చెబుతారు. ఉత్తరాయణ కాలంలో మరణం సంభవిస్తే సూర్యమండలం ద్వారా ఉత్తమలోకాలకు జీవి చేరుతుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందుకే భీష్మపితామహుడు శరతల్పగతుడై ఉత్తరాయణం వచ్చేవరకు వేచి ఉండి

దేహత్యాగం చేసాడని శాస్త్రాలు చెబుతున్నాయి. సూర్యోపాసన ప్రాముఖ్యాన్ని రామాయణ కాలంలో కూడా వివరించటం జరిగింది. మహర్షి విశ్వామిత్రుడు ఆవిష్కరించిన గాయత్రీ మంత్రమే సూర్యోపాసనగా కొందరు భావిస్తారు. అగస్త్య మహర్షి ద్వారా ఆదిత్య హృదయాన్ని స్వీకరించిన శ్రీరాముడు రావణ సంహారం చేసినట్లుగా రామాయణం వివరిస్తోంది. సర్వదేవతా సమాహారమే సూర్యభగవానుడుని అందరూ విశ్వసిస్తారు. “ఆది దేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కరా “దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే” అంటూ దివాకరుని ప్రతీ నిత్యం సేవించేవారికి అన్ని రకాల దీర్ఘ రోగాలు మటుమాయం అవుతాయి. సూర్యకిరణాలలో అనంతమైన శక్తి నిబిడీకృతమై ఉంది. సూర్యకాంతి మన కంటికి శ్వేతవర్ణంలో కనిపించే సప్తవర్ణ కారకం. ఆంగ్లంలో విబ్జియార్ అంటారు. అంటున్నారు. దినకరుని ద్వాదశ నామాలను ద్వాదశ మాసాలుగా వ్యవహరిస్తారు. అంతే కాకుండా ఆయన పన్నెండు రకాలుగ దర్శనం ఇవ్వటం జరుగుతుంది. ద్వాదశాదిత్యునిగా పిలువబడే సూర్యభగవానుని చైత్రంలో ధాత, వైశాఖంలో ఆర్యముడు, జ్యేష్ఠంలో మిత్రుడు, ఆషాఢంలో వరుణుడు, శ్రావణంలో ఇంద్రుడు, భాద్రపదంలో వివస్వంతుడు, ఆశ్వీయుజంలో త్వష్ట, కార్తీకంలో విష్ణువు, మార్గశిరంలో తర్యముడు, పుష్యంలో భగుడు, మాఘంలో పుషుడు, ఫాల్గుణంలో క్రతువుగా సూర్యోపాసకులు కొలుస్తారు.

చన్నీటి స్నానం చేసేవారి ఆరోగ్యం బాగుంటుందని అందరికీ తెలుసు. దీని వెనుక సూర్యుని ప్రభావం ఎంతో ఉంది. సూర్యకిరణాల తాకిడికి నీరు తేజస్సును సంతరించుకుంటుంది. ఎవరైతే చన్నీటిని స్నానం చేస్తారో వారు ఆ తేజస్సుని అనుభవించగలుగుతారు. సూర్యుని లేలేత కిరణాలు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ విషయాన్ని విజ్ఞాన శాస్త్రము కూడా అంగీకరించింది. ప్రసవానంతరం శిశువుకు కామెర్లు సంభవిస్తే, ప్రతిరోజు సూర్యోదయకాలంలో 10 నిమిషాలు చొప్పున 10 రోజులు ఉంచినట్లయితే వ్యాధి తగ్గు ముఖం పడుతుందని శిశు వైద్యులు చెబుతారు. సూర్యుడు లేనట్లయితే భూమిపై జీవరాశి మనుగడ ఉండదు. జీవరాశికి కావలసిన అన్ని రకాల అవసరాలు తీర్చి ఈ భూమండలాన్ని కాపాడుతున్నాడు. అందుకే ఆ దినకరుని ఆరాధన ఆచారంగా వస్తోంది. సూర్యభగవానుడు నిత్య దర్శనమిస్తూ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్నాడు. దినకరుడు రెండు, మూడు రోజులు దర్శనమివ్వకపోతే లోకాలు తల్లడిల్లిపోతాయి. సూర్యుని యొక్క మూడు దశలైన సూర్యోదయం, మధ్యాహ్నం, సూర్యాస్తమయం సృష్టి, స్థితి, లయలుగా పోలి ఉంటాయి.

సూర్యుని నుండి వచ్చే కిరణాలు సప్తజ్ఞాన భూమికలు. అందులో జ్ఞానం ప్రధానమైనది. వాటి నామాలను పరిశీలిస్తే, శుభేచ్ఛ, విచారణ, తనుమానం, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థభావని, తురీయంగా తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానం కావాలనే ఇచ్ఛను శుభేచ్ఛ అని, బ్రహ్మ జ్ఞానాన్ని పొందే సాధనామార్గ మీమాంసను విచారణ అని, సాధనామార్గంలో నిమగ్నమై ఉండటాన్ని తనుమానం అని, రజో గుణ మరియు తమో గుణ రహితమైన శుద్ధ సాత్విక శూన్య స్థితిని సత్త్వాపత్తి అని, తనువు మరియు సంసారం పట్ల తటస్థ స్థితి కలిగి దివ్య చక్షువులు ఉత్తేజితమయ్యే స్థితిని అసంసక్తి అని, దివ్య చక్షువుల ద్వారా పదార్థ భావన కలిగి ఉండి కూడా పూర్తి సంశయ నివృత్తి కాక ఉండే స్థితిని పదార్థభావన అని, సాధనా ద్వారా పూర్ణవికాస స్థితిని చేరుకుని సిద్ధుడుగాను, బుద్ధుడుగాని రూపాంతరం చెందే ఆఖరి స్థితిని తురీయం అని అంటారు. దీనినే నిర్వికల్ప సమాధి స్థితి అని కూడా అంటారు.

రోహిణీ నక్షత్రంలో, ఆదివారం, మాఘ శుద్ధసప్తమి తిథినాడు సూర్యభగవానుడు జన్మించాడు. ఈయన తండ్రి కశ్యప ప్రజాపతి. సంజ్ఞ మరియు ఛాయ ఈయన భార్యలు. యమధర్మరాజు, శనీశ్వరుడు ఈయన కుమారులు. జల ప్రళయానంతరం వైవస్వత మనువుకు సప్త అశ్వాలతో కూడిన రథంలో సూర్యభగవానుడు దర్శనమిచ్చే రోజునే రథసప్తమి అని వ్యవహరిస్తారు అని సూర్య పురాణం తెలియచేస్తున్నది. ఆదివారం రథసప్తమి వస్తే మహాయోగమనే చెప్పాలి. మాఘశుద్ధ షష్ఠి నాడు ఉపవసించి, సప్తమి నాడు సూర్యోపాసన చేసిన జన్మజన్మాంతర పాపములు నశిస్తాయి. రథ సప్తమినాడు చేసే స్నానానికి విధానమున్నది. జిల్లేడు ఆకును, రేగుపండ్లను తలపై ఉంచుకుని శిరస్సుపైనుంచి స్నానం ఆచరించాలి. తరువాత క్రింద వివరించిన మంత్ర జపం చేస్తూ అర్ఘ్య ప్రదానం చేయాలి.

**“జననీ త్వంహి లోకానాం సప్తమీ సప్తసప్తికేం**
**సప్తమ్యా హ్యదితే దేవి నమస్తే సూర్యమాతృకే”**

తరువాత తగువిధంగా పితృ తర్పణాలు సమర్పించి ఎరుపురంగు పాత్రలో చిమ్మిలిని ఉంచి, ఎరుపు రంగు వస్త్రాన్ని కప్పి, ఎరుపు రంగు తామర పూవులతోను, అక్షింతలతో బ్రాహ్మణులకు దానమివ్వాలి. చిక్కుడుకాయలతో రథం తయారుచేసి, అందులో సూర్య ప్రతిమను నిలిపి, యధాశక్తి అర్చించి చిక్కుడు ఆకులో ఆవుపాలతో తయారు చేసిన బియ్యపు పాయసాన్ని నివేదన చేయాలి. తరువాత చిక్కుడు ఆకులోనే అందరూ ఆ పాయసాన్నే ప్రసాదంగా స్వీకరించాలి. ఈరోజు తైల పదార్థాలు నిషిద్ధం. భవిష్యోత్తర పురాణంలో శ్రీకృష్ణభగవానుడే స్వయంగా సూర్యోపాసన ప్రాముఖ్యాన్ని ధర్మరాజుకు వివరించాడు. సూర్య భగవానుని అనుగ్రహానికై ఈ రోజే చేసే పూజకు, ఉపాసనకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. శ్రీమన్నారాయణుని రెండు కనులు సూర్యచంద్రులుగా పేర్కొంటారు. అందుకే సూర్యునికిరణాలు శ్రీమన్నారాయణుని

కరుణా కటాక్ష వీక్షణాలుగా భావించి ఆరాధిస్తారు. ఎరుపు రంగు కెంపు గాని, మాణిక్యాలను గాని ధరించుట ఉత్తమము.


రథసప్తమి నాటినుండి చలి తగ్గుముఖం పడుతుంది. వేడి క్రమంగా అధికమవుతుంది. అందుకే పూర్వకాలంలో రాజులు రథసప్తమి నాటినుండి యుద్ధాలకు సన్నద్ధమయ్యేవారు. అందుకు సూచనగా రథాలను సిద్ధం చేసుకునేవారు. సూర్యరశ్మి లభ్యత పెరిగి పంట దిగుబడి కూడా పెరుగుతుంది.

సూర్యగ్రహ అనుకూలత ఉన్నట్లయితే జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం, వృత్తి ఉద్యోగ, వ్యాపారాలలో అభివృద్ధి గోచరిస్తుంది. వ్యక్తులు వీరోచితంగా మారుతారు. ప్రభుత్వ సంబంధ కార్యక్రమాలలో అనుకూలత సిద్ధిస్తుంది. ప్రజా బాహుళ్యంలో పేరు ప్రఖ్యాతులు సంభవిస్తాయి. అధికార ప్రాప్తి కలుగుతుంది. రవి వ్యతిరేకంగా ఉన్నట్లయితే వీటి వ్యతిరేక ఫలితాలు కలుగుతాయి. దేవాలయములోని సూర్యగ్రహము వద్ద ఆదివారము ఎరుపు రంగు 6 వత్తులతో దీపారాధన, ఎరుపు రంగు వస్త్రము దానము, సూర్య ధ్యాన శ్లోకము ప్రతీ రోజు 60 మార్లు చొప్పున 60 రోజుల పారాయణ, రథసప్తమి రోజున సూర్యాష్టకము 6 సార్లు పారాయణ, బ్రాహ్మణునికి గోధుమలు దానం, పేదలకు చపాతీలు దానం వంటి కార్యక్రమములు మంచి ఫలితాలిచ్చి రవిగ్రహ వ్యతిరేకత తగ్గిస్తుంది.

అరసవిల్లి లోని సూర్యదేవాలయము కళింగరాజు 7వ శతాబ్దములో నిర్మించినట్లు చారిత్రకంగా తెలుస్తోంది. ఇచ్చట అద్భుతమైన శిల్ప సౌందర్యమును గమనించవచ్చును. ప్రతిరోజు ఉదయం సూర్యకిరణాలు స్వామి విగ్రహం పాదాలను తాకటం, ఈ దేవాలయ నిర్మాణ కౌశలాన్ని తెలియచేస్తుంది. ఒరిస్సాలోని కోణార్క్‌లో అద్వితీయమైన సూర్యదేవాలయమున్నది. ఇది 13వ శతాబ్దములో నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడ 100 అడుగుల ఎత్తైన సూర్యరథము ఏకశిలపై నిర్మించారు. తన రెండు చేతులలో పద్మాన్ని ధరించిన సూర్యుడు, రథచక్రాలు, అశ్వాలు అతి స్పష్టంగా నిజాకృతిని దాల్చినట్లు గోచరమౌతుంది. ఈ దేవాలయము అనేక పర్యాయములు ముస్లిం దండయాత్రలకు గురైంది. మన దేశంలో అనేక సూర్యదేవాలయాలున్నాయి. సాధారణంగా ప్రతీ శివాలయంలో నవగ్రహ దేవతలు దర్శనమిస్తారు. మిగిలిన గ్రహాలు పరివేష్టింపగా సూర్యుడు మధ్యలో ప్రకాశిస్తూ గోచరిస్తాడు. తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం, కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు, తమిళనాడులోని కుంభకోణంలో కూడా ప్రముఖ సూర్యదేవాలయాలున్నవి.

జీవకోటి మనుగడకు ఆధారభూతమైన శ్రీసూర్యనారాయణునికి ప్రీతిపాత్రమైన రథసప్తమినాడు ఆరాధించి అనేక శుభాలను పొందుదాం.

**శుభం భూయాత్**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 58వ కళ్యాణం :

తేది 26-11-2023 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి హెచ్‌ఐజిఎ-42, ఆఫీసర్స్ కాలనీ, సన్‌రిడ్జ్ హాస్పిటల్ లేన్, డా.ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ ఎన్.సత్యనారాయణరాజు దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్య వైభవంగా జరిగింది.

## 59వ కళ్యాణం :

తేది 09-12-2023 శనివారం ఉదయం 10.30 గంటల నుండి వి.ఎస్.ఆర్. వేర్ హౌజ్, ఇంజాపూర్ గ్రామం, అబ్దుల్లాపూర్ మెట్టు (మండలం) నందు జరిగింది. దీనిని శ్రీమాన్ వంగేటి సంజీవరెడ్డి, జయసుధ దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 60వ కళ్యాణం :

తేది 17-12-2023 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి మల్లారెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్, ఎల్లారెడ్డి గూడ, కాప్రా, సికింద్రాబాద్ లో శ్రీమాన్ అనంత గోవింద దాస్ (ఎస్టీ) సికింద్రాబాద్ వారి నిర్వహణలో వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 61వ కళ్యాణం :

తేది 23-12-2023, శనివారం వైకుంఠ ఏకాదశి రోజున కాకతీయ నగర్ రిక్రియేషన్ క్లబ్, కాకతీయ నగర్, హబ్సీగూడలో జరిగింది. ముందు భజగోవిందం, ఆ తరువాత కళ్యాణం సాయంత్ర సమయాన జరిగినవి. వీటిని హబ్సీగూడ కాలనీవాసుల తరపున శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం నిర్వహించింది. అత్యంత ఉత్సాహంగా జరిగింది.



ధారావాహిని

# అమ్మ కథలు

- డి.శ్రీనివాస దీక్షితులు

## సుదర్శనుడు

సూర్యవంశానికి చెందిన ధ్రువసంధి కోసల దేశాన్ని పరిపాలిస్తున్నాడు. అయోధ్యా నగరం కోసలకి రాజధాని. ధ్రువసంధి తండ్రి పుష్పుడు. కోసలరాజు ధర్మాత్ముడు, సత్యసంధుడు. ఆయన పాలనలో ప్రజలందరూ సుఖంగా జీవించేవారు.

ఆ రాజుకి ఇద్దరు భార్యలున్నారు. పెద్దభార్య పేరు మనోరమ. ఈమె పట్టపురాణి. ఇక రెండవ భార్య పేరు లీలావతి. ఈమె రాజుగారికి ముద్దుల భార్య. మనోరమకి సుదర్శనుడు అనే కుమారుడు కలిగాడు. లీలావతికి శత్రుజిత్తు అనే పుత్రుడు జన్మించాడు.

శత్రుజిత్తుకి బాగా లౌక్యం తెలుసు. బాల్యం నుంచే జీవలక్షణాలు బయటపడతాయి. తల్లితండ్రుల్ని, మంత్రుల్ని, ప్రజల్ని అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అందరి మనసుల్ని ఆకట్టుకునేవాడు. అందువల్ల అందరికీ అతనంటే ఇష్టం. మహారాజు ధ్రువసంధి కూడా శత్రుజిత్తునే బాగా ఇష్టపడేవాడు.

సుదర్శనుడి స్వభావం శత్రుజిత్తుకి పూర్తిగా విరుద్ధం. సుదర్శనుడికి లౌక్యం తెలియదు. అందువల్ల అతను జనరంజకుడు కాలేకపోయాడు.

ఒకనాడు ధ్రువసంధి వేటకోసం అడవికి వెళ్ళాడు. క్రూరజంతువుల్ని వేటాడాడు. అంతలో ఒక సింహం హఠాత్తుగా వచ్చి మహారాజు పైకి దూకింది. మహారాజు ఆ సింహంతో భీకరంగానే పోరాడాడు. చివరికి మృగరాజు మహారాజుని చంపేసింది. మహారాజు సైనికులు సింహాన్ని చంపేశారు.

పట్టపురాణి కుమారుడైన సుదర్శనుణ్ణి రాజ్యానికి వారసుడిగా మంత్రులు నిర్ణయించారు. కానీ లీలావతి తండ్రి, ఉజ్జయినీ రాజు యుధాజిత్తు మంత్రుల అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు.

కళింగదేశపు రాజు, మనోరమ తండ్రి అయిన వీరసేనుడు సంప్రదాయం ప్రకారం సుదర్శనుడే రాజు కావాలని పట్టుపట్టాడు.

రెండు పక్షాలుగా ఏర్పడ్డాయి.

ఉజ్జయినీ సైన్యం... కళింగదేశపు సైన్యం వేగంగా వచ్చి అయోధ్యని చుట్టుముట్టాయి. రాజు లేని రాజ్యం శత్రువులకి లోకువయింది. అందరి కన్నూ అయోధ్య మీద పడింది. బాగా సుసంపన్నమైన రాజ్యం కావడం వల్ల సామంత రాజులు కూడా అయోధ్య మీద దాడి చేశారు. ఇదే అదనుగా భావించి గజదొంగలుగా ప్రసిద్ధి చెందిన బోయలు కూడా శృంగిబేరపురం నుంచి వచ్చి సైన్యంలో కలిసిపోయారు. రాజ్యం లోని సంపదను దోచుకోసాగారు.

యుద్ధం సాగుతోంది.

అటు యుధాజిత్తు ఇటు వీరసేనుడు హోరాహోరీ పోరాడుతున్నారు. అస్త్రాలు శస్త్రాలు ఇరుపక్షాలు ప్రయోగిస్తున్నాయి. రక్తం ఏరులై పారుతోంది. యుద్ధరంగంలో అంతటా శవాల కుప్పలు కనిపిస్తున్నాయి. గద్దలు కాకులు గుంపులు గుంపులుగా యుద్ధరంగంలో ఎగురుతున్నాయి.

యుధాజిత్తు తన పదునైన బాణాలతో వీరసేనుడి తలని ఖండించాడు. ఆ దృశ్యాన్ని చూసి వీరసేనుడి సైన్యం భయంతో యుద్ధభూమి నుంచి పారిపోయింది.

తన తండ్రి వీరసేనుడు శత్రువుల చేతిలో మరణించాడని విని మనోరమ దుఃఖంతో క్రుంగిపోయింది. కష్టాలన్నీ తనకే దాపురించాయని ఏడ్చింది.

భర్త మరణించాడు, తండ్రి మరణించాడు. కుమారుడేమో చిన్నపిల్లవాడు. మనోరమ బాగా ఆలోచించింది.

శత్రువుగా మారిన యుధాజిత్తు క్రూరుడు, దుర్మార్గుడు. అతనికి అంతులేని రాజ్యకాంక్ష, దురాశ, అసూయ, ద్వేషం, దుర్గుణాలన్నీ అతనిలో ఉన్నాయి. అతనొక పాపాల పుట్ట.

అందుకే మనోరమ భయపడుతోంది.

రాజ్యం యుధాజిత్తుకి వశమయింది.

పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆమె అనుమానం.

కోసల దేశానికి నిజమైన వారసుడు సుదర్శనుడు కదా. అతనిని యుధాజిత్తు మట్టుపెడతాడని ఆమె గట్టిగా నమ్ముతోంది.

“ఇప్పుడు నాకు దిక్కెవరు? నన్నెవరు ఆదుకుంటారు” అనుకుని కృంగిపోతోంది.

అంతలో ఆమెకు నమ్మకస్తుడైన విదల్లుడు అనే మంత్రి గుర్తొచ్చాడు. వెంటనే రహస్యంగా అతనిని పిలిపించింది

మనోరమ. దాయాదుల యుద్ధంలో బాగా అలసిపోయింది ఆమె.

మంత్రులందరూ యుధాజిత్తు పక్షం చేరారు. విదల్లుడు మాత్రమే మనోరమ పక్షాన ఉన్నాడు.

కోసలదేశానికి దూరంగా కాశీరాజ్యానికి రాజకుమారుడితో కలిసి వెళ్ళటం మంచిదని విదల్లుడు మనోరమకి గట్టిగా చెప్పాడు.

మనోరమ అంగీకరించింది.

రహస్యంగా వెళ్ళటానికి సహాయం చేస్తానన్నాడు మంత్రి. యుద్ధంలో మరణించిన తండ్రిని చూడటానికి వెళుతున్నాను అని చెప్పి తన కుమారునితో కలిసి మనోరమ రథం మీద యుద్ధరంగానికి చేరింది. తండ్రికి అంత్యక్రియలు జరిపించింది మనోరమ.

తర్వాత చాలా రహస్యంగా అదే రథం మీద కుమారునితో కలిసి రెండు రోజులు ప్రయాణం చేసి గంగాతీరానికి చేరింది మహారాణి.

రాత్రి అయింది. దురదృష్టం. కొంతమంది దొంగలు వచ్చి మనోరమ నగలు, ధనాన్ని, రథాన్ని దొంగిలించారు. కట్టుబట్టలతో, కుమారునితో మిగిలింది మహారాణి. మరునాడు ఆమె గంగానదిని దాటి త్రికూట పర్వతం మీదుగా భరద్వాజ మహర్షి ఆశ్రమానికి చేరింది.

విదల్లుడు రహస్యంగా వచ్చి మహారాణిని కలిశాడు. భరద్వాజుడు మహారాణి వివరాల్ని అడిగాడు. కాని దుఃఖం మూలంగా తన వివరాల్ని చెప్పలేకపోయింది మనోరమ. ఆమె దీనగాథని మంత్రి స్వయంగా మహర్షికి చెప్పాడు.

''మహర్షీ! మహారాణికి దయతో ఆశ్రయమివ్వండి. ఇది మీ కర్తవ్యం కూడా'' అని ప్రార్థించాడు మంత్రి.

భరద్వాజుడు మహారాణికి ఆశ్రయమిచ్చాడు. సుదర్శనుడు భవిష్యత్తులో రాజు అవుతాడని ధైర్యం చెప్పాడు. మంత్రి కూడా మనోరమతోనే ఉండిపోయాడు.

మనోరమ ఆమె కుమారుడు సుదర్శనుడూ భరద్వాజుని ఆశ్రమంలోనే ప్రశాంతంగా కాలం గడుపుతున్నారు.

యుద్ధం ముగిసింది. శత్రువులందరూ మరణించారు.

మనోరమ కోసం, వారసుడైన సుదర్శనుడి కోసం అయోధ్యలో యుధాజిత్తు గాలించాడు. ఇతర దేశాలలో వెతకమని వేగుల్ని పంపించాడు. వాళ్ళ ఆచూకీ కనిపించలేదు. ఒక సుముహూర్తంలో తన మనవడైన శత్రుజిత్తుకి యుధాజిత్తు పట్టాభిషేకం చేశాడు. శత్రుజిత్తు రాజ్యపాలన చేయసాగాడు.

మనోరమని సుదర్శనుడిని ప్రజలు మరచిపోలేదు. పాపం వాళ్ళు ఎక్కడున్నారో అని జాలిపడ్డారు ప్రజలు.

అయోధ్యలో కొద్ది కాలమున్న తరువాత తన రాజ్యానికి బయల్దేరాడు యుధాజిత్తు. మనోరమ తన కుమారునితో కలిసి భరద్వాజుని ఆశ్రమంలో కాలం గడుపుతోందని దారిలో యుధాజిత్తుకి తెలిసింది.

వెంటనే చిత్రకూట పర్వతానికి వెళ్ళాడు యుధాజిత్తు. అక్కడి బలుడు అనే బోయరాజుని కలిశాడు. శృంగిబేర పురానికి వెళ్ళి దుర్దర్శుడు అనే రాజుని కలిశాడు. వాళ్ళిద్దరినీ వెంటబెట్టుకుని తన సైన్యముతో యుధాజిత్తు భరద్వాజుని ఆశ్రమానికి వచ్చాడు.

మనోరమ తనని కాపాడమని మహర్షిని వేడుకుంది. మహర్షి ఆమెకు అభయమిచ్చాడు.

యుధాజిత్తు ఆశ్రమంలోకి వచ్చి మనోరమని, సుదర్శనుడిని తనకు అప్పగించమని మహర్షిని బెదిరించాడు. మహర్షి ఆ రాజు మాటల్ని తిరస్కరించాడు. ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి.

చివరికి తన మంత్రితో యుధాజిత్తు ఆలోచించాడు. మహర్షులతో వైరం మంచిది కాదని, అది వంశాన్ని నాశనం చేస్తుందని మంత్రి వివరించాడు.

భరద్వాజ మహర్షిని మన్నించమని వేడుకుని యుధాజిత్తు ఉజ్జయినికి వెళ్ళిపోయాడు.

భరద్వాజుని ఆశ్రమంలో మంత్రితో, కుమారునితో మనోరమ ఆనందంగా కాలం గడుపుతోంది. బాలుడైన సుదర్శనుడు ఋషికుమారులతో కలిసి ఆడుకుంటూ పాడుకుంటూ హాయిగా పెరుగుతున్నాడు.

ఒకనాడు బాలకులందరూ సుదర్శనునితో కలిసి ఆడుకుంటున్నారు. ఆటలో భాగంగా వాళ్ళలో వాళ్ళు ఒక బాలుని క్లీబుడు (నపుంసకుడు) అన్నాడు. మంచివాడైన సుదర్శనుడు మాత్రం ఆ పదంలోని క్లీ అనే అక్షరాన్ని పట్టుకున్నాడు. ఉచ్చారణకి అనుకూలంగా అనుస్వారాన్ని (సున్న) చేర్చి క్లీం అని పదే పదే అనసాగాడు.

క్లీం కామరాజ బీజాక్షరం. ఆ క్షణం నుంచి అమ్మవారి అనుగ్రహం మూలంగా తెలియకుండానే అనుక్షణం ఆ బీజాక్షరాన్ని ధ్యానించసాగాడు సుదర్శనుడు.

పదకొండేళ్ళు గడిచాయి.

భరద్వాజుడు అతనికి ఉపనయనం చేశాడు. కామరాజ బీజాన్ని జపించటం వల్ల సకల విద్యలూ అతనికి అనాయాసంగా పట్టుబడ్డాయి. అయినా సుదర్శనుడు కామరాజ బీజాన్ని జపిస్తూనే ఉన్నాడు. ఒకనాడు అతని జపానికి మెచ్చి మహాదేవి ప్రత్యక్షమయింది.

ఎర్రటి వస్త్రాల్ని ధరించి, అమూల్యమైన ఆభరణాల్ని అలంకరించుకుని గరుడవాహనం మీద ఎక్కిన వైష్ణవీ శక్తిగా అమ్మ అతనికి దర్శనమిచ్చింది. సుదర్శనుడు పరవశించిపోయాడు. ధనుర్బాణాలు, కవచం, అక్షయ తూణీరాలు అనుగ్రహించింది.

భరద్వాజుడు విషయమంతా విని ఆనందించాడు. ''నాయనా! అమ్మ దయ ఎప్పుడు, ఎలా కలుగుతుందో తెలుసుకోవడం సాధ్యం కాదు. నువ్వు కామరాజ బీజాక్షరాన్ని జపించటం కొనసాగించు. అదే నీకు రక్షణ కవచం. శుభమస్తు'' అని ఆశీర్వదించాడు మహర్షి.

సుదర్శనుడు అలాగే అంటూ నమస్కరించాడు.



# సావిత్రీ గౌరీదేవి వ్రతం

డా|| మరుదాడు అహల్యాదేవి

సంక్రాంతి పండుగకు మరుసటి రోజున సావిత్రీ గౌరీ వ్రతాన్ని ఆచరించాలి.

**వ్రత విధానం**

సూర్యోదయానికి ముందే నిద్ర లేచి నిత్యకృత్యాలు పూర్తి చేసుకోవాలి. సావిత్రీ గౌరీవ్రతం చేస్తున్నానని సంకల్పం చెప్పుకోవాలి. కుమ్మరి వద్దనుండి తెచ్చిన మట్టితో సావిత్రి గౌరీ ప్రతిమను చేసి పూజాస్థానంలో ఉంచాలి. ఆ తరువాత దీపారాధన, కలశ, గణపతి పూజలు చేశాక సావిత్రి గౌరీవ్రతం ఆరంభించాలి. గౌరీదేవిని ధ్యానం చేసి ఆవాహనం, ఆసనం, అర్ఘ్య పాద్య ఆచమన స్నానాదులతో, గంధాక్షతలతో, ధూపదీప నైవేద్యాలతో పూజించాలి. గౌరీ అష్టోత్తర శతనామాలతో పుష్పార్చన చేయాలి. ధూప దీప నైవేద్యాలు నీరాజనం పూర్తయ్యాక సావిత్రి గౌరీదేవిని ప్రసన్నం చేసుకోవడానికి తొమ్మిది ప్రసన్నార్ఘ్యాలు విడవాలి. అనంతరం తోరానికి పసుపు రాసి, తొమ్మిది ముడులు వేసి పూజాస్థానంలో ఉంచాలి. కథ విన్న తరువాత తోరాన్ని చేతికి కట్టుకోవాలి. బ్రాహ్మణులకు దక్షిణలు ఇవ్వాలి. ముత్తయిదువలకు చేట వాయినం సమర్పించాలి.

**వ్రత కథ**

పూర్వం మార్కండేయ మునీశ్వరుడు పండితులతో కలిసి ధర్మరాజు వద్దకు వెళ్ళాడు. ధర్మరాజు ఆదరంతో స్వాగతం పలికి, మార్కండేయునికి ఉచితాసనమిచ్చి, అర్ఘ్య పాద్యాదులతో పూజించాడు. క్షేమ సమాచారాలు అడిగాడు.

''మునీంద్రా! దయతో నా కోరికను మన్నించాలి అన్నాడు ధర్మరాజు. చెప్పమన్నాడు మునీశ్వరుడు.

''ఈ లోకంలోని స్త్రీలకు పుత్ర పౌత్రాదులను ప్రసాదించి, వారి మాంగల్యబలం స్థిరమై, భర్త దీర్ఘాయుష్మంతుడు, ఆరోగ్యవంతుడై జీవించేలా చేసే ఒక ఉత్తమ వ్రతం గురించి చెప్పగలరు'' అని ధర్మరాజు కోరాడు. ముని సంతోషంతో ఇలా చెప్పసాగాడు. ''ఓ రాజా! లోకానికి మేలు చేసే వ్రతం గురించి అడిగావు. తప్పక చెబుతాను. దీనిని ఇంతకుముందు అనేకమంది పతివ్రతలు ఆచరించి గొప్ప ఫలితాలను పొందారు. ఈ వ్రతం పేరు ''సావిత్రీ గౌరీ వ్రతం''. ఇది ముత్తయిదువలకు పుత్ర పౌత్ర సమృద్ధిని ప్రసాదిస్తుంది. వారి మాంగల్యబలం వృద్ధి చెందుతుంది. ఈ వ్రత మహత్తును తెలిపే కథను చెబుతాను. శ్రద్ధగా వినండి.

పూర్వం ఒక నదీతీరాన గల పట్టణపు రాజు పేరు ధర్మవర్మ. చక్కగా పాలన చేస్తుండేవాడు. సకల శాస్త్ర కోవిదుడైన ఒక పురోహితుడు రాజు దగ్గర ఉండేవాడు. ఆ పురోహితుడు అనేక వ్రతాలు, అనుష్ఠానాలు, యజ్ఞ యాగాదులు ఆచరించడంతో సోమయాజిగా ప్రసిద్ధుడయ్యాడు. ఆ పండితుడు భార్యా బిడ్డలతో సుఖంగా జీవిస్తున్నాడు. సోమయాజి ధర్మపత్ని సోమిదేవమ్మ గౌరీపూజ చేయాలని సంకల్పించింది. ఈ వ్రతం తొమ్మిదేళ్ళు చేసి, ఆ తరువాత ఉద్యాపన చేయాలనే నియమంతో 'సావిత్రీ

గౌరీవ్రతం' ఆరంభించారు. సావిత్రీ గౌరీవ్రతాన్ని సోమిదేవమ్మ తొమ్మిదేళ్ళు చక్కగా ఆచరించింది. ఉద్యాపన చేసే సమయం ఆసన్నమైంది. ఈ సంగతి రాజు ధర్మవర్మ సతీమణికి తెలిసింది. సోమిదేవమ్మ వ్రతనిష్ఠను పరీక్షించాలనుకుంది. గోబ్రాహ్మణాది హింసలు చేసినవారు పాపయోనుల్లో జన్మిస్తారనే సంగతి రాజుగారి భార్యకు తెలుసు. అయినా ఆమె సోమిదేవమ్మ పుత్రులను హత్య చేసి, వారి పార్థివ దేహాలను మూట కట్టి సోమయాజి ఇంటికి పంపింది. వ్రత దీక్షలో ఉన్న సోమిదేవమ్మ ఉద్యాపన విధి నిర్వర్తిస్తోంది. పుత్రశోకాన్ని మోసుకొచ్చిన పార్థివ దేహాల మూట ఇంటిముందు ఉంది. సావిత్రి గౌరీవ్రత ఉద్యాపన శాస్త్రోక్తంగా పూర్తి చేసిన సోమిదేవమ్మ గౌరీదేవిని పూజించి, పూజాస్థానంలోని అక్షింతలు తీసుకుని ఇంటి బయటకు వచ్చింది. రాజుగారి భార్య పంపిన మూటపై సోమిదేవమ్మ అక్షతలు చల్లింది. ఆ అక్షతల ప్రభావంతో, గౌరీదేవి అనుగ్రహంతో మూటలోని పార్థివ దేహాలు పునర్జీవం పోసుకున్నాయి. సోమిదేవమ్మ కుమారులు నిద్రనుంచి మేల్కొన్నట్లు లేచి కూర్చున్నారు. ఆ అద్భుతాన్ని చూసిన అక్కడున్నవారందరూ ఆశ్చర్య చకితులయ్యారు. సోమయాజి, సోమిదేవమ్మ దంపతులు గౌరీదేవిని విశేషంగా స్తుతించి, వందనాలు సమర్పించారు.

గౌరీదేవి మహిమతో సోమిదేవమ్మ సంతానం తిరిగి బతికిందనే కబురు రాజుగారి అంతఃపురానికి చేరింది. హత్యకు కారకురాలైన మహారాణి ఖిన్నురాలైంది. వెంటనే సోమయాజి దంపతులను పిలిపించింది. అంతఃపురానికి వచ్చిన ఆ దంపతుల పాదాలపై పడి క్షమాపణలను వేడుకుంది రాణి. "మీ వ్రతం మహిమను పరీక్షించాలనే ఉద్దేశ్యంతో నేనలా చేశాను. అయితే మీ కుమారులు బతికారని విన్నాను. నిర్జీవులైన వారిని తిరిగి ఎలా బతికించుకోగలిగావు? వ్రతవిధానం తెలుపుమ"ని రాణి సోమిదేవమ్మను కోరింది.

సోమిదేవమ్మ చెప్పింది. "సావిత్రీ గౌరీదేవి వ్రత మహిమతో నా పుత్రులు తిరిగి జీవించారు. ఈ వ్రతం చాలా గొప్పది. మకర సంక్రాంతి మరుసటి రోజున ఈ వ్రతం చేయాలి. ఉదయం పూట కోడికూత వినడానికి ముందే నిద్రనుంచి లేవాలి. నిత్యకృత్యాలు పూర్తి చేసుకోవాలి. కుమ్మరి ఇంటికి వెళ్ళి అక్కడి మట్టిని అడిగి తెచ్చుకోవాలి. ఆ మట్టితో సావిత్రి గౌరీదేవి ప్రతిమను చేసుకోవాలి. మౌనం వహించి, శ్రద్ధా భక్తులతో ఈ వ్రతాన్ని ఆచరించాలి. షోడశోపచారాలతో వ్రతపూజను పూర్తి చేయాలి. తొమ్మిది వరసలు గల తోరానికి తొమ్మిది ముడులు వేసి పూజించి, వ్రతం పూర్తయ్యాక చేతికి కట్టుకోవాలి. ఆ రోజు నుంచి తొమ్మిది రోజులు ఈ వ్రతం చేయాలి. తొమ్మిదో రోజున వ్రతానికి ఉద్యాపన పలకాలి. ఇలా ప్రతి యేటా చేస్తూ తొమ్మిది సంవత్సరాలు సావిత్రీ గౌరీవ్రతాన్ని నిర్వర్తించాలి. తొమ్మిదో సంవత్సరంలో వ్రతానికి పూర్తిగా ఉద్యాపన పలకాలి. వ్రతం చేసిన ప్రతిసారీ రెండు చేటలను జోడుగా చేసి, అందులో 9 ఆకులు, 9 వక్కలు, పండ్లు, కనుములు, గాజులు, పసుపు కుంకుమలు పెట్టి పెద్ద ముత్తయిదువలకు వాయినంగా ఇవ్వాలి. ఇది చేట వాయినం. తొమ్మిదిమంది ముత్తయిదువలకు తొమ్మిది వాయినాలు ఇవ్వాలి. ముత్తయిదువలను పూజించి, వారికి ప్రదక్షిణ నమస్కారం చేసి, వారి ఆశీస్సులు అందుకోవాలి. అనంతరం వారికి భోజనాదులు సమకూర్చి సంతృప్తి పరచాలి. వాయినం తీసుకుని వారు వెళ్ళాక వ్రతకర్తలు భోజనం చేయాలి. ఇది సావిత్రీ గౌరీ వ్రత ఉద్యాపన. ఈ వ్రతం ఆచరించే గృహిణులకు పుత్ర పౌత్ర సంపదలు కలుగుతాయి. భర్త దీర్ఘాయువుతో జీవిస్తాడని సోమిదేవమ్మ చెప్పడంతో, తానూ ఈ వ్రతం ఆచరించి గౌరీదేవి అనుగ్రహం పొందాలనే అభీష్టం మహారాణిలో కలిగింది. ఏడాది తర్వాత వచ్చిన మకర సంక్రాంతి నాడు రాజు అనుమతి తీసుకున్న మహారాణి మరుసటి రోజున సావిత్రీ గౌరీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించింది. వ్రత ప్రభావంతో మహారాణి పుత్ర పౌత్ర సంపదలు, భోగభాగ్యాలు మరిన్ని పొంది సంతోషంగా జీవితాన్ని గడిపింది. ఈ లోకంలో భౌతిక కాయాన్ని విడిచిన తరువాత మోక్షప్రాప్తితో కైలాసానికి చేరింది" అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు చెప్పాడు.



23-12-23 వైకుంఠ ఏకాదశి సందర్భంగా
శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం
ఆధ్వర్యములో భజగోవిందం మరియు
61వ శ్రీనివాస కళ్యాణము.

ధారావాహికం



# ధనుర్విద్యా ప్రవీణుడు, వీరుడు అర్జునుడు

– కౌతా నిర్మల

అర్జునుడు పంచపాండవులలో మధ్యవాడు. అర్జునుడు నరుడు అనే ఋషి యొక్క అవతారం. శ్రీకృష్ణునికి అర్జునుడు ఎంతో ప్రీతిపాత్రుడు. ధనుర్విద్యలో అర్జునుని మించిన విలుకాడు మరెవ్వరూ లేరు. మహాభారతంలో అర్జునుని పాత్ర ఎంతో ప్రముఖమైనది, ప్రశస్తమైనది, విశిష్టమైనది. అతను గొప్ప వీరుడు, ధర్మపరుడు. శ్రీకృష్ణునికి ఆంతరంగిక సఖుడు, న్యాయశీలి, పండితుడు, ధనుర్విద్యలో ప్రవీణుడు, ద్రోణాచార్యునికి ప్రియ శిష్యుడు. భూభారాన్ని తగ్గించటానికి అవతరించిన శ్రీకృష్ణభగవానునికి సహకరిస్తూ కురుక్షేత్రయుద్ధంలో అనేకమందిని సంహరించాడు. ఆ విషయాన్ని స్వయంగా శ్రీకృష్ణుడే తన విశ్వరూప అవతార సమయాన, అతనికి గీతోపదేశం చేసే సమయంలో చెప్పాడిలా. "అర్జునా, రణరంగంలో ఎదుటివారు శత్రువులే. ఆ శత్రువులను ఎదుర్కోవడంలో, సంహరించడంలో కేవలం నీవు నిమిత్తమాత్రుడవే. నా ఆదేశానుసారంగానే ఇదంతా జరుగుతుంది". భగవద్గీత అనేది అర్జునుడి కారణంగానే ఈ జగానికి లభించింది.

కురుక్షేత్ర యుద్ధంలో ప్రముఖ పాత్ర వహించినది శూరుడైన కిరీటియే. పాండవుల సైన్యానికి ప్రధాన సేనాపతి అర్జునుడే. శ్రీకృష్ణభగవానుడు తాను యుద్ధంలో పాల్గొనని చెప్పి, అర్జునుని రథానికి సారథి అయ్యాడు. కురుక్షేత్ర సమయంలో అర్జునుడు తన అసమాన శూరత్వాన్ని ప్రదర్శించి వైరి వర్గాన్ని నేలకూల్చాడు. కురుక్షేత్ర రణరంగంలో అర్జునుడు శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని కనులారా దర్శించి ఆయన గీతోపదేశాన్ని విని, యుద్ధం పట్ల తన విముఖతను తొలగించుకుని, ధనుర్బాణాలను చేత పట్టాడు.

ద్రౌపది స్వయంవర వార్తను తెలుసుకున్న పాండవులు తాము నివసించే ఏకచక్రపురం నుండి స్వయంవరానికి బయల్దేరారు. మత్స్యయంత్రాన్ని ఛేదించడమన్నది అర్జునునికే సాధ్యమవుతుందని శ్రీకృష్ణుడికి, పాండవులకు తెలుసు. ఆ స్వయంవరానికి ఎన్నో దేశాల నుంచి వీర, శూర రాజకుమారులు అరుదెంచారు. పంచపాండవులు బ్రాహ్మణ వేషధారణలో స్వయంవర సభలోకి ప్రవేశించారు. దుర్యోధనుడు, శల్యుడు, జరాసంధుడు, సాల్వుడు లాంటి మహారాజులు స్వయంవరంలో ద్రౌపదిని తాము గెలుచుకోగలమన్న ధీమాతో ఉన్నారు. సభలోకి ప్రవేశించిన బ్రహ్మచారులను చూసి, ఈ విప్రులా స్వయంవరంలో పాల్గొనేది అనుకుంటూ అతిరథులు, మహారథులైనవారంతా నవ్వుకున్నారు. బ్రాహ్మణులను చూసి పరిహసించిన వారంతా ధనుస్సును ఎక్కుపెట్టి మత్స్యయంత్రమును ఛేదించడంలో విఫలమయ్యారు. అప్పుడు అర్జునుడు లేచి, ఆ సభలోనే ఆసీనుడై ఉన్న శ్రీకృష్ణునికి మనస్సులోనే ప్రణామాలు అర్పించాడు. తన గురువును తలచుకుని ఆయనకు నమస్కరించాడు. సభకు వందనం చేశాడు. శ్రీకృష్ణుని కనుల సంకేతాన్ని గ్రహించి, మత్స్యయంత్రాన్ని ఛేదించటానికి అర్జునుడు ముందుకొచ్చాడు. నీటిలో చూస్తూ, గిరగిరా తిరుగుతున్న ఆ మత్స్యాన్ని చూస్తూ దాన్ని ఛేదించాడు. ఆ విప్రుడు ఇంతటి సాహసికుడా అని సభికులందరూ నివ్వెరపోయారు. కానీ వెంటనే తేరుకుని, జయజయ ధ్వానాలు చేస్తూ చప్పట్లు కొట్టారు.

కొంతమంది విప్రుని వేషాలు ధరించి ఉన్న పాండవులను అవమానించటానికి సిద్ధపడ్డారు. అర్జునునికీ, కర్ణునికీ వాదోపవాదాలు ఆరంభమై, అటు తరువాత వారిరువురి మధ్య శరాలతో యుద్ధం జరిగింది. కర్ణుడు ఓటమిపాలై తల దించుకోవలసి వచ్చింది. విజయంతో ఇంటికి తిరిగి వచ్చిన వారు తల్లి ఆదేశానుసారం ద్రౌపది ఆ పంచపాండవులకు భార్య అయింది. ఆ విధంగా ద్రౌపది అయిదుగురు భర్తలను పొందటానికి పూర్వజన్మ కారణమైంది. అయిదుగురు అన్నదమ్ములకు ద్రౌపది పత్ని కావడం వల్ల వారిమధ్య ఎటువంటి విరుద్ధ భావాలు ఏర్పడకుండా ఉండటానికి దేవర్షి నారదుడు వారికి ఒక సలహా ఇచ్చాడు. సంవత్సరానికి రెండు మాసాల పన్నెండు రోజులు ద్రౌపది ఒక్కొక్కరి వద్ద ఉండాలి. ద్రౌపదీదేవి ఒకరివద్ద ఉన్నప్పుడు, వారి ఏకాంతానికి మిగిలిన నలుగురు సోదరులు భంగం కలిగించకూడదు. మరొకరు వారి వద్దకు వెళ్ళకూడదు. వారిని చూడకూడదు. అలా వారి వద్దకు కానీ, వారి మధ్యకు కానీ వెళ్ళినట్లయితే వారు వారందరితో కలిసి వుండే అర్హతను కోల్పోతారు. వారు పన్నెండు సంవత్సరాలు

దేశ బహిష్కరణ శిక్షను పొందుతారు. నారదుని మాటలను పంచపాండవులు అంగీకరించి ఆ నియమాన్ని పాటించసాగారు.

ఒకసారి అర్జునునికి ఆ నియమాన్ని తప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒకనాడు ఒక విప్రుడు తన గోవులను ఒక దొంగ అపహరించుకుపోతుంటే ఆ బ్రాహ్మణుడు రాజసౌధం ముందు నిలబడి "నా గోవులను ఒక దొంగ అపహరించుకుపోతున్నాడు, నా గోవులను రక్షించండి" అంటూ గట్టిగా అరవసాగాడు. ఆ పొలికేకలను విన్న అర్జునుడు రాజభవనం నుండి బయటకు వచ్చాడు. అక్కడ దీనంగా నిలబడి ఉన్న బ్రాహ్మణుడిని చూశాడు. ఏం జరిగిందని ఆ విప్రుని అడిగి విషయం తెలుసుకున్నాడు. అతనిని ఓదార్చి, ధైర్యం చెప్పి అతని గోవులను దొంగిలించిన వారినుంచి రక్షించి ఆ బ్రాహ్మణునికి అప్పగిస్తానని మాట ఇచ్చాడు. అర్జునుని ఆయుధాలు ధర్మరాజు మందిరంలో ఉన్నాయి. అందువల్ల అర్జునునికి ధర్మసంకటం ఏర్పడింది. ధర్మరాజు ద్రౌపదితో ఉన్నాడు. అన్నగారి మందిరంలోకి వెళితే కానీ, తాను ఆయుధాలను తెచ్చుకోలేడు. ద్రౌపది, యుధిష్ఠిరుల ఏకాంత మందిరానికి వెళితే నియమ విరుద్ధమవుతుంది. ఆ కారణంగా తాను పన్నెండేళ్ళు రాజ్యబహిష్కరణ శిక్షకు గురవుతాడు. కాని తాను బ్రాహ్మణునికి మాట ఇచ్చాడు. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతే క్షత్రియ ధర్మభంగమవుతుంది. తానిప్పుడు ఏం చేయాలి?

నియమ భంగమా? క్షత్రియ ధర్మాన్ని తప్పడమా? అని ఆలోచించి క్షత్రియ ధర్మాన్ని తప్పకుండా, తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తన కర్తవ్యమని నిశ్చయించుకున్నాడు. అర్జునుడు నియమ భంగం చేసి, యుధిష్ఠిరుని మందిరంలోకి ప్రవేశించి తన ఆయుధాలను తెచ్చుకుని, దొంగల బారినుండి గోవులను రక్షించి వాటిని ఆ బ్రాహ్మణునికి అప్పగించి తన మాటను నిలబెట్టుకున్నాడు.

అటుపిమ్మట తన సోదరుడైన ధర్మరాజు వద్దకు వెళ్ళి ద్రౌపది, తన సోదరుడు ఏకాంతంలో ఉండగా తాను వారి మందిరంలోకి వారి అనుమతి పొందకుండా ప్రవేశించి, నియమభంగం చేశానని, అందుకు తనకు దేశ బహిష్కరణ శిక్ష విధించమని ధర్మరాజును కోరాడు. ధర్మరాజు అర్జునునికి నచ్చచెప్పటానికి ప్రయత్నించినప్పటికీ అర్జునుడు వినలేదు. తాను ధర్మాన్ని, నియమాన్ని తప్పటానికి అంగీకరించలేదు. "పూజ్య సోదరా! రాజ ధర్మం పాటించటానికి ఆయుధాలను తీసుకోవలసి వచ్చింది. క్షత్రియ ధర్మానికి బద్ధుడనైనప్పటికీ, నియమాన్ని అతిక్రమించినందుకు నేను శిక్షార్హుడనే" అని వినయంగా చెప్పి శిక్షను అనుభవించటానికి రాజ్యం వదిలివెళ్ళిపోయాడు అర్జునుడు. అర్జునుని సత్యసంధత, నియమ పాలన, ధర్మం, స్థైర్యానికి ఇది చక్కని ఉదాహరణ.

కౌరవులకు, పాండవులకు మధ్య యుద్ధం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. శ్రీకృష్ణభగవానుని సహాయాన్ని కోరటానికి దుర్యోధనుడు, అర్జునుడు ఆయన వద్దకు వెళ్ళారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు నిద్రిస్తున్నాడు. ఆయన నిద్ర లేచేవరకు వారు వేచి ఉండవలసి వచ్చింది. దుర్యోధనుడు ఆయన తలవైపు కూర్చున్నాడు. అర్జునుడు ఆయన పాదాల వైపు కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు నిద్ర లేవగానే పాదాల వద్ద ఉన్న అర్జునుడు కనిపించాడు. శ్రీకృష్ణుని చూపు తన మీద నిలవగానే భక్తితో, గౌరవంతో, వినయంతో నమస్కరించాడు అర్జునుడు. ఆ తరువాత ఆయన తన తల వద్ద ఉన్న దుర్యోధనుని చూశాడు. వారు ఏ పనిమీద వచ్చిందీ తెలిసినప్పటికీ, శ్రీకృష్ణభగవానుడు వారిరువురు వచ్చిన పని గురించి ప్రశ్నించాడు. ఆ ఇద్దరూ ఆయన సహాయం కోరి వచ్చామని చెప్పారు. దుర్యోధనుడు శ్రీకృష్ణునితో చెప్పాడు. "కృష్ణా నిన్ను సహాయం కోరటానికి ముందుగా వచ్చినది నేనే. నా తర్వాతనే అర్జునుడు నీ వద్దకు వచ్చాడు. అందువల్ల ముందుగా వచ్చిన నాకే నీవు సహాయం చేయాలి".

శ్రీకృష్ణభగవానుడు ప్రశ్నార్థకంగా అర్జునుని చూశాడు. దుర్యోధనుడు చెప్పింది నిజమే అన్నట్లుగా అర్జునుడు తల వూపి మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు శ్రీకృష్ణుడు దుర్యోధనునితో "రాజా! దుర్యోధనా, నువ్వు ముందుగా వచ్చినమాట నిజమే. కానీ నేను ముందుగా కళ్ళు తెరిచి చూసింది నా పాదాల చెంత ఉన్న అర్జునుడిని. అయినప్పటికీ మీరిద్దరూ కూడా నాకు కావలసినవారే. కనుక మీ ఇద్దరినీ నిరాశ పరచకుండా మీ ఇద్దరికీ నేను సాయం చేస్తాను" అని చెప్పి, ఒకవైపు సమస్త యాదవ సైన్యము, యాదవ వీరులు శస్త్రాస్త్రాలు, ఆయుధాలు ధరించి ఉంటారు. మరోవైపు నేను నిరాయుధుడనై యుద్ధములో పాల్గొనకుండా ఉంటాను. ఎవరికేది కావాలో కోరుకోండి. ముందుగా తన కోరికను తెల్పవలసింది అర్జునుడే. ఎందుకంటే ముందుగా నేను చూసింది అర్జునుడిని కనుక".

అర్జునుడు శ్రీకృష్ణుడిని వినమ్రతతో నమస్కరించి, "దేవా! నువ్వు యుద్ధము చేయకపోయినా, ఆయుధము పట్టకపోయినా నాకు సమ్మతమే. నా వెంట నీవుంటే చాలు. మాకు నీ అండ కావాలి" అని పలికాడు.

అర్జునుడు యాదవసైన్యాన్ని కోరుకుంటాడేమోనని దుర్యోధనుడు భయపడ్డాడు. ఒంటరిగా, నిరాయుధుడిగా ఉండే కృష్ణుడిని కోరుకుంటే వారికి ఆయన సహాయం ఏముంటుంది? ఈ విషయం ఆలోచించలేదా అర్జునుడు? భక్తి అనే ఉన్మాదమునకు ఇది పరాకాష్ఠ అనుకున్నాడు దుర్యోధనుడు. శ్రీకృష్ణుని శక్తిని గ్రహించి, అతనెంతటి మహిమాన్వితుడో, కృష్ణుడు తమ వెంట ఉంటే తమకు విజయం లభిస్తుందని అర్జునుడు పరిపూర్ణంగా నమ్మాడు. శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుని రథానికి సారథ్యం వహించాడు.

**(ఇంకా ఉంది)**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్విని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఈ నెల సామాన్యంగా ఉంటుంది. ఆర్థికంగా కొంతమేర పుంజుకోగలరు. ప్రతి విషయంలో ఆచితూచి నడుచుకోగలరు. ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండటం మంచిది. మహాన్యాస రుద్రాభిషేకం, నవగ్రహ ప్రదక్షిణలు చేస్తే అనుకూలంగా ఉంటుంది.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చేస్తున్న పనిలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అనారోగ్య సూచనలు ఉన్నాయి. అకస్మిక ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. ఒకదానికి, రెండవ దానికి వ్యత్యాసాలు ఉన్నాయి. మాట పట్టింపులు రాకుండా చూసుకోవాలి. దైవాన్ని పూజించడం వల్ల అనుకూలంగా ఉండును. దేవతారాధనలు తప్పనిసరిగా చేయాలి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఎవరితోనైనా సమన్వయం కలిగి సామరస్య ధోరణితో మాట్లాడాలి. ఎంత పెద్ద సమస్య అయిన ఇట్టే పరిష్కారం అవుతుంది. అకస్మికంగా ధన రాబడి ఉంది. చక్కగా ప్లాన్ చేసుకోండి. గురువుని పట్టుకొనిన పనులు పూర్తి అగును.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. అలాగే సమస్యలు కూడా పక్కనే ఉంటాయి. ప్రయత్న లాభం ఉంటుంది. అందరి మెప్పు పొందుతారు. అకస్మిక ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి. విద్యార్థులు చాలా ఓర్పుతో ఉంటే పరీక్షల్లో విజయం సాధిస్తారు.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంది. పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. అష్టమ శని వలన ఏదైన సమస్య వస్తే, శనికి తైలాభిషేకం, దానాలు, జపాలు చేయించి విజయం పొందండి. మహాన్యాస రుద్రాభిషేకం వల్ల సత్ఫలితాలు కలుగుతాయి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. భక్తి విశ్వాసాలతో ఉండటం వలన గతం కంటే కొంత మెరుగ్గా ఉంటుంది. దినదిన గండంగా గడుస్తుంది. నవ గ్రహ ప్రదక్షిణలు చేయండి. వివాదాలకు దూరంగా ఉండండి. గొడవ వస్తే, నోట్లో నీరు పెట్టుకొండి. గ్రహాలను ఆరాధించడం మంచిది.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా సంతృప్తికరంగా ఉంటుంది. దైవ బలంతో ప్రతి వ్యతిరేక విషయాన్ని మీకు అనుకూలంగా మార్చుకుంటారు. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన ఆభరణాలు, వస్తు వాహన యోగములు సమకూర్చుకునేందుకు ఇది సరైన సమయం. సత్యదేవుని వ్రతం చేయడం మంచిది.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉండదు. ఇంటా బయటా ఏ రూపంలోనూ మనశ్శాంతి అనేదే ఉండదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉంటాయి. ఎన్ని సమస్యలు ఉన్నా, అనారోగ్య సమస్యలు ఉన్నా, మృత్యుంజయ జపం, నవగ్రహ ప్రదక్షిణాలు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల లోపు 45 ప్రదక్షిణాలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. తొందరపాటు లేకుండా భక్తితో గోవింద నామాలు చేయడం వల్ల ఎంతటి సమస్య అయిన ఇట్టే పరిష్కారం అవుతుంది. మీ ఓర్పే మీకు రక్షగా ఉంటుంది. తక్కువగా మాట్లాడుతూ మౌనంగా ఉండటం వల్ల లాభం ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సాధారణంగా ఉంటుంది. ఆదాయం ఉంది. ప్రతి విషయం నిదానంగా పూర్తి అవుతుంది. మీరు ప్రశాంతంగా ఉండండి. చక్కటి ఫలితాలు పొందుతారు. దూర ప్రయాణాల్లో అనుకూలంగా ఉంటుంది. నవగ్రహ ప్రదక్షిణాలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విషయంలో కేర్‌ఫుల్‌గా ఉండండి. ఎవరికైనా డబ్బులు ఇస్తే, అవి తిరిగి రావడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. విమర్శలకు చోటు ఇవ్వొద్దు. అధిక ప్రేమ, అనవసర విషయాల వలన తెలియని సమస్యలు వస్తాయి. నిరాశ నిస్పృహలకు లోనవుతారు. నవగ్రహ ఆరాధన చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతి విషయంలో పట్టుదల కలిగి కార్యదీక్షాపరులుగా అనుకున్న పనిని సాధించగలరు. వర్గ భేదాలతో ఉండరాదు. ఇది మీకు చాలా అమూల్యమైన సమయమని గుర్తించండి. కుటుంబంలో సమస్యలు ఉన్నాయి. వివేకంగా ఆలోచన చేసి పరిష్కరించుకోండి. గ్రహారాధన చేయడం అవసరం.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. పుష్యమాసానికి మరో పేరేమిటి?
2. ఆండాళ్ – అంటే ఏమిటి?
3. తులసీదాసు రచనలు ఏవి?
4. పిల్లిని రక్షించిన ఎలుక పేరేమిటి?
5. పుష్యమీ నక్షత్రం ఎవరిది?
6. తారాచంద్రుల కుమారుడెవరు?
7. వాలికి ఇంద్రుడు ఏమి ఇచ్చాడు?
8. తులసీదాసు తండ్రి ఎవరు?
9. కుక్కలో పాండురంగడిని చూసిన భక్తుడెవరు?
10. అంజనాదేవి పూర్వజన్మలో ఎవరు?
11. శ్రీవారి నిలయమైన ఆనంద పర్వతం ఎవరి తనయుడు?
12. శనిదేవుని అనుగ్రహానికి ఉత్తమ మార్గమేది?
13. ఏ ఊరిలోని ఇళ్ళకు తలుపులుండవు?
14. పుట్టుకతోనే దంతాలున్నవి ఎవరికి?
15. శనిదేవునికి ఇష్టమైన పూవు ఏది?

1. ____________
2. ____________
3. ____________
4. ____________
5. ____________
6. ____________
7. ____________
8. ____________
9. ____________
10. ____________
11. ____________
12. ____________
13. ____________
14. ____________
15. ____________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. మూడు + మూడు (పురాణ, ప్రసూతి, స్మశాన, వైరాగ్యాలు; వివేక, నిమిత్త, తృణాగ్ని వైరాగ్యాలు); 2. కోలహుడు అనే రాక్షసుడు; 3. కాపవ్వుడు; 4. సుద్యుమ్నుడు; 5. కర్కటి; 6. బోయజాతి; 7. పురూరవుడు; 8. విరాధుడు; 9. అనంతాళ్వాన్; 10. ముక్తాబాయి; 11. తులామాసంలో; 12. అభంగాలు; 13. మహంతు మంఠం నుండి; 14. నారాయణగిరి మీద; 15. సాధువు

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకరశాస్త్రి, 2. వనమాల రామలింగాచారి, 3. రమాదేవి, 4. యం. మురళీకృష్ణ, 5. కె. యతీంద్రులు

పేరు: ____________
చిరునామా: ____________
____________
____________
____________
పిన్‌కోడ్: ____________
ఫోన్: ____________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**కె. యతీంద్రులు**



Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక



**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**
H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq